మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

కేరళ స్థానిక సంస్థల్లో యుడిఎఫ్‌కు ఆధిక్యత
జిల్లా పరిషత్‌లలో సగం గెలుచుకున్న ఎల్‌డిఎఫ్
తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎన్‌డిఎ అనూహ్య విజయం 05

సంపుటి 09, సంచిక: 18 | ఆదివారం | 14-12-2025 | మహబూబ్‌నగర్
Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## మెస్సీతో సిఎం ఫ్రెండ్లీ మ్యాచ్
# రేవంత్‌రెడ్డి గోల్



### అభిమానుల కేరింతలతో హోరెత్తిన ఉప్పల్ స్టేడియం

అలరించిన మ్యూజికల్ నైట్, లేజర్ షో

ప్రేక్షకులను ఉర్రూతలూగించిన రాహుల్ సిప్లిగంజ్ నాటు పాట


ప్రజాపక్షం/హైదరాబాద్


ఉప్పల్ స్టేడియంలో సింగరేణి ఆర్‌ఆర్, అపర్ణ మెస్సీ జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి సింగరేణి, మెస్సీ అపర్ణ జట్లు పోటీ పడ్డాయి. ఈ మ్యాచులో మ్యాచ్ 18వ నిమిషంలో గ్రౌండ్‌లోకి దిగిన సిఎం రేవంత్ రెడ్డి వచ్చి రాగానే గోల్ కొట్టి అలరించాడు. యువకులతో పోటీ పడి మరీ సిఎం రేవంత్ రెడ్డి గోల్ కొట్టడంతో అభిమానుల కేరింతలతో ఉప్పల్ స్టేడియం దద్దరిల్లింది. అనంతరం గ్రౌండ్‌లోకి దిగిన మెస్సీ కాసేపు సిఎం రేవంత్‌తో గేమ్ ఆడారు. ఆ తర్వాత ప్లేయర్స్‌తో కలిసి ఫొటో దిగారు. అనంతరం బాల్స్‌ను స్టేడియం స్టాండ్స్‌లోకి కిక్ చేశారు మెస్సీ. అంతకుముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ,

తరువాయి 2లో

## మహాత్మాగాంధీ పేరులో
# తప్పేముంది?

- ఉపాధిహామీ పథకం పేరులో 'గాంధీ'ని తొలగించడంపై విరుచుకుపడిన కాంగ్రెస్
- 'విప్లవాత్మక పథకానికి క్రెడిట్ పొందడం కోసమే ఈ చర్య' అని మండిపాటు
- పథకాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని విమర్శ
- ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని నిలదీత



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరు మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పథకం పేరులో గాంధీ పేరును తొలగించడంపై కాంగ్రెస్ మండిపడింది. పథకాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని విమర్శించింది. ఈ చర్యను ఎందుకు తీసుకున్నారని, మహాత్మాగాంధీ పేరులో ఉన్న తప్పు ఏమిటని నిలదీసింది. ఈ చర్యపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ పథకాలు, చట్టాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని

తరువాయి 2లో


## 13 వేల సర్పంచ్‌లు.. 78 వేల వార్డు సభ్యులు
# పట్టం ఎవరికో?

- 3,911 గ్రామాల్లో నేడు రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- బరిలో 13,128 సర్పంచ్ అభ్యర్థులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రెండో విడుత పంచాయతీ ఎన్నికలను సర్వం సిద్ధమైంది. నేడు (ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా 3,911 గ్రామాల్లో రెండవ దశ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 13,128 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉండగా, 29,903 వార్డులకు 78,158 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తయిన వెంటనే భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఎన్నికల అధికారులు ఫలితాలను ప్రకటిస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వార్డు సభ్యుల నుంచి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లలో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని

తరువాయి 2లో



## 'ఓట్ చోరీ'పై
# ఢిల్లీలో నేడు ర్యాలీ

- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కుపై నిలదీయనున్న కాంగ్రెస్
- ఓట్‌చోరీపై సంతకాల సేకరణ మెమోరాండంను రాష్ట్రపతికి సమర్పించే అవకాశం

**న్యూఢిల్లీ :** 'ఓట్‌చోరీ'పై ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఉధృతం చేయనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ చేపట్టనుంది. ఎన్నికలను రిగ్గింగ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యారనే ఆరోపణలపై వాటిని నిలదీయాలని భావిస్తోంది. ర్యాలీలో అనంతరం నిర్వహించే సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్,

తరువాయి 2లో

# పనితీరు భేష్



- రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం పట్ల రాహుల్‌గాంధీ సంతృప్తి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు
- ఓట్ చోరీపై మరింత పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, పార్టీ పనితీరు, గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం పట్ల లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విజయాలను సాధించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, క్షేత్ర కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఒక రోజు పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీకి సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వసలహాదారు హర్కర వేణు గోపాల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి

తరువాయి 2లో

## విభజన రాజకీయాలకు
# మేం వ్యతిరేకం

- వాటికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికలకు వెళతాం
- ఎఐ టెక్నాలజీతో బిజెపిని ఓడిస్తాం
- విజన్ ఇండియా సమ్మిట్‌లో యుపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్
- అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే ధ్యేయంగా విజన్ ఇండియాలో పనిచేస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

సమాజ్ వాదీ పార్టీ విభజన రాజకీయాలకు వ్యతిరేకమని, దానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐ టెక్నాలజీని ఉపయోగించుకొని బిజెపి ఓడిస్తామని పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తెలిపారు. పరిపాలనలో సాంకేతికత వినియోగం, భవిష్యత్తులో సాంకేతికత రూపాంతరం వంటి అంశాలపై యువతలో అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా సమాజ్ వాది పార్టీ అధ్వర్యంలో శనివారంహైదరాబాద్ లో జరిగిన విజన్ ఇండియా సమ్మిట్ లో అఖిలేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూల, అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే తమ ధ్యేయంగా విజన్ ఇండియా ద్వారా పని చేస్తామని తెలిపారు. రైతులకు, మౌలిక సదుపాయాల కల్పనకు, పట్టణీకరణ, పట్టణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, ఆరోగ్య, తదితర రంగాల్లో ఏఐ టెక్నాలజీని

తరువాయి 2లో

# కొత్త నిబంధనలొద్దు




- హెచ్1బి వీసా లక్ష డాలర్లు ఫీజుపై కోర్టుకెక్కిన 19 అమెరికా రాష్ట్రాలు
- కార్మికుల కొరత, టెక్ సంస్థలు, పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకుంటాయని ఆందోళన

న్యూయార్క్/వాషింగ్టన్

హెచ్ 1 బి వీసా దరఖాస్తులపై ఏకమొత్తంగా లక్ష డాలర్లు వసూలు చేయాలని ట్రంప్ యంత్రాంగం విధించిన కొత్త నిబంధనలను అమెరికాలోని 19 రాష్ట్రాలు కోర్టుల్లో సవాలు చేశాయి. ఇప్పటికే ఈ వీసా నిబంధనలపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాలు చేసింది. అడ్మినిస్ట్రేటివ్ ప్రొసిడ్యూర్ యాక్ట్, ఇమ్మిగ్రేషన్‌–నేషనాలిటీ యాక్ట్‌లను ఉల్లంఘించి లక్ష డాలర్లు చెల్లించాలనే కొత్త నిబంధన ట్రంప్ తెచ్చారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ నిబంధనలవల్ల అమెరికాలో కార్మికుల కొరత వస్తుందని, టెక్ సంస్థలు, పరిశ్రమలు కార్మికుల కొరతతో సంక్షోభంలో చిక్కుకుంటాయని తమ తమ దావాల్లో ప్రభుత్వాలు పేర్కొన్నాయి. 1950వ దశకం నుండి అమెరికా హెచ్1 బి వీసా కార్యక్రమం కింద కీలక రంగాలలో వృత్తినిపుణులను తాత్కాలిక ప్రాతిపదికపై అనుమతించింది. 1990వ దశకం నుండి ఆరు సంవత్సరాలు ఉండేవిధంగా ప్రత్యేకవృత్తుల్లో హైర్ వర్కర్లను అనుమతించింది. ట్రంప్ యంత్రాంగం చట్టవిరుద్ధమైన నిర్ణయం తీసుకుందని, పార్లమెంటు ఆమోదం లేకుండా

తరువాయి 12లో

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగులది
# దారుణ స్థితి

- ఆకర్షణీయ జీతం, విలాసవంత వసతులు ఉన్నా ఉద్యోగ భద్రత లేదు
- ఉద్యోగులకు హక్కుల రక్షణ చట్టం తేవాలి
- హైకోర్టు స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి చూస్తే అంతా బేషూగ్గానే కనబడుతుందని, వాస్తవ పరిస్థితిలోకి వెళితే అసంఘటిత కార్మికుల మాదిరిగా వారి దుస్థితి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. భారీ జీతభత్యాలు, ఆకర్షణీయమైన సౌకర్యాలు, విలాసవంత వసతులు ఉన్నప్పటికీ వాళ్ల ఉద్యోగాలకు భద్రత లేకుండాపోయిందని పేర్కొంది. దేశ ఆర్థిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న సాఫ్ట్ వేర్

తరువాయి 12లో

# ఒట్టేసి చెప్పండి
## ఓటేశారా.. లేదా?



- వేయకుంటే మా డబ్బులివ్వండి
- దేవుడి ఫోటో, పురుగుల మందు డబ్బాతో ఓడిన సర్పంచ్ అభ్యర్థులు
- నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాల్లో సిత్రాలు

ప్రజాపక్షం/నార్కట్ పల్లి

తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో చిత్ర విచిత్ర ఘటనలు వెలుగుచూస్తున్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం, మహబూబాబాద్ జిల్లాలో ఓడిన అభ్యర్థులు తిరిగి డబ్బులు వసూలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో మొత్తం ఓట్లు 1490 ఉండగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి జక్కల పరమేష్ కు 973 ఓట్లు రాగా, బిఆర్ఎస్ బలపరిచిన కల్లూరి బాలరాజుకు 525 ఓట్లు వచ్చాయి. గ్రామంలోని బిఆర్ఎస్ పార్టీకి

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ మాట లెక్కచేయని థాయ్‌లాండ్

**బ్యాంకాక్:** కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు రెండు దేశాలు అంగీకరించాయని, రెండు దేశాలూ శాంతికి సిద్ధంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా కాంబోడి యాపై థాయ్‌లాండ్ దాడులు ఆగలేదు. దాడులు ఆపేదిలేదని థాయ్ లాం డ్ తాత్కాలిక మంత్రివర్గ నాయకుడు, ప్రధానమంత్రి అనుటిన్ చార్ విరాకుల్ స్పష్టం చేశారు. కాంబోడియా ప్రభుత్వం తన దళాలన్నింటినీ సరి హద్దుల నుండి తరలించాలని, మందుపాతరలను తొలగించాలని, అప్పటి వరకూ ట్రంప్ ప్రతిపాదన ఒక ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉంటుందని అనుటిన్ స్పష్టం చేశారు. "మా దేశానికి, మా ప్రజలకు ఎలాంటి హానీ జర గదని మేం భావించేంతవరకూ మా సైనిక చర్య కొనసాగుతుంది, ఆ వైఖరి ఏమిటో శనివారం ఉదయం చేతల్లోనే తెలియజేశాం, కాంబోడియా తీరు తెన్నులను మా దేశం స్వయంగా ధృవీకరించుకోవాల్సి ఉంటుంది" అని అనుటిన్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గడచిన మంగళవారం నుండి కొత్తగా మొదలైన సంఘర్షణల్లో 24 మంది మరణించగా రెండు వైపులా సరిహద్దు గ్రామాల నుండి 7,00,000 మంది ఇళ్ళు ఖాళీచేసి సుర క్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

## భారత్‌పై 50 శాతం సుంకాల రద్దుకు అమెరికా కాంగ్రెస్‌లో తీర్మానం

**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారతదేశంపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ ఆ దేశ చట్టసభ కాంగ్రెస్‌లో పేర్కొన్న ముగ్గురు సభ్యులు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని భారత్‌పై విధించిన 'బాధ్యతా రాహిత్యమైన సుంకాల వ్యూహం'గా ఆ ముగ్గురు సభ్యులు విమర్శించారు. భారత్‌పై ట్రంప్ అనుసరించిన సుంకాల విధానం అమెరికాపై ప్రతికూల పరిణామాలను చూపిస్తోందని రాజా కృష్ణమూర్తి తన తీర్మానంలో పేర్కొన్నారు. కీలకభాగస్వామిగా ఉన్న భారత్‌పట్ల అనుసరించిన ఈ వైఖరి అమెరికాకు ఏ మాత్రం కలిసిరావడం లేదు. ఈ టారిఫ్‌లను తొలగిస్తే, ఆర్థిక, రక్షణ రంగాలలో రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరతాయని ఆయన పేర్కొన్నారు. భారత్ నుండి దిగుమతి చేసుకునే దిగుమతులపై నేషనల్ ఎమర్జెన్సీ కింద విధించిన ఈ సుంకాలను రద్దుచేయాలని కోరారు. ఉత్తర కరోలినాకు చెందిన దిగువసభ సభ్యుడు డెబోరాహ్ రోస్, టెక్సాస్‌కు చెందిన సభ్యుడు మార్క్ వెస్లే, ఇల్లినోయిస్‌కు చెందిన రాజా కృష్ణమూర్తి ముగ్గురూ శనివారం అమెరికా కాంగ్రెస్ దిగువ సభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. ఉత్తర కరోలినా ఆర్థిక వ్యవస్థ చాలా లోతుగా భారత్ వాణిజ్యంతో అనుసంధానమై ఉందని రోస్ పేర్కొన్నారు. బిలియన్లకు పైగా డాలర్లు భారత్ కంపెనీలు పెట్టుబడిగా సమకూర్చాయని, వేలాది ఉద్యోగాలు సృష్టించాయని, ప్రత్యేకించి టెక్నాలజీ రంగంలో, రీసెర్చ్ ట్రయాంగిల్ లైఫ్ సైన్సెస్‌లో ఈ పెట్టుబడులు సమకూర్చారని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా ఇంత భారీగా సుంకాలు ట్రంప్ విధించలేదు. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఇఇపిఎ) కింద నేషనల్ ఎమర్జెన్సీ ప్రాతిపదికపై విధించిన ఈ సుంకాలను రద్దుచేయాలని తీర్మానం కోరింది. ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీ నుండి అమెరికాకు భారత్ చేసే ఎగుమతులపై 25 శాతం సుంకాలు విధించగా, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నారన్న కారణంగా జరిమానాగా మరో 25 శాతం సుంకాలు విధించారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోలుచేసి, దానిని భారత్‌లో శుద్ధిచేసి విక్రయించడంద్వారా రష్యాకు నిధులు సమకూర్చి ఉక్రేన్‌లో యుద్ధాన్ని ప్రోత్సహిస్తోందన్నది ట్రంప్ చేసిన ఆరోపణ.



# ఉక్రేన్‌పై బెర్లిన్‌లో తుది విడత చర్చలు

### క్రిస్మస్ నాటికి ఒప్పందం : ట్రంప్ పట్టుదల

**వాషింగ్టన్:** ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం అమలు చేయడంపై జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆదివారం తుది విడత చర్చలు జరుగుతాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా ఇతర యూరోపియన్ యూనియన్ నాయకులతో ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ ఈ తుది విడత చర్చలు చేయడానికి. ఈ ఆది, సోమవారాలలోనే చర్చలు జరిగే అవకాశం ఉంది. ఐతే ఈ తుది విడత సమావేశంలో యూరప్‌లోని ఏ దేశాల నాయకులు పాల్గొంటారన్న విషయం ఇంకా ఖరారు కాలేదు. 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రిక మొదటగా స్పందిస్తూ, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ఈ చర్చల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొంది. గడచిన కొద్దిరోజులుగా ఉక్రేన్-రష్యా మధ్య ఉన్నతస్థాయి చర్చలు కొనసాగిస్తూ ఈ వ్యవహారాల్లో రాటుదేలిన విట్‌కాఫ్ తుది విడత యూరోపియన్ యూనియన్ నాయకులతో జరిగే ఉన్నతస్థాయి చర్చల్లో కూడా ప్రముఖపాత్ర వహిస్తారు. ఇటీవలి వారాల్లో ఉక్రేన్-రష్యా ప్రతినిధుల మధ్య మధ్యవర్తుల జోక్యంలె అనేక విడతలుగా సమావేశాలు జరిగాయి. క్రిస్మస్ పర్వదినం నాటికి రష్యా-ఉక్రేన్ మధ్య శాంతి ఒప్పందం జరగాలని ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. ఎలాగైనా ఈ ఒప్పందం జరగాలని అమెరికా అధ్యక్షుడు చాలా పట్టుదలతో ఉన్నారు. కానీ అటు జెలెన్‌స్కీ, ఇటు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఎవరికివారు తమదైన వైఖరులకు కట్టుబడి ఉన్నారు. ఈ ఒప్పందం కుదరకుండా యూరోపియన్ యూనియన్ దేశాలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం దుష్ప్రచారం పోషిస్తున్నాయని పుతిన్ విమర్శిస్తున్నారు. ఒకటిటిబల 15 రోజులుగా యూరప్ దేశాలతో ముమ్మర పర్యటనలు చేసి, యూరప్ నాయకులతో టెలిఫోన్ సంభాషణలు చేసిన ఉక్రేన్ అధ్యక్షుడు కూడా గడచిన గురువారం ముగిసిన మూడు రోజుల ఫ్లోరిడా చర్చల తర్వాత ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికను తిరస్కరించారు. తమ భూభాగాలను రష్యాకు వదులుకునేందుకు తిరస్కరించారు. ఇందుకు యూరప్ నాయకులే కారణమని ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు. ఇదివరకే ప్రతిపాదనలతో ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను ట్రంప్‌కు ఇప్పటికే సమర్పించారు. క్రిమియా (2014), లుహాన్స్క్, డొనెట్స్క్ సహా ఐదు ఉక్రేన్ ప్రాంతాలు ప్రస్తుతం రష్యా అధీనంలో ఉన్నాయి. ఉక్రేన్ తన సైన్యాన్ని 6,00,000 కు తగ్గించుకోవాలని ట్రంప్ ప్రణాళిక చెబుతుండగా 8,00,000 వరకూ ఉండేందుకు అనుమతించాలని ఉక్రేన్ కోరుతున్నది. డాన్‌బోస్ ప్రాంతమంతా తమ అధీనంలోనే ఉండాలని రష్యా కోరుతున్నది.



ఇందులోని కొన్ని ప్రాంతాలు ఉక్రేన్ అధీనంలో ఉన్నాయి. దీనిని పుతిన్ తిరస్కరిస్తున్నారు. తదుపరి యూరప్‌పై దాడులకు ఈ ప్రాంతాన్ని పుతిన్ కేంద్రంగా మార్చుకుంటారన్నది యూరప్ నేతల భయం. ఈ పరిస్థితులమధ్య జర్మనీలో తుది విడత చర్చలకు ముందు ఆ ప్రాంతాల భవిష్యత్తుపై ట్రంప్ అంకురార్పణ చేశారు. నవంబరునెలలో ట్రంప్ 28 అంశాల ప్రణాళిక మొదట తెరమీదకు వచ్చింది. ఈ ప్రణాళిక రూపొందించిన అమెరికా రక్షణశాఖాధికారులు మొదట జెలెన్‌స్కీతో చర్చించారు. జెనీవా సమావేశంలో సవరణల తర్వాత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జెరిమే కుష్నెర్ మాస్కో వెళ్ళి పుతిన్‌తో చర్చించారు. ఆ తర్వాత ఫ్లోరిడాలో మూడురోజులపాటు ఉక్రేన్ ప్రతినిధులతో చర్చించారు.

### 450 డ్రోన్లు,30 క్షిపణులతో దాడి

ఒకవైపు కాల్పుల విరమణ యత్నాలు కొనసాగుతున్న తరుణంలో మరోవైపు రష్యా-ఉక్రేన్ పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. శనివారం నల్ల సముద్ర రీజియన్‌లో జరిపిన దాడుల్లో ఇద్దరు రష్యన్లు మరణించారు. ఈ ప్రాంతంలో అంధకారం నెలకుంది. తాజాగా రష్యా 450 డ్రోన్లు, 30 క్షిపణులతో ఉక్రేన్‌లోని ఏడు రీజియన్లపై దాడులు చేసినట్లు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ దాడుల్లో నివాసిత ప్రాంతాలు దెబ్బతిన్నాయి. రాత్రికిరాత్రి జరిగిన దాడుల్లో 41 ఉక్రేన్ డ్రోన్లు కూల్చివేసినట్లు రష్యా సైన్యం ప్రకటించింది. శీతాకాలంలో ఇంధన వనరులు, సంబంధిత మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం లక్ష్యంగా రష్యా దాడులు చేస్తోందని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. శీతాకాలంలో ఇంధన వనరులపై దాడులు మానేయాలని ఆయన కోరారు. కాగా ఉక్రేన్‌పై తాము కింఝాల్ హైపర్ సోనిక్ క్షిపణులు ప్రయోగించామని, దాడులు చేయడం కష్టంగా ఉన్నప్పుడు ఈ క్షిపణులు తమ దిశను మార్చుకుని మరోచోట దాడులు చేస్తాయన్నారు. విస్తారమైన యుద్ధ దాడులవల్ల ఝెపోరిఝియా అణుకేంద్రంలో ఎలక్ట్రిక్ గ్రిడ్ పనిచేయడం మానేసిందని ఐఎఇఎ సంస్థ ప్రతినిధులు చెప్పారు.

## పట్టం ఎవరికో?

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీచేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఇక రెండవ దశలో 415 ఏకగ్రీవమయ్యాయి. వివిధ కారణాల వల్ల 5 పంచాయతీల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో గ్రామంలో ఎన్నికలపై కోర్టు స్టే ఉంది. వార్డుల్లో 38,322 కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

# జులై ఉద్యమ ఫలితాల రక్షణకు బంగ్లా పార్టీల ఐక్యతారాగం

**ఢాకా:** బంగ్లాదేశ్ ఎన్నికలవేళ జులై ఉద్యమ నాయకుడు, ''ఇంక్విలాబ్ మంఛో'' ప్రధాన అధికార ప్రతినిధి షరీఫ్ ఒస్మాన్ హదిపై కాల్పుల ఘటనను దేశంలోని పార్టీలు ఉమ్మడిగా ఖండించాయి.విద్రోహ చర్యల ద్వారా దేశం సాధించిన సరికొత్త ఫలితాలను వమ్ము చేసేందుకు జరిగే ప్రయత్నాలను ఐక్యంగా ప్రతిఘటించాలని నిర్ణయించాయి. ప్రభుత్వ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ అధ్యక్షతన జుమానా గెస్ట్‌హౌస్‌లో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశం ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన చేసింది. దేశ ంలో ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీసి బలహీనపరచే చర్యలను, ''జులై ఉ ద్యమస్ఫూర్తి''ని దెబ్బతీసేందుకు జరిగే కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలని పార్టీలు నిర్ణయించాయి. జులై ఉద్యమకారులకు పూర్తి రక్షణ ఇవ్వాలని పలు పార్టీల నాయకులు సమావేశంలో కోరారు. ఉద్యమకాలంలో అపహరణకు గురైన ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ, బంగ్లాదేశ్ జామతే-ఎ-ఇస్లామీ, నేషనల్ సిటిజన్‌స పార్టీలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అవామీలీగ్ నాయకురాలు షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో ఒస్మాన్ హది కీలకపాత్ర వహించారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికల ప్రకటన వెలువడిన మరునాడే హదిపై గుర్తుతెలియకి వ్యక్తులు బైకుపై వచ్చి కాల్పులు జరిపి అదృశ్యమయ్యారు. కాగా, నవీన బంగ్లాదేశ్ నిర్మాణానికి 13 వ సార్వత్రిక ఎన్నికలు ఒక అవకాశమని మహ్మద్ యూనుస్ అన్నారు. బంగ్లాదేశ్ ప్రజలు ఒక సరికొత్త దేశాన్ని నిర్మించుకోవడానికి ఇదొక సువర్ణ అవకాశమన్నారు. బంగ్లాదేశ్‌లో అతర్గత భద్రతపై కూడా చర్యలు జరిగాయి. బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు ష రీఫ్ ఒస్మాన్ హదిపై కాల్పులు జరిపిన దుండగుల జాడ చెప్పినవారికి రూ. 50 లక్షల టాకాలు బహమతిగా ఇస్తామని మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. వచ్చేఏడాది ఆరంభంలో జరిగే సార్వత్రిక ఎన్నిక ల్లో షరీఫ్ ఒస్మాన్ హది ఢాకా-8 నియోజకవర్గం నుండి పార్లమెంటుకు స్వ తంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. దుండగులు జరిపిన కాల్పుల్లో ఆయన తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఫిబ్రవరి 12న పార్లమెంటు ఎన్నికలు :** బంగ్లాదేశ్ చరిత్రను కొత్త మలుపు తిప్పే సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన జరుగుతాయి. అదేరోజు జులై ఛార్టర్‌పై జాతీయస్థాయిలో రిఫరెండం కూడా నిర్వహిస్తారు. బంగ్లాదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎం.ఎం.నజీర్ ఉద్దీన్ గడచిన గురువారం (డిసెంబరు11) సాయంత్రం ఢాకాలో 13వ పార్లమెంటుకు నిర్వహిం చే సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటించారు. ఈ నెల 29వ తేదీ నుండి నా మినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. డిసెంబరు 30 నుండి జనవరి 4వ తేదీ వరకూ నామినేషన్లను పరిశీలన, జనవరి 20వ తేదీ వరకూ ఉపసంహరణలకు గడువు ఇచ్చారు.

## రేవంత్‌రెడ్డి గోల్

(మొదటి పేజీ తరువాయి)



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. స్టేడియం లో మెస్సీ మేనియా వెల్లివిరిసింది. అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. మెస్సీ అభిమానులు జెర్సీ నెంబర్ 10తో స్టేడియానికి తరలి వచ్చారు. స్టేడియం, పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం రేవంత్ రెడ్డి, మెస్సీ ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. సింగరేణి ఆర్ఆర్, అపర్ణ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. రేవంత్ రెడ్డి సింగరేణి ఆర్ఆర్ తరఫున, మెస్సీ అపర్ణ జట్టు తరఫున బరిలోకి దిగుతున్నారు. కోల్‌కతా ఘటనతో హైదరాబాద్ నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. అంతకుముందు స్టేడియంలో మ్యూజికల్ నైట్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాహుల్ సిప్లిగంజ్ నాటు నాటు పాటతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. మంగ్లీ, సిప్లిగంజ్ తమ ఫోక్ సాంగ్స్‌తో అలరించారు.

**హైదరాబాద్‌లో అడుగుపెట్టిన మెస్సి...**

ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సి హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా నేడు నగరానికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సి, నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అతనితో పాటు 200 మందితో కూడిన జంబో సిబ్బంది ఉన్నారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించింది. తొలుత ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 100 మందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందుకు ఒక్కొక్కరు రూ.10 లక్షలు వెచ్చించి మెస్సి అభిమానులు టికెట్లు బుక్ చేసుకున్నారు. వీటిని మెస్సి ఇండియా ఈవెంట్లు చూస్తున్న టీమ్ పర్యవేక్షించింది. ఫలక్‌నుమా ప్యాలెస్ నుంచి సాయంత్రం 6.30 గంటలకు మెస్సి ఉప్పల్ స్టేడియం చేరుకున్నారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన ప్రియాంకాగాంధీ కుమారుడు, కుమార్తె లు సైతం వచ్చారు. విన్నర్, రన్నరప్ జట్లకు కప్‌ను మెస్సి, రేవంత్‌రెడ్డి అందించారు.అనంతరం రేవంత్‌రెడ్డి లియోనెల్ మెస్సీని సన్మానించారు.

## మేం వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వీటిపై సమ్మిట్ లో నిపుణులు అనేక సలహాలు, సూచనలు ఇచ్చారని వివరించారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీని నేరాలను కట్టడి చేయడానికి ఉపయోగించాలని చెప్పారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు జరుగుతున్నాయని, రోజురోజుకు సైబర్ స్కామ్స్ పెరుగుతూ పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ ఫ్రాడ్ ద్వారా నేరస్తులు కేవడం సామాన్యుల డబ్బులే దోచుకోవడం లేదని, ఐఎఎస్ అధికారులు, జడ్జీల వంటి ఉన్నత స్థాయిల్లో ఉన్న వారిని కూడా మోసం చేస్తున్నారని వివరంచారు. ఏఐ సహకారంతో సృష్టించిన ఫేక్ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో చెలామణి చేస్తున్నారని అన్నారు. వీటన్నింటినీ ఏఐ టెక్నాలజీని వినియోగించుకొని అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల అందరికీ లాభం జరగాలని ఆకాంక్షించారు.

**ఎన్‌ఆర్‌సి కాదు ఎన్‌ఆర్‌సి : అఖిలేష్ యాదవ్**

ఉత్తర్ ప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం చేపడుతున్నది ఎస్ఐఆర్ కాదని, ఇది జాతీయ పౌరుల నమోదు (ఎన్‌ఆర్‌సి) ప్రక్రియ అని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఎన్‌ఆర్‌సిని నేరుగా చేపట్టలేక ప్రభుత్వం ఎస్ఐఆర్ ను వాడుకుంటున్నదని, ఎన్‌ఆర్‌సికి ఎన్ని పత్రాలు అడుగుతారో ఎస్ఐఆర్ కి అన్ని పత్రాలు అడుగుతున్నారని అన్నారు. ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గెలవడానికే బీజేపీ ఎస్ఐఆర్ చేపడుతోందని ఆరోపించారు.యుపిలోదాదాపు 25 కోట్ల జనాభా ఉందని ప్రభుత్వం చెబుతోందని, ఎస్ఐఆర్ ద్వారా బిజెపి ప్రభుత్వం సుమారు 3 కోట్ల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. సాంకేతికతను సరిగ్గా వినియోగించుకోకపోవడం వల్ల అనేక ఓట్లు పోతున్నాయని చెప్పారు. బూత్ స్థాయి అధికారులకు కూడా శిక్షణ ఇవ్వలేదని, దీంతో క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు, సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఓటు హక్కు కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత కానీ ఓట్లు తొలగించడం కాదని స్పష్టం చేశారు. తాము ఇండియా కూటమిలోనే కొనసాగుతమని పునరుద్ఘాటించారు.

## పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి)

ఫలకనుమా ప్యాలస్ వరకు రాహుల్ గాంధీతో కార్‌లో సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రయాణించారు. రాహుల్ గాంధీకి రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు, తాజా రాజకీయ పరిస్థితులను రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తీరు, గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించిన వివరాలను రాహుల్ గాంధీకి సిఎం తెలియజేశారు.

ఎఐసిసి ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన ఢిల్లీ రామ్ లీలా మైదానంలో ఓట్ చోరీ అంశంపై జరిగే మహా ధర్నా కార్యక్రమానికి తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నట్లు రాహుల్ గాంధీ దృష్టికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీసుకువచ్చారు. ఎఐసిసి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఓట్ చోరీకి వ్యతిరేకంగా సేకరించిన సంతకాల ఫామ్‌లను 2 రోజుల కింద హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో ఢిల్లీకి పంపినట్లు ఆయన రాముల్‌గాంధీకి తెలిపారు. ఈ విషయాలపై రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రబుత్వ, పార్టీ పనితీరు అభినందనీయమని, అయితే బిజెపి చేస్తున్న ఓట్ చోరీపై మరింత పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ బస చేసిన ఫలక్‌నుమా ప్యాలస్‌లో రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఎంపిలు, ఎంఎల్ఎలు, పార్టీ నాయకులు రాముల్ గాంధీని కలిశారు.

## నేడు ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

సచిన్ పైలట్‌తో సహా అగ్ర నాయకులు ర్యాలీలో పాల్గొంటారు. పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. సీనియర్ నాయకులందరూ పార్టీ ప్రధాన కార్యాలయమైన ఇందిరా భవన్‌లో సమావేశమై, అక్కడి నుండి బస్సులో రామ్‌లీలా మైదాన్‌కు వెళ్తారు. 'ఓట్ల దొంగతనం'కు వ్యతిరేకంగా పార్టీ సుమారు 5.50 కోట్ల సంతకాలను సేకరించిందని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. 'ఓట్ల దొంగతనం' ఎలా జరుగుతోందో రాహుల్ జీ సాక్ష్యాలతో సహా నిరూపించారు... పత్రికా సమావేశాల వేదికగా తనతో చర్చకు రావాలని ఆయన హోంమంత్రికి సవాలు విసిరారని, కానీ హోంమంత్రి సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ సమస్యను హైలైట్ చేయడానికి ఈనెల 14న కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహిస్తోందని వేణుగోపాల్ తెలిపారు. దేశ ప్రజలంతా ఓట్‌చోరీపై చర్చిస్తున్నారని, అందువల్ల దీనికి మరింత ఊపు తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ అనతరం 5.5 కోట్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి రాష్ట్రపతితో సమావేశం అయ్యేందుకు అపాయింట్‌మెంట్ కోరామని చెప్పారు.

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగిన కొద్ది రోజులకే భారీ ర్యాలీను కాంగ్రెస్ చేపడుతోంది. ఈ చర్చలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఇతర ఎన్నికల అవకతవకలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఆయన ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు సంధించారు. 'భారతదేశ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి బిజెపి ఎన్నికల సంఘాన్ని (ఇసి) నిర్దేశిస్తూ తనకు అనుకూలంగా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఎన్నికలకు ఒక నెల ముందుగా అన్ని పార్టీలకు మెషీన్ రీడబుల్ ఓటర్ల జాబితాలను అందించాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజీని ధ్వంసం చేయడానికి అనుమతించే చట్టాన్ని రద్దు చేయాలని, ఇవిఎంలకు ప్రాప్యత కల్పించాలని, ఎన్నికల కమిషనర్లకు కోర్టు కేసుల నుంచి రక్షణను అనుమతిస్తున్న చట్టాన్ని మార్చాలని గాంధీ పిలుపునిచ్చారు. 'ఓటును నాశనం చేసినప్పుడు, ఈ దేశపు మూలస్తంభాలను కూడా నాశనం చేస్తారు, మీరు ఆధునిక భారతదేశాన్ని నాశనం చేస్తారు, భారతదేశం అనే భావనను నాశనం చేస్తారు' అని గాంధీ అధికార పక్షంపై విరుచుకుపడ్డారు.

### యునెస్కో జాబితాలో 157 దేశాల్లో
# 849 సాంస్కృతిక జీవన వారసత్వాలకు గుర్తింపు

**న్యూఢిల్లీ:** భారత్‌లో జరిగిన యునెస్కో (ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ) 20వ సమావేశాలు (డిసెంబరు 7-13) శనివారం నాటితో పూర్తయ్యాయి. దీంతో ఇప్పటివరకూ యునెస్కో ఇప్పటివరకూ 157 దేశాలలో ఉన్న 849 సాంస్కృతిక జీవన వారసత్వాలకు గుర్తింపు ఇచ్చింది. పురాతన కాలంలో నిర్మించిన మహోన్నతమైన కట్టడాలు, శిలాశాసనాలు, జీవన సంస్కృతులకు యునెస్కో గుర్తింపులు ప్రకటించింది. తరతరాలుగా కొనసాగుతున్న ప్రపంచ వైజ్ఞానిక, సాంస్కతిక, వారసత్వ సంప్రదాయ కళలు, కట్టడాల పరిరక్షణకు ఉద్దేశించిన యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ కమిటీ తదుపరి సమావేశాలకు వచ్చే ఏడాది డిసెంబరు నెలలో చైనాలోని గ్జియామెన్ నగరం ఆతిథ్యం ఇవ్వనున్నది. ఢిల్లీలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన ఎర్రకోటలో మొదటిపాకి ఈ సమావేశాలు జరిగాయి.

ఈ సముదాయం ప్లీనరీ హాలులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పెవిలియన్‌లో శనివారం సాయంత్రం యునెస్కో సమావేశాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమం తర్వాత యునెస్కో సభ్యు లు దేశంలో ఉన్న ప్రకృతి దృశ్యా లు, వారసత్వ కట్టడాల పరిశీలనకు వెళ్ళారు. ప్రపంచ సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను సంరక్షించేందుకు ఉద్దేశించి యునెస్కో నిర్వహించిన 2003 నాటి సదస్సు కార్యదర్శి ఫుమికో ఓహినట ముగిం పు సందేశం ఇస్తూ, మొఘల్ చక్రవర్తుల కాలానికి చెందిన ఎర్రకోట సముదాయం ఈ మహత్తరమైన సమావేశాలకు వేదికగా నిలిచిందన్నారు. మహోన్నతమైన రక్షణకు పేరుగా నిలిచిన భారీ గోడలకు ప్రసిద్ధి చెందిన ఎర్రకోటలో తమ కాలాన్ని ప్రతిక్షణం గొప్పగా గడిపామన్నారు. ఆ తర్వాత పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో జరిగే సంప్రదాయ బద్ధమైన దీపావళి పర్వదినంతోపాటు మొత్తం 16 సాంస్కృతిక కేంద్రాలను యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతాలుగా గుర్తించిందని చెప్పారు. వీటిల్లో ఇరాన్‌కు చెందిన పర్షియా నిర్మాణకళ మిర్రర్ వర్కు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన సంప్రదాయ కళారూపం, స్విట్జర్లాండ్ లోని యోడెల్లింగ్‌లను కూడా యునెస్కో వారసత్వ ప్రాంతాలుగా గుర్తించినట్లు చెప్పారు. యునెస్కోకు ఈ సమావేశంలో దాదాపు 80 ప్రాంతాలు, వారస త్వ కట్టడాలు పరిశీలనకు వచ్చాయని, వారం రోజులుగా యునెస్కో కమిటీకిలో ఉన్న 24 దేశాల సభ్యులు 67 వారసత్వ కట్టడాలు, ప్రాంతాలకు సంబంధించిన విజ్ఞప్తులను పరిశీలించారని, వీటిల్లో 11 సాంస్కృతిక వారసత్వ అంశాలను తక్షణం సంరక్షించాల్సిన జాబితాలో చేర్చామని, 53 అంశాలను మానవ సంస్కృతికి సంబంధించిన జాబితాలో చేర్చామని, ఒక ప్రోగ్రామ్‌ను గొప్ప వారసత్వఅంశంగా ఉత్తమస్థాయిలో పరిరక్షిస్తున్న జాబితాలో ఉంచామని చెప్పారు.



ఈ ఏడాదిలో జరిగిన సమావేశాల తో కలిపి మొత్తం 157 దేశాలకు చెందిన 849 సాంస్కృతిక జీవన వారసత్వ నిర్మాణాలు, ప్రాంతాలను యునెస్కో జాబితాలో చేర్చినట్లయిందన్నారు. డిసెంబరు ఏడో తేదీన యునెస్కో 20వ సమావేశాలు ఢిల్లీలో మొదలయ్యాయి. విదేశీ వ్యవహారాలమంత్రి జైశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## 'సెమికాన్'లో భారత్‌కు దక్కని చోటు



**వాషింగ్టన్ :** అమెరికా నేతృత్వంలోని తొమ్మిది దేశాల సెమీకండక్టర్ సరఫరా గొలుసు కూటమి (సెమికాన్)లో భారత్‌కు చోటు దక్కలేదు. అమెరికా నేతృత్వంలో ఏర్పడిన తొమ్మిది దేశాల సెమీకండక్టర్ (చిప్) సరఫరా గొలుసు కూటమిలో భారత్ భాగస్వామి కాలేదు. సెమీకండక్టర్లు (చిప్స్) మొబైళ్లు, కార్లు, కంప్యూటర్లు, రక్షణ పరికరాలు వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు అత్యంత కీలకం. చిప్ తయారీ ప్రస్తుతం కొద్ది దేశాల చేతిలోనే ఉంది. ముఖ్యంగా చైనా, తైవాన్, దక్షిణ కొరియా, అమెరికా కీలక పాత్ర పోషిస్తున్నాయి. కాగా, చైనా మీద ఆధారపడటం తగ్గించేందుకు, భద్రమైన, విశ్వసనీయ సరఫరా గొలుసును నిర్మించాలనే లక్ష్యంతో అమెరికా కొన్ని దేశాలతో కలిసి ఈ కూటమిని ఏర్పాటు చేసింది. అయితే, భారత్ ఇప్పటికీ పూర్తిస్థాయి సెమీకండక్టర్ తయారీ సామర్థ్యం (ఎఫ్ఎబిఎస్) కలిగిన దేశం కాదు. చిప్ డిజైన్‌లో భారత్ బలంగా ఉన్నా, తయారీ రంగంలో ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. అందుకే ఈ ప్రత్యేకమైన తొమ్మిది దేశాల కూటమిలో భారత్‌ను చేర్చలేదు. సెమికాన్‌లో భాగస్వామి కాలేకపోయినప్పటికీ, భారత్ వివిధ మార్గాల్లో చిప్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోంది. భవిష్యత్తులో తయారీ సామర్థ్యం పెరిగితే, ఇటువంటి అంతర్జాతీయ కూటముల్లో భారత్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. ఇలావుంటే, భారత్ స్వతంత్రంగా అమెరికా, జపాన్‌తో, యూరోప్ దేశాలతో ద్వైపాక్షికంగా సెమీకండక్టర్ సహకార ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

## తప్పేముంది?

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. 'నిర్మల్ భారత్ అభియాన్‌ను స్వచ్ఛ భారత్ అభియాన్‌గా, గ్రామీణ ఎల్పిజి పంపిణీ కార్యక్రమాన్ని ఉజ్వల్‌గా మార్చారని, రీప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో నిపుణులు అని ఆయన ఆయన పిటిఐకి తెలిపారు. 'వారు పండిట్ నెహ్రూను ద్వేషిస్తారు, కానీ ఇప్పుడు మహాత్మా గాంధీని కూడా ద్వేషిస్తున్నట్లు అనిపిస్తోంది. మహాత్మా గాంధీ పేరులో ఉన్న తప్పు ఏమిటి? మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును పూజ్య బాపు ఉపాధి హామీ పథకంగా ఎందుకు మార్చాలి? అని రమేష్ ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చడానికి, పని దినాల సంఖ్యను పెంచడానికి సంబంధించిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపిందని వర్గాలు తెలిపాయి. ఈ పథకానికి ఇప్పుడు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' అని పేరు మార్చనున్నారు. దానికింద పని దినాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 100 రోజుల నుండి 125 రోజులకు పెంచనున్నారు. కాగా, కాంగ్రెస్ మరో ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, ఒకప్పుడు ఎంజిఎన్ఆర్ఇజిఎను 'వైఫల్యాల స్మారక చిహ్నం' అని పిలిచిన ప్రధాని, ఇప్పుడు ఈ విప్లవాత్మక పథకానికి క్రెడిట్ పొందడం కోసం దాని పేరు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశ ఆత్మ నుంచి మహాత్మాగాంధీ పేరును తొలిగించేందుకు ఈ చర్యను మరో మార్గంగా బిజెపి సర్కార్ ఎన్నుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ పథకానికి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చడానికి చేసిన ఒక పైపై మార్పు తప్ప ఈ చర్య మరేమీ కాదని వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఒ కార్మికులు అధిక వేతనాలు డిమాండ్ చేస్తున్నారని, అయితే కేంద్రం ఏటా ఈ పథకానికి కేటాయించే నిధులను తగ్గిస్తోందన్నారు. మరోవైపు పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోతూనే ఉన్నాయని, ఈ పథకాన్ని నెమ్మదిగా ఖూనీ చేసేందుకు ఆచితూచి వేస్తున్న ప్రణాళిక వ్యూహంలా కనిపిస్తోందన్నారు. వాస్తవానికి, ఈ ప్రభుత్వానికి సంక్షేమాన్ని అందించాలనే ఉద్దేశం లేదని, కేవలం నటిస్తోందన్నారు. 'కానీ మిస్టర్ మోదీ, మీకు కావలసినంత పేరు మార్చుకోండి, ఈ పరివర్తన పథకాన్ని భారతదేశంలోని ప్రతి గ్రామానికి తీసుకువచ్చింది డాక్టర్ మన్మోహన్ సింగ్ జీ, సోనియా గాంధీ జీ అని ప్రజలకు తెలుసు' అని వేణుగోపాల్ గుర్తుచేశారు.

**పేరు మార్చితే ఖర్చు తప్ప ఏం లాభం? : ప్రియాంక**

ఉపాధిహామీ పథకం పేరు మార్చడం వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనమేంటని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మార్చడం వల్ల డబ్బులు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించి పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఆ కార్యక్రమం ఎన్నో ఏళ్లుగా అమల్లో ఉందని గుర్తు చేసారు. కానీ ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏంటో తనకు అర్థం కావట్లేదని అన్నారు. పథకం పేరు మార్చడం వల్ల కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేరు మార్చాల్సి వస్తుందని చెప్పారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రేవంత్ రెడ్డి ఈ తరానికి రోబో



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని పెంచారని, గత పదేళ్లలో జరగని అభివృద్ధిని కేవలం రెండు ఏళ్లలో చేసి చూపారని, ఆయన ఈ తరానికి రోబో అని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు ఏండ్ల ప్రజా పాలనకు గ్రామ పంచాయతీ ఎన్నికలు పట్టం కట్టాయని, రేవంత్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. 75ఏళ్ల నుండి ఉమ్మడి రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం రేవంత్‌రెడ్డి చేశారని, అలాంటి నాయకుడిపై బిఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. సిఎం పర్యటన తో ఒయు ప్రతిష్ట పెరిగిందని, రేవంత్ రెడ్డి ఆడుతున్న ఫుట్ బాల్ గేమ్ వీక్షించడానికి రాహుల్ గాంధీ రావడం స్ఫూర్తిని నింపిందన్నారు. ప్రస్తుతం ఇండియాలోనే తెలంగాణ బెస్ట్ రాష్ట్రంగా నిలిచిందని, మరో పదేళ్లలో సింగపూర్‌ల తెలంగాణ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.



## విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహించిన ఇటి టెక్‌ఎక్స్ – 6వ ఎడిషన్ కార్యక్రమానికి శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో విద్యారంగాన్ని అత్యున్నత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ఉపాధ్యాయుల భర్తీ, డిజిటల్ లెర్నింగ్, స్కిల్ ఎడ్యుకేషన్ వరకు విద్యారంగంలోని ప్రతి దశలో సమగ్ర మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. వేగంగా మారుతున్న విద్యా ప్రపంచంలో ఈటీ టెక్ ఎక్స్ వంటి వేదికలు అత్యంత అవసరమని,టెక్నాలజీ–విద్య కలిసి భవిష్యత్తును ఎలా నిర్మించాలి అనే అంశంపై ఆలోచించేందుకు, చర్చించేందుకు ఇవి దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులందరూ ఒకే క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలతో కలిసి చదువుకునేలా105 అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.2100 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ యూనివర్సిటీ ఈ సంవత్సరం నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభించనుందని,పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి యువతకు తక్షణ ఉపాధి కల్పించడమే లక్ష్యమని అన్నారు. అదే విధంగా యువత పరిశ్రమలకు తగిన నైపుణ్యాలు నేర్చుకునేలా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తోస్తున్నామన్నారు.ఈ లక్ష్యంతో స్పోరట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది చారిత్రాత్మక ముందడుగు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.

## భూమి అన్యాక్రాంతం కారాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లోని నాలుగు ఎకరాల భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. సర్వే నంబర్ 859, 860లోని విలువైన నాలుగు ఎకరాల భూమిని ప్రైవేట్ పార్టీల వశం కాకుండా చేయాలంది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో హాస్టళ్లు, పాఠశాల భవనాలు, ఆట స్థలాలు, ఇతర సౌకర్యాలకు మాత్రమే ఆ భూమిని వినియోగించాలని ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, మోత్కూర్ మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసింది. మినీ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం కోసం ఏ.రవికుమార్ మరొకరు ఆరు ఎకరాలను దానంగా ఇచ్చారు. అందులో రెండు ఎకరాలను వినియోగంలోకి తెచ్చారు. మిగిలిన నాలుగు ఎకరాలను తమకు ఇచ్చేయాలంటూ వారిద్దరూ పిటిషన్ వేయగా గతంలో సింగిల్ జడ్జి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది. మిగిలిన నాలుగు ఎకరాల భూమిని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల అవసరాలకు మాత్రమే వినియోగించాలంది. ప్రైవేట్ వ్యక్తుల వశం కారాదని చెప్పింది. భూమి అన్యాక్రాంతం కాకుండా కంచె వేయాలని అధికారులను ఆదేశించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. అప్పీల్‌తో పాటు ఇదే అంశంపై దాఖలైన పిల్‌ను డివిజన్ బెంచ్ విచారణకు అనుమతించింది.

# నీలం రాజశేఖర్ రెడ్డికి సిపిఐ ఘన నివాళి

● సిఆర్ ఫౌండేషన్‌లో 31వ వర్ధంతి వేడుకలు ● పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కె.నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి /హైదరాబాద్:** స్వాతంత్ర్య సమరయోధులు, సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపనలో ప్రముఖులు కీర్తిశేషులు నీలం రాజశేఖర్ రెడ్డి 31వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్ రెడ్డి రిసెర్చ్ సెంటర్‌లో ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారయణ, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శి పల్లావెంకట్ రెడ్డిలు విచ్చేసి నీలం రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కె.నారయణ మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి కమ్యూనిష్టు నిబద్ధతతో ఉన్న ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అలనాటి భారత దేశ అధ్యక్షులు నీలం సంజీవ రెడ్డి స్వయాన సోదరుడైనప్పటికీ వారు కమ్యూనిష్టు పార్టీ సమున్నతికి నిర్విరామం గా కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా కమ్యూనిష్టు పా ర్టీలో యువకులను, మేధావులను ప్రోత్సహించారని వక్త లు రాజశేఖర్ రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి చంద్ర రాజేశ్వరరావుతో పాటు ఢిల్లీ కేం ద్రంగా సిపిఐ జాతీయ కార్యదర్శిగా చాలా సంవత్సరా లు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత హైదారాబాద్ వచ్చారని నీలం రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను, యువకులను, పార్టీలో వారిని ప్రోత్సహించారని తెలిపారు. సిఆర్ ఫౌం డేషన్ ఉపాధ్యాక్షులు , నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెం టర్ కన్వీనర్ కుంభంపాటి అజయ్ కుమార్ వందన స మర్పణ చేశారు.

కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి , మాజీ శాసనమండలి సభ్యులు పిజే చంద్రశేఖర్ రావు, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర సభ్యులు జోత్స్న, లలిత, ప్రజా నాట్యమండలి గాయని శ్రీమతి నళిని, సిపిఐ తెలంగాణ రాష్ట్రసమితి సభ్యులు రామకృష్ణ, అశ్రమవాసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెంటర్ విద్యార్థినిలు, సిఆర్ పాలిక్లినిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మఖ్దూంభవన్‌లో...

సిపిఐ ప్రముఖ నాయకులు నీలం రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళ్లు అర్పించారు. నీలం రాజశేఖర్ రెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెద్ద చదువులు చదివి కమ్యూనిస్టుగా రూపాంతరం చెందిన తర్వాత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలో ఒకరయ్యారన్నారు. మదనపల్లిలో చదివి, బనారస్ యూనివర్సిటీలో తరిమెల నాగిరెడ్డి, చంద్ర రాజేశ్వరరావుతో కలిసి చదువుకున్నారన్నారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న కాలం నాటి నుండి కూడా పార్టీ ఆర్గనైజేషన్ కొరకు కృషి చేశారని, పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు ఆయన రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా అనేక సవాళ్లను అధిగమించి పార్టీని ముందుకు నడిపారన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. పార్టీ సైద్ధాంతికంగా ఎదగడానికి రాజకీయ పాఠశాలలకు ప్రాధాన్యత ఇచ్చే వారని తెలిపారు.

జర్మనీ, అర్జెంటీనా, రష్యా దేశాలలో క మ్యూనిస్టులు అధికారంలో ఉన్న కాలంలో భారతదేశం నుండి ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, కమ్యూనిస్టు నాయకుల ను ఆయా దేశాలకు పంపించి రాజకీయ శిక్షణ ఇప్పిచ్చేవారన్నారు. ప్రస్తుతం మతోన్మాద శక్తులు కేంద్రంలో అ ధికారంలో ఉన్న ఈ తరుణంలో మన పార్టీ సైద్ధాంతికం గా తయారు చేసుకోవడానికి రాజకీయ పాఠశాలలో ఏర్పాటు, కార్యకర్తలను తయారు చేసుకోవడానికి నీలం రాజశేఖర్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్లాలని, ఆయన ఆశయాలు సాధించాలన్నారు.

## అఖిలేష్‌తో బిసి సంఘాల భేటీ

### పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ల బిల్లు అంశాన్ని లేవనెత్తండి : జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, అలాగే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చేసిన చట్టాన్ని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించేలా సమాజ్‌వాది పార్టీ తరపున పోరాడాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివా స్ గౌడ్, సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షులు యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను కోరారు. తెలంగాణ పర్యట నకు విచ్చేసిన అఖిలేష్ యాదవ్‌ను శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, క న్వీనర్ పెరిక సురేష్, కనకల శ్యాం కురుమ, శేఖర్ సగర లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి ప్రధానమంత్రి కొనసాగుతున్న దేశంలో 70 కోట్ల మంది బిసిలకు న్యాయం జరగడం లేదని, బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచడం లేదని, బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదని మండిపడ్డారు. కాగా బిసిల డిమాండ్ న్యాయ సమ్మతమైనదని, బిసి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాల్సిన అవసరం ఉందని, తమ పార్టీ తరపున పార్లమెంట్‌లో మాట్లాడుతామని, దేశవ్యాప్తంగా జరుగుతున్న బిసి ఉద్యమానికి సమాజ్ వాదీ పార్టీ కూడా భాగస్వామ్యం అవుతుందని అఖిలేష్ యాదవ్ బిసి నేతలకు హామి ఇచ్చారు. ఈ సమావేశంలో బిసి జెఎసి కన్వీనర్ జాజుల లింగం గౌడ్, వేముల రామకృష్ణ, గూడూరు భాస్కర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ స్టేడియంలో 'పుస్తకాల పండుగ'



● ఈ నెల 19 నుంచి 29 వరకు 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాంగణం పేరు 'ప్రజాకవి అందెశ్రీ'గా నామకరణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాహిత్య, సాంస్కృతికప్రియుల కోసం 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సొసైటీ అధ్యక్షులు యాకూబ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్‌బాబు, సహాయ కార్యదర్శులు కె.సురేష్, ఎం.సూరిబాబు, కోశాధికారి నారాయణరెడ్డి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 29 వరకు మొత్తం 11 రోజుల పాటు (ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంట నుంచి 9 గంటల వరకు) ఎన్‌టిఆర్ స్టేడియం(ఇందిరాపార్క్ వద్ద)లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 38వ బుక్‌ఫెయిర్ ప్రాంగణంకు ప్రజాకవి అందెశ్రీ, పుస్తకావిష్కరణ వేదికకు కొంపల్లి వెంకట్‌గౌడ్, రచయితల స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్.వి.రామారావు, మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ వొటార్కార్ నామకరణం చేశామని పేర్కొన్నారు. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో పుస్తక విక్రయాలతో పాటు, ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, రచయితలతో సమావేశాలు, పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు ఉచిత ప్రవేశ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. సందర్శకుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి ఎండికి వినతి చేశామన్నారు. పుస్తకం విశిష్టత, దాని ప్రాముఖ్యతను సమాజానికి తెలియజెప్పడంతో పాటు మంచి సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని, తెలంగాణ ప్రజలు, పుస్తక ప్రియులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించి విజయవంతం చేయాలని యాకూబ్ కోరారు.

# మంత్రాల నెపంతో దారుణ హత్య

### నిర్మల్ జిల్లాలో దారుణం, ఇద్దరు నిందితుల అరెస్ట్






**ప్రజాపక్షం/ఖానాపూర్ :** కడెం మండలంలోని మూఢనమ్మకాలు, క్షుద్రపూజల భయం మరోసారి ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. నిర్మల్ జిల్లా కడెం మండలం, ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని గండి గోపాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకున్న ఈదారుణ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దేశినేని భీమయ్య(55) అనే వృద్ధుడిని ఇద్దరు వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని రహస్యంగా దహనం చేశారు. తమ కుటుంబ సభ్యురాలి అనారోగ్యానికి మంత్రా లే కారణమని భ్రమపడటం ఈ హత్యకు దారితీసింది.

### నిందితులు దొరికింది ఇలా

ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్‌పి ఉపేందర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. గండి గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మూతి నరేష్, మూతి మల్లేష్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అమెకు ఆరోగ్యం కుదుటపడకపోవడంతో, స్థానికంగా నివసించే భీమయ్య మంత్రాలు చేస్తున్నందునే ఇలా జరుగుతుందని వారు అనుమానించారు. ఈ పాత కక్షతో రగిలిపోయిన నరేష్, మల్లేష్ పథకం ప్రకారం భీమయ్యను ఒంటరిగా అదును చూసి పట్టుకున్నారు. అతి కృరంగా కర్రలతో కొట్టి భీమయ్య ప్రాణాలు తీసిన నిందితులు, తమ నేరాన్ని దాచిపెట్టేందుకు మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా దహనం చేశారు. అయితే, కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేసిన పోలీసు బృందం, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి, వారిని పట్టుకున్నారు. హత్యకు పాల్పడిన మూతి నరేష్, మూతి మల్లేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్‌పి ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రాల నెపంతో గ్రామీణ ప్రాంతాల్లో హత్యలు జరగడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### మూఢనమ్మకాలు నమ్మొద్దు : ఎఎస్‌పి

మంత్రాలు క్షుద్రవిద్యలు వంటివి అవాస్తవాలు, అలాంటివి ఎక్కడా లేవు, ఇవన్నీ కేవలం మూఢనమ్మకాలు మాత్రమే, ప్రజలు ఇలాంటి పాత ఆలోచనలను నమ్మి అమాయకుల ప్రాణాలు తీయవద్దు, అనవసరంగా నష్టపోవద్దు, ఎవరికైనా అనారోగ్యం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మూఢనమ్మకాలపై ప్రజలు చైతన్యం పెంచుకోవాలి'' అని ఉపేందర్‌రెడ్డి ప్రజలకు గట్టిగా హెచ్చరించారు. మూఢనమ్మకాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కేసు విచారణలో, నిందితుల అరెస్టులో ఖానాపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్.అజయ్ కుమార్, కడెం ఎస్సై, ఇతర పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

### వంద మంది మాదకద్రవ్య వినియోగదారులు గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టయింది. టాస్క్ ఫోర్స్ పోలీసులు, లంగర్ హౌస్ పోలీసులతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భారీగా నిషేధిత డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డిసిపి వైభవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు వైకుంఠరావుతో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 5 కిలోల హాష్ ఆయిల్ , 5 కిలోల గంజాయి, డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైకుంఠరావు ఒడిశాలో డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ అరెస్టు కేవలం సరఫరాదారులకే పరిమితం కాలేదు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, డ్రగ్స్ వినియోగదారుల నెట్‌వర్క్‌పై కూడా పోలీసులు దృష్టి సారించారు. డిసిపి వైభవ్ మాట్లాడుతూ, ఈ ముఠా నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన దాదాపు వంద మంది డ్రగ్స్ కన్స్యూమర్స్‌ను గుర్తించినట్లు తెలిపా రు. ఈ స్థాయిలో వినియోగదారులను గుర్తించడం అనేది నగరంలో డ్రగ్స్ వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది, డ్రగ్స్ చైన్‌ను పూర్తిగా ఛేదించేందుకు, వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



## భారత్ ఫ్యూచర్ సిటీ ఎక్స్‌పోకు భారీగా ప్రజాదరణ

### విజయవంతంగా ముగిసిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 తేదీలలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో, భారత్ ఫ్యూచర్ సిటీ ఎగ్జిబిషన్ జోన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ జోన్ ద్వారా 2047 వరకు తెలంగాణ రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకున్న దీర్ఘకాలిక మౌలిక వసతులు, పెట్టుబడులు, ఆవిష్కరణల దిశను అధునాతన సాంకేతికత, ఇమర్సివ్ స్టోరీటెల్లింగ్ ద్వారా ప్రజలకు పరిచయం చేసింది. సమ్మిట్ విజయవంతంగా ముగిసిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు, సాధారణ ప్రజల కోసం మొత్తం ఎక్స్‌పో ప్రాంతాన్ని తెరిచి ఉంచింది. దీనివల్ల సందర్శకులు రాష్ట్రం చేపట్టిన భవిష్యత్ దృష్టిగల అభివృద్ధి కార్యాచరణను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించారు. ఎక్స్‌పో ప్రారంభమైనప్పటి నుండి ప్రతిరోజూ వేలాది మంది సందర్శకులు భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్, భవిష్యత్తు పట్టణ లేఅవుట్లు, మొబిలిటీ వ్యవస్థలు, పర్యావరణ కారిడార్లు, నెక్ట్స్‌జెనరేషన్ గ్లోబల్ సిటీ నిర్మాణంలో ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహాన్ని పరిశీలించారు.

### ప్రజా ఆకర్షణగా నిలిచిన ఎక్స్‌పో



అధునాతన సాంకేతికత, విజువల్ స్టోరీ టెల్లింగ్, ఇంటరాక్టివ్ ఎఐ, తదుపరి తరం పట్టణ ప్రణాళిక కాన్సెప్టులు గ్లోబల్ సమ్మిట్ ఎగ్జిబిషన్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. తెలంగాణ ప్రభుత్వ భారత్ ఫ్యూచర్ సిటీ దృష్టిని అన్ని వర్గాల ప్రజలకు సులభంగా, అందుబాటులో ఉండేలా, ప్రేరణాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ విజయవంతంగా మార్చింది.

## సొసైటీ అక్రమాలపై విచారణ జరపాలి

### గచ్చిబౌలి ఇళ్ల స్థలాల సాధన కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భాగ్యనగర్ టిఎన్‌జిఒ హౌసింగ్ సొసైటీలో జరిగిన కోట్లాది రూపాయల నిధుల అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని గచ్చిబౌలి ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ఎస్.పాండురంగ రావు, కార్యదర్శి బి.నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ సొసైటీ నేతలు నిబంధనలను తుంగలో తొక్కి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. దొడ్డిదారిన సొసైటీలో సభ్యత్వం ఇవ్వడంతో పాటు హౌసింగ్ ప్లాట్లు కూడా కేటాయించారని ఆరోపించారు. 2009 నాటికి ఉన్న సీనియారిటీ ప్రకారం అర్హులైన ఉద్యోగులకు హౌసింగ్ ప్లాట్ల కేటాయింపు జరగేలా చర్యలు తీసుకోవాలన్న అభ్యర్థించారు. ఇప్పటికే ఈ సొసైటీపై పలు కేసులు నమోదు అయ్యాయని, అక్రమ సభ్యత్వాలు, అసలు లబ్ధిదారులను నిర్లక్ష్యం చేయడంపై వెంటనే విచారణ జరిపించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.1991–92లో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా గోపన్నపల్లిలో సర్వే నెంబర్లు 36,37లో 477 ఎకరాలు ఉద్యోగుల హౌసింగ్ కోసం రిజర్వ్ చేశారన్నారు. అందులో ఎపిఎన్‌జిఒకు 189.11 ఎకరాల కేటాయించారన్నారు. గతంలో ఈ విషయంపై రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అర్హత పరిశీలించి జాబితా తయారు చేయాలి, ఆ జాబితాను జిఎ (ఎస్‌డబ్ల్యూ) శాఖ ఆమోదించాలి, ఆమోదిత జాబితా ప్రకారం ప్లాట్లు కేటాయించాలి, ఈ ప్రక్రియను సొసైటీ అమలు చేయలేదన్నారు. ఎపిఎన్‌జిఒ అందజేసిన 7030 మంది తాత్కాలిక లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ జాబితానే తుది జాబితాగా పరిగణించాలన్నారు. సీనియారిటీ ప్రకారం కాకుండా అన్యాయంగా లాటరీ ద్వారా ప్లాట్ కేటాయింపులు చేశారని ఆరోపించారు. సొసైటీపై 40కి పైగా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. అక్రమంగా కొత్తగా 1500 అనర్హ సభ్యులను సొసైటీలో చేర్చుకున్నారని ఆరోపించారు.వారి నుంచి రూ. 25,000 రూ. 1,50,000 వరకు డబ్బులు వసూలు చేశారని, మొత్తం రూ. 34 కోట్లు వసూలు చేసి, రూ. 18 కోట్ల దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు. దీనిపై ఇప్పటికే తాము ఎసిబి అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. నకిలీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి కాళీ రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుని, ఆ తరువాత మినిట్స్ వారికి అనుకూలంగా రాసుకుని తీర్మాణాలను ఆమోదించుకుంటున్నారన్నారు. 2019లో కొత్త అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ నిధులను భారీగా దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు. గతంలో ఈ సొసైటీపై హైదరాబాద్ సిసిఎస్‌లో 81/2013 కేసు కూడా నమోదు అయ్యిందని గుర్తు చేశారు. ఐఒబి ఆబిడ్స్ శాఖలో ఉన్న సొసైటీ భ్యాంక్ ఖాతాలో ఉన్న నిధులను దుర్వినియోగం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. 7030 మంది ప్రభుత్వం ఆమోదించిన లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించాలన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## విద్యార్థులను పరామర్శించిన మంత్రి అజారుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కలుషిత ఆహారం బారినపడి కింగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల విద్యార్థులను మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడిన మంత్రి వారి కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పారు. ఇలాంటి ఘటన చోటు చేసుకోకుంట పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి అజారుద్దీన్ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్‌తో పాటు కుక్‌ను సస్పెండ్ చేశారు.





మూసీ సుందరికణ జరగాలంటే..

## ముందు జియాగూడలో ఆధునిక స్లాటర్ నిర్మించాల్సిందే

### 'జాగృతి జనంబాట'లో కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో వరల్డ్ బ్యాంక్ నుంచి వేల కోట్ల రూపాయలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, ఆ బ్యూటిఫికేషన్ విజయవంతం కావాలంటే ముందుగా ఆధునిక స్లాటర్ హౌస్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జాగృతి కవిత హైదరాబాద్ జిల్లాలో నాలుగో రోజు కార్వాన్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్టలలో శనివారం పర్యటించారు. కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బాపూ ఘాట్‌ను సందర్శించిన కవిత, మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాపూ ఘాట్ నుంచి లంగర్ హౌస్ దర్గాకు ఆటోలో వెళ్లిన కవిత, దర్గాను సందర్శించి చాదర్ సమర్పించారు. జియాగుడ మేకల మండిని సందర్శించిన కవిత అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరన్ సింగ్ రోడ్ నుంచి జియాగుడ స్లాటర్ హౌస్ వరకు రోడ్డుపైనే మేకలు అమ్ముతున్న పరిస్థితి ఉందన్నారు. 100 ఫీట్ల రోడ్డును తవ్వి వదిలేయడంతో ఒక వైపు పూర్తిగా రోడ్డు లేకుండా పోయిందని తెలిపారు. జడ్జీలు, లాయర్లు ప్రయాణించే రోడ్డులో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఒక వైపు మూసీ బఫర్ జోన్‌లో పేద ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సరైన మౌలిక వసతులు లేవన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తప్పనిసరిగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.


## కాంగ్రెస్, బిఆర్‌ఎస్ తోడుదొంగలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు రెండూ తోడు దొంగలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఆ రెండు పార్టీలను కలిపేందుకే ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ హైదరాబాద్ వచ్చారని ఆరోపించారుఉ. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా ఉన్న యూపి మాజీ సిఎం బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వారి కలయిక ఇది మొదటిది కాదన్నారు. తమిళనాడు సిఎం స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలోనే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మొదటి కలయిక జరిగిందన్నారు. స్టాలిన్ అఖిలపక్ష సమావేశానికి రేవంత్, కెటిఆర్‌లు కలిసి చెన్నైకి వెళ్లినప్పుడే రెండు పార్టీలు ఒక్కటనీ తాము చెప్పామని, ఇవాళ అఖిలేష్ యాదవ్ కెటిఆర్‌ను కలవడంతో రెండు పార్టీల ఒప్పందం మరోసారి బయటపడిందని రాంచందర్ రావు ఆరోపించారు.

## సంపాదించే భార్యకు 'భరణం' పొందే హక్కు లేదు

### ఫ్యామిలీ కోర్టు చారిత్రక తీర్పు



**ముంబయి :** ప్రతినెలా ఆదాయాన్ని అర్జించే సామర్థ్యం కలిగిన భార్యకు భర్త నుంచి భరణం పొందే హక్కు లేదని సూరత్ ఫ్యామిలీ కోర్టు చారిత్రక తీర్పును వెలువరించింది. ఆమె నెలవారీ ఆదాయంతోనే జీవిత ప్రాథమిక అవసరాలను తీర్చుకోగలదని తేల్చి చెప్పింది. గుజరాత్‌లోని సూరత్‌కు దంపతుల్లో భార్య ఓ స్కూలులో టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె నెలవారీ శాలరీ రూ.20వేలు. భర్త ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఆయన నెలవారీ ఆదాయం రూ.35వేలు. పలు కుటుంబపరమైన కారణాలతో ఈ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో చాలా ఏళ్లుగా ఒకే ఇంట్లో ఎడమొహం పెడమొహంగా నివసిస్తున్నారు. ఈక్రమంలో తన భర్త నుంచి ఆమెకు విడాకులు కావాలని కోర్టును ఆశ్రయించింది. అలాగే ప్రతినెలా రూ.50వేల భరణాన్ని ఇప్పించాలంటూ సూరత్ ఫ్యామిలీ కోర్టులో భార్య పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిపై న్యాయ విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.

**భార్య పిటిషన్‌పై కోర్టు ఆగ్రహం**

రూ.50వేల భరణం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో పలు అవాస్తవాలను భార్య ప్రస్తావించిందని కోర్టు గుర్తించింది. ఆమె తనను తాను 'గృహిణి' (హౌజ్ వైఫ్)గా చెప్పుకుంది. ఏ ఉద్యోగమూ చేయకుండా ఇంటిపట్టునే ఉంటున్నట్లు పేర్కొంది. వాస్తవానికి ఆమె ప్రైవేటు టీచర్‌గా ఉద్యోగం చేస్తూ ప్రతినెలా రూ.20వేల శాలరీని పొందుతున్నట్లు బ్యాంకు స్టేట్‌మెంట్ల తనిఖీలో వెల్లడైంది. తన భర్తకు రూ.80వేల దాకా శాలరీ వస్తున్నందున, అందులో నుంచి ప్రతినెలా రూ.50వేలను భరణంగా ఇప్పించాలని కోర్టుకు ఆ మహిళ విన్నవించింది. వాస్తవానికి ఆమె భర్తకు ప్రతినెలా రూ.35వేల శాలరీయే వస్తోందని దర్యాప్తులో తేలింది. భర్త సంపాదించే ఆదాయం కంటే ఎక్కువ మొత్తాన్ని భరణంగా కోరడాన్ని సూరత్ ఫ్యామిలీ కోర్టు తప్పుపట్టింది. పిటిషన్‌లో అవాస్తవ సమాచారాన్ని ప్రస్తావించినందుకు మహిళపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సంతానం లేకపోయినప్పటికీ భర్తను ఇంత భారీ భరణాన్ని కోరుతూ మహిళ పిటిషన్ దాఖలు చేయడం అన్యాయమని భర్త తరఫు న్యాయవాది శివానీ చావ్లా వాదన వినిపించారు.

**ఆకలితో చనిపోయే అవకాశమే లేదు**

భరణం పిటిషన్ దాఖలు చేసిన మహిళ ప్రవర్తనను, ఆరోపణలను సూరత్ ఫ్యామిలీ కోర్టు తప్పుపట్టింది. ఇద్దరూ చాలా ఏళ్లుగా ఒకే ఇంట్లో ఉంటున్నారని, ఇంటి ఖర్చులన్నీ భర్తే భరిస్తున్నాడని న్యాయస్థానం గుర్తుచేసింది. భర్త ఆర్థిక సహకారం లేకుంటే ఆకలితో చనిపోయే స్థితిలో ఆ మహిళ లేదని వ్యాఖ్యానించింది. ఎందుకంటే ఆమె ప్రతినెలా రూ.20వేలు సంపాదించే సామర్థ్యాన్ని కలిగి ఉందని పేర్కొంది. ఆర్థికంగా తన కాళ్లపై తాను నిలబడే సామర్థ్యాన్ని భార్య కలిగిన ఉన్నప్పుడు, భర్త నుంచి భరణాన్ని డిమాండ్ చేయడం సరికాదని ఫ్యామిలీ కోర్టు పేర్కొంది. ఆవిధంగా డిమాండ్ చేయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని తెలిపింది. ప్రతినెలా రూ.50వేల భరణంతో పాటు కోర్టు కేసులకు తాను చేసిన ఖర్చులను చెల్లించమని కోరుతూ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసులో భార్య ద్వంద్వ ప్రమాణాలను కోర్టు తీవ్రంగా పరిగణించి, ఆమె అన్ని అభ్యర్థనలను తోసిపుచ్చింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావును

## రెండో రోజు విచారించిన సిట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) చీఫ్ ప్రభాకర్ రావును శుక్రవారం రెండో రోజు సిట్ అధికారులు విచారించారు. జూబ్లీ హిల్స్ ఏసిపి కార్యాలయంలో జరిగిన ఈ విచారణ పలు గంటల పాటు కొనసాగినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అక్రమంగా రాజకీయ నాయకులు, ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తల ఫోన్లను నిఘాలో ఉంచినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న ప్రభాకర్ రావును అధికారులు ప్రశ్నించారు. విచారణలో భాగంగా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన నిర్ణయాలు ఎవరి ఆదేశాల మేరకు తీసుకున్నా రన్న అంశంపై, నిఘా పరికరాల వినియోగం, టెక్నికల్ డేటా నిర్వహణ, ఇతర అధికారుల పాత్రపై సిట్ ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను అధికారులు ప్రభాకర్ రావు ఎదుట ఉంచినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో పలువురు పోలీసు అధికారులు, సాంకేతిక సిబ్బందిని సిట్ విచారించిన సంగతి తెలిసిందే. తాజా విచారణతో కేసు దర్యాప్తు మరింత కీలక దశకు చేరుకున్నదని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో, సిట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు మరిన్ని సంచలనాలకు దారితీ యవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ, అరెస్టులపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## శామీపేట్ గురుకుల పాఠశాలపై బాలల హక్కుల కమిషన్ దృష్టి

### సౌకర్యాల లోపాలపై ఆగ్రహం
### వారం రోజుల్లో సరిదిద్దాలని ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శామీపేట్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు సరిత శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఈ గురుకులంలో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు ఆమె గుర్తించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగినంత వాష్‌రూమ్‌లు లేకపోవడం, ఉన్న వాటికి తలుపులు లేకపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ దృష్టికి వచ్చింది. అలాగే మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడం లేదని, కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పిల్లలు సరితకి ఫిర్యాదు చేశారు. స్కూల్ ఇన్‌చార్జ్ నిర్లక్ష్యం వల్లే ఈ సమస్యలు తలెత్తాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడిన సరిత, వారం రోజుల్లో అన్ని లోపాలను సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సమస్య కారణంగా పలువురు పిల్లలకు చర్మ సంబంధిత దురదలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గమనించిన ఆమె, వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు అధికారులు తక్షణమే స్పందించి పిల్లల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని ఆమె స్పష్టం చేశారు. పిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్న నేపథ్యంలో, యాజమాన్యం తక్షణమే భవన మరమ్మతులు చేపట్టి మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు.

ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం..

## అమల్లోకి స్టేజ్-3 ఆంక్షలు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం (Delhi Pollution) డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. శనివారం ఉదయం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదైంది. 18 మానిటరింగ్ స్టేషన్లలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగానే నమోదయ్యాయి. తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజధాని నగరంలో ఆంక్షలు అమల్లోకి తెచ్చారు. తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలో జిఆర్‌ఎపి స్టేజ్3 ఆంక్షలు అమలు చేస్తున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. అనవసరమైన నిర్మాణాలు, కూల్చివేత పనులు, రాత్రి క్రషింగ్, మైనింగ్ కార్యకలాపాలపై నిషేధం విధించారు. అంతేకాదు డీజిల్‌తో నడిచే పాత వాహనాలకు ఢిల్లీలోకి ప్రవేశం లేదు. మరోవైపు విద్యాసంస్థలకు కూడా ప్రభుత్వం కీలక విజ్ఞప్తి చేసింది. హైబ్రిడ్ పద్ధతిని అవలంభించాలని సూచించింది. ఐదవత తరగతి వరకూ పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించింది. ఢిల్లీఎన్సీఆర్‌లోని కార్యాలయాలు 50 శాతం సిబ్బందితో మాత్రమే పనిచేయాలని సూచించింది.

**కాలుష్య కోరల్లో ఢిల్లీ**

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శనివారం ఉదయం ఢిల్లీ–ఎన్సిఆర్ ప్రాంతంలోని 18 మానిటరింగ్ స్టేషన్లలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగానే నమోదయ్యాయి. ఢిల్లీలో ఓవరాల్ ఏక్యూఐ 387గా నమోదైంది. వజీర్‌పూర్‌లో అత్యధికంగా ఏక్యూఐ లెవెల్స్ 443గా నమోదయ్యాయి. ఆ తర్వాత జహంగీర్‌పురిలో 439, వివేక్ విహార్‌లో 437, రోహిణి, ఆనంద్ విహార్ ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 434 చొప్పున, అశోక్ విహార్‌లో 431, సోనియా విహార్, డిటియులో 427 చొప్పున, నరేలాలో 425, బవానా ప్రాంతంలో 424, నెహ్రూ నగర్‌లో 421, పట్పర్‌గంజ్‌లో 419, ఐటిఒలో 417, పంజాబీ బాగ్‌లో 416, ముండ్కా ప్రాంతంలో 415, బురారీ క్రాసింగ్ వద్ద 413, చాందినీ చౌక్ ఏరియాలో 412, ఢిల్లీ యూనివర్సిటీ నార్త్ క్యాంపస్ ప్రాంతంలో 401గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి. ఎన్సీఆర్ ప్రాంతంలోనూ వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలోనే ఉంది. ఘజియాబాద్, నోయిడాలో ఏక్యూఐ స్థాయిలు 422గా నమోదయ్యాయి.


**కమ్మేసిన పొగమంచు..**

వాయు కాలుష్యానికి తోడు నగరంలోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో దృశ్యమానత పడిపోయింది. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. విజిబిలిటీ పడిపోయినప్పటికీ విమాన రాకపోకలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని తెలిపింది. ప్రయాణికులు తమ విమాన స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించింది. మరోవైపు ఉత్తర భారతం అంతటా సీజన్‌లో మొదటిసారిగా దట్టమైన పొగమంచు ఏర్పడింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోనూ పొగమంచు పరిస్థితులు ఏర్పడ్డాయి. యుపి, పంజాబ్‌లో విజిబిలిటీ 50 మీటర్లకంటే తక్కువగా నమోదైంది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

## రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో చలి తీవ్రత ఊహించని రీతిలో పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఈ చలి ప్రభావం ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై ఎక్కువగా పడుతోంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలోని ఏకంగా 28 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో అత్యల్పంగా 5.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గత పదేళ్లలో (డిసెంబర్ 12న) ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు ఎప్పుడూ నమోదు కాలేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా చలి తీవ్రత అధికంగా ఉంది. ఇక్కడ 10.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది, ఇది సాధారణం కన్నా 4.9 డిగ్రీలు తక్కువ కావడం గమనార్హం. హనుమకొండలో 8.5 డిగ్రీలు (సాధారణం కన్నా 7.4 డిగ్రీలు తక్కువ), ఆదిలాబాద్‌లో 5.6 డిగ్రీలు, మెదక్‌లో 6.5 డిగ్రీల మేర సాధారణం కంటే ఉష్ణోగ్రతలు పడిపోయాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, రాష్ట్రంలో శని, ఆది, సోమవారాల్లోనూ చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 9.2 డిగ్రీలలోపు నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపారు. వరుసగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధుల్లో చర్మం పగుళ్లు బారడం, కళ్ల నుంచి నీళ్లు రావడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అనేక జిల్లాల్లో ఉదయం 8 గంటలు దాటుతున్నా చలి తీవ్రత తగ్గడం లేదు. రోడ్లపై మంచు దుప్పటిలా పరుచుకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జాము సమయాల్లో ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 513 కొత్త 4జి టవర్ల నిర్మాణం




**రాయ్‌పూర్:** డిజిటల్ భారత్ నిధి కింద ఛత్తీస్‌గఢ్‌లో 513 కొత్త 4 జి టవర్లను నిర్మిస్తారు. ఈ టవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేసిందని శనివారం అధికారులు తెలియజేశారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. రాష్ట్రంలో దేశీయ తీవ్రవాదం నుండి తిరిగి శాంతి భద్రతలను పునరుద్ధరించే ఉమ్మడి కృషిలో భాగంగా మారుమూల నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధికి ఇదొక ముఖ్యమైన ఫలితమని ప్రశంసించారు. రాష్ట్రంలో మావోయిస్టులను నిర్మూలించేదిశగా ప్రస్తుతం జరుగుతున్న సమర్థవంతమైన కృషిలో భాగంగానే ఈ బలమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. భద్రతా దళాలు, పాలనాయంత్రాంగం సమన్వయం ద్వారా ఈ ప్రాంతంలో ఎక్కడైతే స్థిరత్వం నెలకున్నదో అక్కడ అభివృద్ధి విస్తరణ, డిజిటల్ కనెక్టివిటీల విస్తరణపై దృష్టి కేంద్రీకరణ జరుగుతోందన్నారు. బిఎస్ఎన్ఎల్ ద్వారా ఈ కొత్త 4 జి టవర్లను నిర్మిస్తున్నారని ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రాంతాలలో మారుమూల జీవిస్తున్న ప్రజలకు డిజిటల్ కనెక్టివిటీ సేవలను మొదటిసారి అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా ఈ ప్రాంతంలో విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు, సమగ్ర సమాచార వ్యవస్థను పెంపొందించి పటిష్టం చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో భద్రతతోపాటు అభివృద్ధికి కూడా తీసువస్తోందని, అందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి చెప్పారు. ఈ అభివృద్ధి బాటలు పరవడం వెనుక ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాల కృషి, వారి చరిత్రాత్మకమైన నిర్ణయాలు ఉన్నాయన్నారు.

పంచాయతీ ఎన్నికలకు వెళ్తుండగా ప్రమాదం

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**పెద్దశంకరంపేట:** మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం కోలపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది. మృతులు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగీ గ్రామానికి చెందిన లింగమయ్య, సాయమ్మ, సాయిలు, మానసగా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పెద్ద శంకరంపేట ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నక్సల్స్ వ్యతిరేక చర్యలో..

## రూ.92 కోట్ల ఆస్తులు సీజ్

### 'పట్టణ నక్సలైట్లకు' తీవ్ర నైతిక, మానసిక నష్టం : ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** నక్సల్స్ వ్యతిరేక చర్యలో భాగంగా బహుళ ఏజెన్సీల సమన్వయంతో రూ. 92 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా నక్సలైట్ల ఆర్థిక జీవనాధారాలపై గణనీయంగా దెబ్బపడిందని, సమాచార నెట్‌వర్క్‌లపై నియంత్రణను కఠినతరం చేయడం ద్వారా 'పట్టణ నక్సలైట్లకు' తీవ్ర నైతిక, మానసిక నష్టం వాటిల్లినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్చి 2026 నాటికి దేశాన్ని పూర్తిగా నక్సల్ రహితంగా మార్చాలనే దృఢమైన లక్ష్యాన్ని చేరుకోవడానికి, ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)లో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇది రూ. 40 కోట్లను స్వాధీనం చేసుకోగా, రాష్ట్ర అధికారులు అదనంగా రూ. 40 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ. 12 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. 'ఏకకాలంలో తీసుకున్న చర్యలు పట్టణ నక్సలైట్లపై తీవ్ర నైతిక, మానసిక నష్టాన్ని కలిగించాయి. వారి సమాచార యుద్ధ నెట్‌వర్క్‌లపై నియంత్రణను కఠినతరం చేశాయి' అని ఆ ప్రకటనలో పేర్కొంది. మావోయిస్టు తీవ్రవాదులపై తీసుకున్న చర్యల గురించి సమగ్ర వివరాలను అందిస్తూ, 2014లో 36 జిల్లాలు నక్సలిజంతో 'అత్యంత ప్రభావితం' కాగా, 2025 నాటికి కేవలం మూడు జిల్లాలు మాత్రమే ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. 2025లో ఇప్పటివరకు 317 మంది నక్సలైట్లను హతమార్చామని, 862 మందిని అరెస్టు చేశామని, 1,973 మంది లొంగిపోయారని అది పేర్కొంది. 2024లో ఒక కేంద్ర కమిటీ సభ్యుడితో సహా, 2025లో ఐదుగురితో కలిపి మొత్తం 28 మంది అగ్రశ్రేణి నక్సల్ నాయకులను మట్టుబెట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. భద్రతా దళాల ప్రధాన విజయాలను ప్రస్తావిస్తూ, ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 27 మంది కరడుగట్టిన నక్సలైట్లు హతమయ్యారని, మే 23, 2025న బిజాపూర్‌లో 24 మంది లొంగిపోయారని, అక్టోబర్ 2025లో ఛత్తీస్‌గఢ్ (197), మహారాష్ట్ర (61) వ్యాప్తంగా 10 మంది సీనియర్ నక్సలైట్లతో సహా 258 మంది లొంగిపోయారని ప్రభుత్వం తెలిపింది. నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 2014లో 126 నుండి 2025 నాటికి కేవలం 11కి తగ్గిందని, పటిష్టమైన పోలీస్ స్టేషన్ల సంఖ్య 2014 వరకు కేవలం 66 ఉండగా, గత 10 సంవత్సరాలలో 586 నిర్మించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నక్సల్ ఘటనలను నమోదు చేస్తున్న పోలీస్ స్టేషన్ల సంఖ్య 2013లో 76 జిల్లాల్లో 330 ఉండగా, జూన్ 2025 నాటికి 22 జిల్లాల్లో కేవలం 52కు పడిపోయాయి. అదనంగా, గత ఆరేళ్లలో 361 కొత్త భద్రతా శిబిరాలు స్థాపించారు. కార్యాచరణ పరిధిని బలోపేతం చేయడానికి 68 రాత్రి పూట హెలిప్యాడ్‌లు నిర్మించారు. ప్రభుత్వం నక్సలిజంపై ఏకీకృత, బహుముఖ, నిర్ణయాత్మక వ్యూహాన్ని అవలంబించిందని పేర్కొంది.

మే 2014–ఆగస్టు 2025 మధ్య ఈ ప్రాంతాలలో 12,000 కిలోమీటర్ల రహదారులను నిర్మించడంతో, నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం సమాంతరంగా కృషి చేసింది. మొత్తం 17,589 కిలోమీటర్ల ప్రాజెక్టులకు రూ. 20,815 కోట్ల వ్యయంతో ఆమోదం లభించిందని, గతంలో చేరుకోవడానికి వీలుకాని ప్రాంతాలలో అన్ని కాలాల్లోనూ కనెక్టివిటీష రాకపోకలను నిర్ధారిస్తున్నట్లు అది తెలిపింది. మొబైల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఒక ప్రధాన ప్రాజెక్ట్ కూడా చేపట్టబడింది, మొదటి దశలో రూ. 4,080 కోట్ల వ్యయంతో 2,343 (2జి) మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రెండవ దశలో రూ. 2,210 కోట్ల పెట్టుబడితో 2,542 టవర్లు మంజూరయ్యాయి. వాటిలో 1,154 ఇప్పటికే ఏర్పాటు అయ్యాయి. అదనంగా, ఆకాంక్షిత జిల్లాలు, 4జి శాచురేషన్ పథకాల కింద, 8,527 (4జి) టవర్లకు ఆమోదం లభించింది. వరుసగా 2,596, 2,761 టవర్లు ఇప్పుడు పనిచేస్తున్నాయి. ఇది ప్రధాన నక్సల్ ప్రాంతాలలో కమ్యూనికేషన్, నిఘా పరిధిని నాటకీయంగా మెరుగుపరిచిందని కేంద్రం వెల్లడించింది. నక్సల్ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను ప్రోత్సహించడానికి 1,804 బ్యాంకు శాఖలు, 1,321 ఎటిఎంలు ఏర్పాటు చేశారు. లోతైన ఆర్థిక సమ్మిళితాన్ని ప్రోత్సహించడానికి 37,850 బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించారు. ప్రభుత్వం 90 జిల్లాల్లో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక పోస్టాఫీసు ఉండేలా 5,899 పోస్టాఫీసులను కూడా తెరిచింది. గతంలో నక్సల్ ప్రభావంలో ఉన్న మారుమూల ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్, పోస్టల్, చెల్లింపుల సేవలను నేరుగా అందించిందని అది తెలిపింది. గత 11 సంవత్సరాలలో ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా నక్సల్ హింస 70 శాతానికి పైగా తగ్గిందని, పౌర, భద్రతా దళాల మరణాలు తగ్గాయని, అగ్ర మావోయిస్టు నాయకత్వం క్రమంగా తటస్థీకరించబడిందని, వేలాది మంది కార్యకర్తలు సాయుధ పోరాటానికి బదులుగా ప్రధాన స్రవంతి జీవితాన్ని ఎంచుకున్నారని ప్రకటన పేర్కొంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుజరాత్‌లో భూ ప్రకంపనలు

**అహ్మదాబాద్** :గుజరాత్‌లోశనివారం భూప్రకంపనలువచ్చాయి.కచ్ జిల్లాలో 3.9 తీవ్రతతో భూకంపం సంభవించిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ (ఐఎస్ఆర్) తెలిపింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి తెలిపారు. ఈ భూకంపం మధ్యాహ్నం 2:47 గంటలకు సంభవించిందని, జిల్లాలోని గఢ్‌శిషాకు ఉత్తర ఈశాన్య దిశలో 13 కిలోమీటర్ల దూరంలో భూకంపం ఉందని గాంధీనగర్‌కేంద్రంగాపనిచేసేఐఎస్ఆర్ పేర్కొంది.ఈ నెలలో కచ్‌లో 3 కంటే ఎక్కువ తీవ్రతతో నమోదైన ఐదవ భూకంపం ఇది. ఐఎస్ఆర్ నివేదిక ప్రకారం, శుక్రవారం జిల్లాలో 3.3,బుధవారం 3.7 తీవ్రతతో భూకంపాలు నమోదయ్యాయి. కచ్ 'అత్యంత ప్రమాదకర' భూకంప జోన్‌లో ఉంది. 2001 లో ఈ జిల్లాలో సంభవించిన వినాశకరమైన భూకంపంలో 13,000 మందికి పైగా మరణించారు.

## పార్లమెంట్‌పై ఉగ్ర దాడి.... అమరులకు నివాళి



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ భవనంపై 2001లో ఉగ్రవాదులు దాడికి పాల్పడగా, దాడిని ఎదుర్కోవడంపై అరులైన వారికి శనివారం ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళి అర్పించారు. దాడి జరిగి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాజ్యసభ చైర్మన్ కూడా అయిన రాధాకృష్ణన్ మొదట నివాళులర్పించారు. ఈ రోజును పురస్కరించుకుని ప్రతి డిసెంబర్ 13న పాత పార్లమెంట్ భవనం (సంవిధాన్ సదన్) వెలుపల ఒక చిన్న కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా పార్లమెంట్‌పై దాడిలో అమర వీరులకు నివాళి అర్పించారు. ఈ దేశం వారికి, వారి కుటుంబాలకు రుణపడి ఉందని అన్నారు. నేడు అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారతదేశ నిబద్ధతను తాము పునరుద్ఘాటిస్తున్నామని పోస్టు చేశారు. కాగా, సిఐఎస్ఎఫ్ సిబ్బంది వేదిక వద్ద సెల్యూట్ లేదా 'సమ్మాన్ గార్డ్' సమర్పించారు. ఆ తర్వాత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక క్షణం మౌనం పాటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకురాలు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా, పార్టీ సీనియర్ నాయకుడు కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్ కూడా వరుసలో నిలబడి ఉగ్రదాడిని తిప్పికొట్టిన సిబ్బంది ఛాయాచిత్రాలకు పుష్పగుచ్ఛాలు సమర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంటు దిగువ సభ మాజీ స్పీకర్, మాజీ కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు లాతూర్‌కు వెళ్లారు. ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మాట్లాడుతూ '2001లో మన పార్లమెంటుపై జరిగిన దారుణమైన దాడిలో ప్రాణాలు అర్పించిన వారిని మన దేశం గుర్తుంచుకుంటుంది' అని అన్నారు. 'తీవ్రమైన ప్రమాదం ఎదురైనప్పటికీ, వారి ధైర్యం, అప్రమత్తత, అచంచలమైన విధి భావం గొప్పవి. భారతదేశం వారి అత్యున్నత త్యాగానికి ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటుంది' అని నివాళులర్పించే వేడుకకు సంబంధించిన ఫొటోలను పంచుకుంటూ అన్నారు. ఈ దాడిలో ఐదుగురు సాయుధ ఉగ్రవాదులు పాల్గొన్నారు, కానీ ప్రస్తుత పార్లమెంట్ భద్రతా సేవ, సిఆర్‌పిఎఫ్, ఢిల్లీ పోలీసుల సిబ్బంది దాడిని భగ్నం చేశారు. ఏ ఉగ్రవాది కూడా భవనంలోకి ప్రవేశించలేకపోయారు. ఈ దాడిలో ఆరుగురు ఢిల్లీ పోలీసు సిబ్బంది, ఇద్దరు పార్లమెంట్ భద్రతా సేవ సిబ్బంది, ఒక తోటమాలి, ఒక టీవీ జర్నలిస్ట్ మరణించారు. ఆ ఐదుగురు ఉగ్రవాదులను అప్పటి పార్లమెంట్ భవనం ముందు ప్రాంగణంలో కాల్చి చంపారు.

# కేరళ స్థానిక సంస్థల్లో యుడిఎఫ్‌కు ఆధిక్యత

### జిల్లా పరిషత్‌లలో సగం గెలుచుకున్న ఎల్‌డిఎఫ్
### తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎన్‌డిఎ అనూహ్య విజయం



**తిరువనంతపురం:**కేరళ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్), ఐక్య ప్రజాతంత్ర సంఘటన (యుడిఎఫ్) చెరి సగం జిల్లా పరిషత్‌లను గెలుచుకున్నాయి. మొత్తం 14 జిల్లా పరిషత్(పంచాయత్)లలో ఎల్‌డిఎఫ్ 7, యుడిఎఫ్ 7 జిల్లాల్లో విజయం సాధించాయి. అయితే, గత స్థానిక సంస్థల ఎన్నికలకంటే ఈ సారి ఎల్‌డిఎఫ్ బలం తగ్గింది. గతంలో 11చోట్ల గెలుపొందగా, ఈ సారి 7 చోట్ల గెలుపొందింది. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్, జిల్లా పరిషత్, బ్లాక్‌లకు జరిగిన ఎన్నికల కౌంటింగ్ శనివారం జరిగింది. జిల్లా పరిషత్‌లలో రెండు ప్రధాన కూటములు చెరి సగం పంచుకోగా, మిగత వాటిల్లో యుడిఎఫ్ పై చేయి సాధించింది. మొత్తం 941 గ్రామ పంచాయతీల్లో యుడిఎఫ్ – 504 ఎల్‌డిఎఫ్ – 341, ఎన్‌డిఎ – 26 సర్పంచ్ పదవులనుకైవసంచేసుకోగా, 64 గ్రామాల్లో టై అయింది. మరోఆరు చోట్ల ఇతరులు గెలిచారు. అలాగే అన్ని పంచాయతీలలోని 17,337 వార్డుల్లో యుడిఎఫ్ – 7,922, ఎల్‌డిఎఫ్ – 6,483, ఎన్‌డిఎ – 1,421, ఇతరులు – 1,283 వార్డులలో విజయం సాధించింది. ఇక మున్సిపాలిటీల విషయానికి వస్తే, మొత్తం 86 పట్టణాలలో ఎన్నికలు జరగగా యుడిఎఫ్ 54, ఎల్‌డిఎఫ్ – 28, ఎన్‌డిఎ– 2,ఇతరులు –1, టై – 1 మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయి.ఈ పట్టణాలలోని 3,240 మున్సిపాలిటీ వార్డులలో యుడిఎఫ్ 1,458, ఎల్‌డిఎఫ్ – 1,100, ఎన్‌డిఎ – 324, ఇతరులకు – 323 వార్డులు దక్కాయి. ఫలితాలను పరిశీలిస్తే గతంతో పోల్చినట్లయితే ఎల్‌డిఎఫ్ బలం కాస్త తగ్గినప్పటికీ, ఇప్పటికీ బలమైన శక్తిగానే ఉంది.ఎన్‌డిఎ ప్రధానంగా కొన్ని పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైనట్లు కనపబడుతుంది.

### కార్పొరేషన్‌లో ఎల్‌డిఎఫ్‌కు నిరాశ

ఆరు మున్సిపల్ కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ కేవలం కోళిక్కోడ్ కార్పొరేషన్‌ను మాత్రమే దక్కించుకుంది. యుడిఎఫ్ కొల్లాం, త్రిచ్చూరు, కొచ్చిన్, కన్నూరు కార్పొరేషన్‌లలో గెలుపొందగా, అనూహ్యంగా ఎన్‌డిఎ తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకుంది. తిరువనంతరపురంలో 100 వార్డులలో ఎన్‌డిఎ – 50 చోట్ల (గత ఎన్నికల్లో 34) గెలుపొందగా, ఎల్‌డిఎఫ్ 29, యుడిఎఫ్ – 19 డివిజన్‌లు గెలుచుకున్నాయి. బ్లాక్ ఎన్నికల్లో యుడిఎఫ్ 79, ఎల్‌డిఎఫ్–63 గెలుచుకున్నాయి.

### ఆశించిన ఫలితాలు రాలేదు : సిఎం విజయన్



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిందని కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రబల విజ యం సాధిస్తామని భావించామని, కానీ, అలా సాధించలేకపోయామన్నారు. ఇం దుకు కారణాలను వివరంగా పరిశీలిస్తామని,అవసరమైన దిద్దుబాట్లు చేసు కున్న తరువాత ముందుకు సాగుతామని అన్నా రు. తిరువనంతపురంలో ఎన్‌డిఎ పై చేయి సాధించటాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం మతతత్వం ప్రభావితం చేయ డం లౌకికవాదాన్ని విశ్వసించేవారికి ఆందోళన కలిగించే విషయమని అన్నా రు. మతతత్వ శక్తుల తప్పుడు ప్రచారం, విభజన ఎత్తుగడల బారిన ప్రజలు పడకుండా మరింత జాగురుకత అవసరమని ఎన్నికల ఫలితాలు హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల మతతత్వవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఫలితాలు గట్టిగా చెబుతున్నాయ న్నారు. తన పునాదిని మరింత విస్తరించేందకు, వామపక్ష ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజల మద్దతును పెంపొందించుకునేందుకు ఎల్‌డిఎఫ్ మరింత పట్టుదలతో పని చేస్తుందన్నారు.

### ప్రభుత్వ వ్యతిరేకత ఉందేమో పరిశీలిస్తాం : బినోయ్‌విశ్వం



స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, ప్రభుత్వ వ్యతిరేక భావన ఏమైనా ఉందా అని పరిశీలిస్తామని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు. వామపక్ష విలువలకు కట్టుబడి ఉంటామని, సరిదిద్దుకోవాల్సిన వైఖరిని సరిదిద్దుతామని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్‌లోని ప్రతి భాగస్వామ్య పక్షం ఈ ఎన్నికల నుండి పాఠాలు నేర్చుకుని తన కార్యకలాపాలను బలోపేతం చేసుకుని మూడు దిశల్లో వెళ్తుందన్నారు. గుడ్డి వామపక్ష శత్రుత్వంతో యుడిఎఫ్– బిజెపి పరోక్షంగా, ప్రత్యక్షంగా చేతులు కలిపి ఎల్‌డిఎఫ్‌ను ఎదుర్కొంటున్నాయి. కేరళలో బిజెపి–కాంగ్రెస్ సంబంధం చాలా కాలంగా ఉందని, ఈ ధోరణి ఇప్పుడూ ఉందన్నారు. అయితే, అది అన్ని చోట్లా ఉందని కాదని, భవిష్యత్తులో కూడా ఇది కనిపిస్తుందని, వీటన్నింటినీ అధిగమించి వామపక్షం గెలుస్తుందని ఆయన అన్నారు. వామపక్షాలు ఓటమిని విశ్లేషిస్తాయని, ప్రజలు దానిని ఎలా చూస్తారో పరిశీలిస్తుందని, ప్రజలను గొప్పగా చూస్తారని ఆయన తెలిపారు. తమది ప్రజలకు ఎంతో చేసిన ప్రభుత్వమని, ప్రభుత్వం చేసిన ప్రతిదాన్ని ప్రజలు చూస్తున్నారని, అయినప్పటికీ, ప్రజలు ఎందుకు ఇలా ఆలోచించారో మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని బొనోయ్ విశ్వం నొక్కి చెప్పారు.

# మెస్సీ టూర్‌లో గందరగోళం

### వివేకానంద యువభారతి సాల్ట్ లేక్ స్టేడియంలోకి వాటర్ బాటిళ్లు విసిరిన ఫ్యాన్స్
### పోలీసుల లాఠీచార్జ్, ఉన్నతస్థాయి విచారణకు సిఎం ఆదేశం
### మెస్సీకి క్షమాపణలు చెప్పిన మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ :**అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి గోట్ టూర్‌లో గందరగోళం నెలకొంది. గోట్ టూర్‌లో భాగంగా మెస్సీ శనివారం కోల్‌కతాలో వివేకానంద యువ భారతి సాల్ట్ లేక్ స్టేడియంలో పర్యటించాడు. అయితే ఆయనను స్పష్టంగా చూడకపోవడంతో వేలాది మంది అభిమానులు నిరసన వ్యక్తం చేయడంతో గందరగోళం చెలరేగింది. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేయగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. మెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ శతద్రు దత్తాను అరెస్ట్ పోలీసులు చేశారు. మెస్సీ పాల్గొన్న కార్యక్రమాన్ని నిర్వహించడంలో విఫలమైనందుకు గానూ.. ఆయన్ను బాధ్యుణ్ని చేస్తూ అరెస్ట్ చేసినట్టు కోల్‌కతా లా అండ్ ఆర్డర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జావేద్ షమీమ్ ధృవీకరించారు. కాగా 2011 తర్వాత తొలిసారిగా మెస్సీ వేదికపైకి రావడంతో, టిక్కెట్ల కోసం భారీ మొత్తాలు చెల్లించినప్పటికీ, ప్రేక్షకుల్లో పెద్ద సంఖ్యలో నిరాశ చెందడంతో, మార్క్యూ ఫుట్‌బాల్ ఆగ్రహావేశాలకు గురై గందరగోళంగా మారింది. దీర్ఘకాల స్ట్రైక్ భాగస్వామి లూయిస్ సువారెజ్, అర్జెంటీనా సహచరుడు రోడ్రిగో డి పాల్‌తో కలిసి, ప్రపంచ కప్ విజేత కెప్టెన్ మెస్సీ ఉదయం 11.30 గంటల ప్రాంతంలో వివేకానంద యుబా భారతి క్రిరంగన్ వద్దకు చేరుకున్నారు. అతని వాహనం టచ్‌లైన్ వద్ద పార్క్ చేసి మైదానంలోకి అడుగుపెట్టగానే, అతన్ని విఐపిలులు, నిర్వాహకులు, ప్రముఖులు, భద్రతా సిబ్బంది త్వరగా చుట్టుముట్టారు. దీంతో అతన్ని చూసేందుకు గ్యాలరీలలో కూర్చుకున్న ప్రేక్షకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 'మెస్సీ, మెస్సీ' అంటూ అభిమానుల నినాదాలు మధ్య ఆయన మైదానంలో కొద్ది దూరం నడిచి స్టాండ్స్ వైపు చేయి ఊపుతూ అభివాదనం చేశాడు. అయితే, అభిమానులు ఫుట్‌బాల్ క్రీడాకారుడిని పలువురు చుట్టుముట్టారని, పైగా స్టేడియంలో కొన్ని ప్రదేశాల నుంచి అతని కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద స్క్రీన్‌లు కూడా స్పష్టమైన దృశ్యాన్ని అందించలేకపోయాయనిమండిపడ్డారు. గందరగోళం మధ్య అతడు కేవలం 10 నిమిషాలే మైదానంలో కనిపించాడు. తర్వాత అతడిని భారీ సెక్యూరిటీ మధ్య హోటల్‌కు తీసుకెళ్లారు. దీంతో ఫ్యాన్స్ మండిపడ్డారు. అర్జెంటీనా స్టార్ మైదానం నుండి అకాలంగా వెళ్లిపోయాడనే వార్త వ్యాపించడంతో, మైదానంలోకి సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలు విసిరివేశారు. స్పాన్సర్ బ్యానర్లు, హోర్డింగ్‌లను కూల్చివేశారు, ఫైబర్‌గ్లాస్ సీట్లు పగలగొట్టారు.ప్రేక్షకులలో కొంతమంది బారికేడ్లను చీల్చి వేసి మైదానంలోకి బలవంతంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. రాష్ట్ర క్రీడా మంత్రి అరూప్ బిశ్వాస్, ఈవెంట్ నిర్వాహకుడు శతద్రుడు దత్తాను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మెస్సీ నిష్క్రమించిన వెంటనే దత్తా మరియు అతని బృందంతో సహా నిర్వాహకులు మైదానంలో కనిపించకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనధికార వ్యక్తులు మైదానం విడిచి వెళ్లాలని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లో పదే పదే చేసిన ప్రకటనలు పెద్దగా పట్టించుకోలేదు. నిమిషాల వ్యవధిలోనే, వందలాది మంది ప్రేక్షకులు మైదానంలోకి దూసుకెళ్లి తాత్కాలిక టెంట్లను, టచ్‌లైన్ దగ్గర ఉంచిన పరికరాలను ధ్వంసం చేశారు. భారీ జన సమూహాన్ని అదుపు చేయడానికి పోలీసులు ఇబ్బంది పడ్డారు. దీంతో స్టేడియం లోపల రాపిడ్ యాక్షన్ ఫోర్స్ మోహరించారు.

### పూర్తిగా నిర్వహణ లోపం

కాగా, ఇది పూర్తిగా నిర్వహణ లోపం అని తన కొడుకుతో వచ్చిన ఫుట్‌బాల్ ఔత్సాహికుడు అజయ్ షా అన్నారు. 'మెస్సీని చూడటానికి ప్రజలు ఒక నెల జీతం ఖర్చు చేశారు. నేను టికెట్ కోసం రూ. 5,000 చెల్లించాను. మేము మెస్సీని చూడటానికి వచ్చాము, రాజకీయ నాయకులను కాదు. తాగడానికి నీరు లేదు, పోలీసులు కూడా సెల్ఫీలు తీసుకుంటూ బిజీగా ఉన్నారు' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి టిక్కెట్ ధరలు రూ. 4,500 నుండి రూ. 10,000 వరకు ఉన్నాయి, ఫుట్‌బాల్ లెజెండ్‌ను దగ్గరగా చూడాలనే ఆశతో చాలా మంది అభిమానులు ఉదయాన్నే వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ గందరగోళం కారణంగా కార్యక్రమాన్ని అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చింది, బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సహా అనేక మంది ఆహ్వానించబడిన ప్రముఖులు ప్రణాళిక ప్రకారం పాల్గొనలేకపోయారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పలేదని పోలీసువర్గాలు తెలిపాయి.

మెస్సీని షెడ్యూల్ కంటే ముందే స్టేడియం నుండి బయటకు తీసుకెళ్లడం, అదనపు భద్రతా దళాలను తరలించడం వల్లే పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### మెస్సీకి మమతా బెనర్జీ క్షమాపణలు

అర్జెంటీనాకు చెందిన ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీకి బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణలు చెప్పారు. శనివారం ఉదయం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ పాల్గొన్న కార్యక్రమ నిర్వహణలో అపశృతి చోటుచేసుకుందని తెలిసి షాక్‌కు గురైనట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులను గుర్తించేందుకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మమత ప్రకటించారు. రిటైర్డ్ న్యాయమూర్తి ఆశిమ్ కుమార్ రే సారథ్యంలో ఏర్పాటయ్యే ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ, అదనపు చీఫ్ సెక్రెటరీ, రాష్ట్ర హోంహిల్ అఫైర్స్ విభాగం ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. వేలాది మంది ఫ్యాన్స్‌లాగే తాను కూడా ఫుట్‌బాల్ ఐకాన్ లియోనల్ మెస్సీని చూసేందుకు సాల్ట్ లేక్ స్టేడియంకు బయలుదేరానని మమత చెప్పారు. అంతలోనే మెస్సీ కార్యక్రమంలో రసాభాస జరిగిందనే సమాచారం తెలిసి షాక్‌కు గురైనట్లు సీఎం తెలిపారు.

### ఈవెంట్ నిర్వాహకులపై హత్యాయత్నం కేసు పెట్టాలి: బెంగాల్ గవర్నర్

'కోల్‌కతాలోని క్రీడా ప్రియులకు ఇది చీకటి రోజు లాంటిది. లియోనల్ మెస్సీ ఈవెంట్‌ను నిర్వహించిన వారి వైఫల్యం వల్లే ఇంత రాద్ధాంతం జరిగింది. వారిని అరెస్టు చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించాను. ఈవెంట్ నిర్వాహకులపై హత్యాయత్నం అభియోగాలతో కేసును నమోదు చేయమని సూచించాను. ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న సిఎం మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసులు కూడా విఫలమయ్యారు. వారందరూ కలిసి క్రీడా ప్రియులకు నిరాశను మిగిల్చారు. మెస్సీని కలవడానికి బయలుదేరిన సిఎం మమత మార్గం మధ్యలోనే వెనుదిరగాల్సి వచ్చిందని తెలిసి నేను షాక్‌కు గురయ్యాను. అందుకే ఇది సీరియస్ అంశం. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందే. మెస్సీని ఒక వాణిజ్య సరుకుగా మార్చిన వాళ్లెవరో గుర్తించాలి. ఈ ఈవెంట్ టికెట్లను కొన్న వాళ్లందరికీ ఛార్జీలను రీఫండ్ చేయాలి. స్టేడియానికి నష్టం కలిగించినందుకు ఈవెంట్ నిర్వాహకులపై జరిమానా విధించాలి. సకాలంలో స్పందించనందుకు సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలి' అని బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ వ్యాఖ్యానించారు.

## ఇలాంటి వాళ్లకు గుణపాఠం నేర్పాలి
### 'హిట్ అండ్ రన్' కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో గత ఏడాది చోటు చేసుకున్న హిట్ అండ్ రన్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తు చేపట్టేందుకు నిరాకరించింది. ఇలాంటి వాళ్లకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. బైక్‌పై వెళ్తున్న దంపతులను నిందితుడు తన కారుతో అతివేగంగా ఢీకొట్టడమే కాకుండా, అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎజి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. చేసిన నేరానికి అతడు కొద్ది రోజులపాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. కాగా గత ఏడాది ముంబయిలోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బిఎండబ్ల్యు కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దాంతో స్కూటీపై ఉన్న దంపతులు ఎగిరిపడ్డారు. అనంతరం కారు మహిళపై నుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కావేరి నక్వా (45) అనే మహిళ అక్కడికక్కడే మరణించింది. ఆమె భర్త గాయపడ్డారు. ఇదిలావుంటే ప్రమాదం తర్వాత మిహిర్ కొద్ది దూరంలో తన కారును వదిలేసి ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో హిట్ అండ్ రన్ కేసులో బెయిల్ ఇవ్వాలని మిహిర్ ముంబై హైకోర్టులో పిటిషన్ వేశారు. కానీ న్యాయస్థానం బెయిల్‌ను తిరస్కరించింది. దాంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

### అధికారిక లాంఛనాలతో...
# లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ అంత్యక్రియలు పూర్తి



**లాతూర్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్‌పాటిల్ అంత్యక్రియలు శనివారం ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని లాతూర్‌లో పూర్తి అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజకీయ అగ్రనాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, తండోపతండాలుగా తరలివచ్చిన పజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నాయకుడికి కడపటి కన్నీటి నివాళులు అర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, మాజీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖాండ్రే హాజరైన వారిలో ఉన్నారు. లింగాయత్ కమ్యునిటీకి చెందిన ప్రముఖుడైన శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి 6 కి.మీ.దూరంలో ఉన్న వర్వంతి గ్రామం వద్ద నున్న ఆయన వ్యవసాయ క్షేత్రంలో ధ్యాన భంగిమలో కూర్చున్న స్థితిలో ఖననం చేశారు. ఈ లింగాయత్ ఆచారం, మరణించిన ఆత్మ వెంటనే శివుడితో ఏకమవుతుందని, పునర్జన్మకు లోబడి ఉండదనే వారి నమ్మకం నుండి ఉద్భవించింది. తద్వారా ఆత్మను అనవసరమైన వాటి నుంచి విడిపించడానికి దహన సంస్కారాలు చేస్తారు. 90ఏళ్ల శివరాజ్ పాటిల్ అనారోగ్యంతో లాతూర్‌లో మరణించారు. అర్థ శతాబ్దపు ఆయన రాజకీయ జీవితంలో లోక్‌సభ స్పీకర్ పదవీ బాధ్యతలతోపాటు, పలు మంత్రిత్వశాఖలకు కేంద్రమంత్రిగా కేంద్ర ప్రభుత్వంలో ఆయన అనేక కీలక స్థానాలలో బాధ్యతలను నిర్వర్తించారు. పాటిల్ భౌతికకాయంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించగా, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్, లాతూర్ లోక్‌సభ సభ్యుడు శివాజీ కోల్గే పాల్గొన్నారు. అంత్యక్రియలకు ముందు శివరాజ్‌పాటిల్‌కు పోలీసులు తుపాకీ వందనం సమర్పించారు. ఏడు దశాబ్దాలుగా దేశానికి సామాజిక, రాజకీయ జీవితానికి చేసిన సేవలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'శివరాజ్ పాటిల్ వివిధ పదవులకు ప్రాతినిథ్యం వహించారు. లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ఆ పదవికే వన్నెతెచ్చారు. పార్లమెంట్ కమిటీలతో సహా అనేక మార్పులకు ఆద్యుడై లోక్‌సభ ప్రతిష్ఠను ఉన్నత శిఖరాన నిలబెట్టారు. ఆయన సామాజిక, రాజకీయ రంగాలలో అందించిన సేవలు, సహకారం ఎల్లప్పుడూ జాతి గుర్తుంచుకుంటుంది' అని లోక్‌సభ స్పీకర్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ తాను 1967లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు శివరాజ్ పాటిల్‌ను కలిశానని, ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోయిందని, ఆయన ప్రజాస్వామ్య సౌధానికి ఒక బలమైన స్థంభంగా నిలిచారని, 'భారతదేశానికి నిజమైన కొడుకుగా తనను తాను అంకితం చేసుకున్న మహనీయుడు' అని చెప్పారు. ఆయన ఒక కళాకారుడు, కవి, ఆలోచనాపరుడని, ఒక సాధువుగా సాధారణ జీవితం గడిపారని, ఆయన సామాజిక, ఆర్థిక, మతం, విద్యారంగాలకు ఎంతగానో దోహద పడ్డారని గుర్తుచేశారు.

## వాళ్లకు పని చేతకాదు... ఉన్నత పదవులే ముఖ్యం
### రాహుల్‌గాంధీ, సిద్ధూలపై పంజాబ్ సిఎం ఫైర్

**ఛండీగఢ్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పంజాబ్ కాంగ్రెస్ సీనియర్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ పై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. క్షేత్రస్థాయిలో పనితీరు కనబరచకుండానే ఉన్నత పదవులు ఆశించడం వారిద్దరిలో ఉన్న ప్రధాన సమస్య అని మాన్ ఎద్దేవా చేశారు. 'నన్ను ప్రధానిని చేయండి, నేను ఏదో ఒకటి చేస్తా' అని రాహుల్ గాంధీ చెబుతుంటారని, కానీ దేశ ప్రజలు మాత్రం ముందు మీరు ఏదైనా చేసి చూపించండి, ఆ తర్వాతే మిమ్మల్ని ప్రధానిని చేసే విషయం ఆలోచిస్తామని అంటున్నారని మాన్ తెలిపారు. పంజాబ్‌లో నవజ్యోత్ సింగ్ సిద్ధూ కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారని ఆయన విమర్శించారు. తనను ముఖ్యమంత్రిని చేయాలని సిద్ధూ పంజాబ్ ప్రజలను కోరుతున్నారని, కానీ ముందు మీ పనితీరు చూపించండి, ఆ తర్వాత ఆలోచిస్తామని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారని మాన్ అన్నారు. అధికారాన్ని డిమాండ్ చేయడం కాదని, ప్రజాస్వామ్యంలో దాన్ని పనితీరుతో సంపాదించుకోవాలని సూచించారు. కాగా ఇటీవల నవజ్యోత్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ పంజాబ్ కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో భగవంత్ మాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో జవాబుదారీతనం, స్పష్టత లేవనడానికి ఇలాంటి బహిరంగ విమర్శలే నిదర్శనమని ఆయన విమర్శించారు.




## ఎక్కువగా మాట్లాడుతున్నారా?



అవసరం లేకపోయినా ఎక్కువగా మాట్లాడే వారు ఏదో ఒక సందర్భంలో ఎదురవుతారు. వీరికి 'భోళా మనుషులు' అని కితాబునిచ్చినప్పటికీ, మితంగా మాట్లాడే వారికే ఎక్కువ విలువ ఉంటుంది. వివిధ అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎక్కువగా మాట్లాడటం మీ ఉనికిని బలహీనపరుస్తుంది. సంక్షిప్తమైన పదాలు ఎక్కువ బలంగా, సూటిగా ఎదుటివారికి చేరుతాయి. 'ఎక్కువగా వివరించడం' అనేది ఎప్పుడూ అసురక్షిత భావన వల్లే ఉద్భవిస్తుంది. మౌనం మాత్రం ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. అందుకే తక్కువ మాట్లాడాలి. వాదన చేయకుండా, 'నోట్ చేసుకున్నాను' అని మాత్రమే చెప్పాలి. ఎక్కువగా వివరించకుండా, సింపుల్‌గా 'మీ మాట వినిపించింది' అంటే సరిపోతుంది. కొన్నిసార్లు మౌనం అత్యంత బలమైన ప్రకటనగా మారుతుంది.

## అతి ధోరణికి అడ్రస్ 'అడెస్'



కొంతమంది అతిగా వ్యవహరిస్తుంటారు. కానీ, నిజమైన 'అతి'కి మారుపేరుగా అమెరికాలోని అరిజోనాకు చెందిన జాక్వెలిన్ అడెస్‌ను పేర్కోవాలి. 2018 – 2019 మధ్యకాలం లో, కేవలం 10 సంవత్సరాల వ్యవధిలోనే ఆమె ఒక వ్యక్తికి ఏకంగా 1,59, 000లకుపైగా మెసేజీలు పంపింది. వివరాల్లోకి వెళితే, 'లగ్జరీ' అనే డేటింగ్ యాప్‌లో ఆడెన్ కు ఒక చర్మ సంరక్షణ కంపెనీ సిఇఒతో పరిచయమైంది. అంతే, అతనికి మెసేజీలు పంపడం మొదలు పెట్టింది. వీటిలో అనేక సందేశాలు భయపెట్టేలా, వికృతమైన విషయాలతో నిండివున్నాయి. చివరకు ఆ మహిళ అతని ఇంట్లోకి చొరబడి ప్రవేశించడంతో ఈ ఘటన మరింత తీవ్రమైంది. మొద ట సాధారణంగా కనిపించిన ఒక ఆన్‌లైన్ డేటింగ్ మ్యాచ్, చివరికి ఎలాంటి ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తుందో చెప్పడానికి ఆడెస్ ఉదంతం ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఈ ఘటన ప్రేమాభిమానంగా మొదలైన ఆకర్షణ ఎలా క్రమంగా అబ్బసెషన్‌గా మారి, వ్యక్తిగత హద్దులన్నింటినీ చెరిపేసే దాకా వెళుతుందో గుర్తు చేస్తుంది. ప్రతి ఆన్‌లైన్ పరిచ యం సురక్షి తం కాదని స్పష్టం చేస్తుంది. బయటికి సాధారణ చాట్‌లా కనిపించే సంబంధం, కొద్ది సమయంలోనే మానసిక అసమతుల్యత, బెదిరింపులు, హింసా అవకాశాల దిశగా జారిపోవచ్చు. ఇది ఒక విచిత్రమైన, మనసు కలిచివేసే కథ. ఒక హెచ్చరికగా, ఆధునిక డేటింగ్ ఎంత వేగంగా చీకటి మలుపు తీసుకోవచ్చో తెలిపే కఠినమైన పాఠం. నిందితురాలు అడెస్ బాధితుడి తో ఒకేసారి డేట్‌కి వెళ్లింది. అతను తిరిగి సంబంధం కొనసాగించదలచుకోకపోయినా, ఆమె నెలల తరబడి రోజుకు వందల సందేశాలు పంపింది. అతని ఇంటి బయట కారులో కూర్చోవడం, చివరికి అతడు విదేశాలకు వెళ్లినప్పుడు ఇంట్లోకి చొరబడి స్నానం చేయడం వంటి చర్యలకు దిగింది. అడెస్ అసభ్య ప్రవర్తన, మెసేజీలపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు క్రిమినల్ స్టాకింగ్, ట్రెస్పాసింగ్, హరాస్‌మెంట్ కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది.

## మష్రూమ్స్ ప్రభావం..




ఆఫ్ డ్యూటీ పైలట్ ఒకరు విమానం ప్రయాణిస్తున్న సమయంలోనే ఇంజిన్లు ఆఫ్ చేయడానికి ప్రయత్నించడం యావ త్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అతను చేసిన పని 83 మంది ప్రాణాలను ప్రమాదంలో పడేసేది. అయితే, పైలట్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. తాజాగా బయటపడిన కాక్‌పిట్ ఆడియో ద్వారా 2023 అక్టోబర్‌లో జరిగిన ఆ సంఘటన వెలుగులోకి వచ్చిం ది. వివరాల్లోకి వెళితే, సియాటిల్ నుంచి సాన్ ఫ్రాన్సిస్కోకు బయలుదేరిన అలస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన హారిజాన్ ఎయిర్ జెట్ పూర్తిగా కిక్కిరిపోయింది. దీనితో ఆఫ్ డ్యూటీ పైలట్ జోసెఫ్ ఎమర్సన్‌ను కాక్‌పిట్‌లోని జంప్ సీట్‌లో కూర్చోబెట్టారు. విమానం ఎగురుతున్నప్పుడు ఎమర్సన్ హఠాత్తుగా పైకప్పులో ఉన్న రెండు ఎమర్జెన్సీ ఇంజిన్ షట్‌ఆఫ్ హ్యాండిల్స్‌ను అందుకొని, వాటిని లాగేయడానికి ప్రయత్నించాడు. ఇవి సాధారణంగా అగ్ని ప్రమాదం జరిగితే ఇంజిన్‌కు ఫ్యూయల్ కట్ చేయడానికి ఉపయోగిస్తారు. అంటే విమానం ఇంజిన్లు పూర్తిగా ఆగిపోతాయి. కాగా, ఈ ఘటన జరిగిన వెంటనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం పైలట్ విజ్ఞప్తి చేయ గా, పోర్ట్‌ల్యాండ్‌లో దిగేందుకు అధికారులు అనుమతించారు. అక్కడ ఎమర్సన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు రెండు రోజుల క్రితం తిన్న మ్యాజిక్ మష్రూమ్స్ ప్రభావం వల్ల తాను ఏం చేస్తున్నదీ తెలియలేదని, అంతగా అవి తన మస్తిష్కంపై ప్రభావం చూపాయని ఎమర్సన్ విచారణ సమయంలో పేర్కొన్నాడు. నిద్రలేమి కారణంగా తాను కలగంటున్నట్టు భావించానని, హ్యాండిల్స్ లాగితే నిద్రలేస్తానని భావించానని చెప్పుకొచ్చాడు. 'నా జీవితంలో అవే అత్యంత ప్రమాదకరమైన మూడు సెకెన్లు' అని ఒక ఇంటర్వ్యూలో ఎమర్సన్ వ్యాఖ్యానించాడు. అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మహాత్మాగాంధీ పేరుకు ఎసరు

నరేంద్రమోదీజీ ఇదేం న్యాయం? ఎందుకు గాంధీజీ పేరు చెరిపివేసే ప్రయత్నం చేస్తున్నారు. మీకు నెహ్రూ–ఇందిరాగాంధీల కుటుంబంపై ద్వేషం ఉండవచ్చు, దాన్ని అడుగడుగునా ప్రదర్శిస్తూనే ఉన్నారు. వారికి వ్యతిరేకంగా అదే కాంగ్రెస్‌పార్టీలోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్‌ను సొంతం చేసుకుని తమరి పార్టీలో స్వాతంత్ర్య సమరయోధులు లేని కొరతను తీర్చుకుని ఆత్మసంతృప్తి చెందుతున్నారు. స్వాతంత్ర్యపోరాట సమర నినాదంగా భాసిల్లిన బంకించంద్ర చటోపాధ్యాయ విరచిత 'వందేమాతరం' గీతాన్ని ఆ కాలంలో పాడటానికి మీ హిందుత్వ భావజాల వ్యవస్థాపక నాయకులకు గొంతు పెగలలేదు. ఎందుకంటే వారు బ్రిటిష్‌వారి సేవలో ఉన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా చాలాకాలంపాటు వారు, వారి వారసులైన మీ గణం ఆ గీతం పాడలేదు, త్రివర్ణ పతాకాన్ని నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఎగురవేయలేదు. గాంధీజీని మీ పూర్వాశ్రమవాసి గాడ్సే హత్యచేసిన అనంతరం ఆర్ఎస్ఎస్‌ను నిషేధించింది అప్పటి హోం మంత్రి పటేలే. అయినా పచ్చి అవకాశవాదంతో ఇప్పుడు ఆయన భజన చేస్తున్నారు. వందేమాతరం గీతాన్ని పాడని మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను దూషించేందుకు దాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ పరమ దేశభక్తి ప్రదర్శిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని ఆనాడు తూలనాడిన మీరు ఇప్పుడు దాని ఆధారంగానే అధికారం చలాయిస్తూ దానికి తూట్లు పొడుస్తున్నారు. ఇదంతా రాజ్యాంగం ఆదేశించిన లౌకికవాదానికి వ్యతిరేకమైన హిందూమతోన్మాద బతుకుతెరువు రాజకీయం అని సరిపెట్టుకుందామా? కానేకాదు, ఉద్దేశపూర్వకంగా సాగిస్తున్న వక్రీకరణ. లేని పాత్రను ఆపాదించుకునే దుర్మార్గపు ప్రయత్నం. హిందూ–ముస్లింల మధ్య శాంతి, సహజీవనం కోసం పాటుబడిన, జీవితాన్ని త్యాగం చేసిన, దూరదృష్టితో జవహర్‌లాల్ నెహ్రూను తొలి ప్రధానిని చేసిన జాతిపిత మహాత్మాగాంధీపట్ల కూడా మీకున్న ద్వేషాన్ని మీరు అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన 'స్వచ్ఛభారత్'కు ఆయన కళ్లజోడు చిత్రాన్ని సంకేతంగా ఉపయోగించినప్పుడే సూచనప్రాయంగా వెల్లడైంది. ఇప్పుడు మీ మంత్రివర్గం ''మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'' నుండి ఆయన పేరు తొలగించాలని నిర్ణయించి విద్రోహానికి పాల్పడింది. 'మహాత్మాగాంధీ' పేరు తొలగించి 'పూజ్య బాపూ' అని చేర్చి తమ భక్తిభావాన్ని చాటుకున్నామని మీరు చెప్పుకోవచ్చు. నరేంద్రమోదీ అంటే అత్యధిక జనాభాకు తెలుస్తుందా లేక ఎన్.డి.డి.మోదీ (నరేంద్ర దామోదర్ దాస్ మోదీ)అంటే తెలుస్తుందా? అలాంటిదే ఆ చట్టంలో పేరు మార్పు కూడా. పూజ్య బాపూ అనేది ఇప్పుడే బహు పరిమితంగా వాడుకలో ఉంది. కొన్ని దశాబ్దాల తదుపరి ఆ ఉచ్ఛారణతో 'మహాత్మాగాంధి' అని గుర్తింపు పొందిన మోహన్‌లాల్ కరంచంద్‌గాంధి ప్రజలకు జ్ఞప్తికిరావటం దుర్లభమవుతుంది. జాతిపితగా మహాత్మాగాంధి బదులు సావర్కార్ పునరుద్ధానం పొందినా, కరెన్సీ మీద గాంధీజీ బొమ్మబదులుగా గాడ్సే బొమ్మవచ్చినా ఆశ్చర్య పడవలసిన రోజులొస్తాయేమో! ఆర్ఎస్ఎస్–బిజెపి 'హిందూ రాష్ట్ర' స్థాపన అంతిమ పర్యవసానం అంత భయంకరంగా ఉండవచ్చు. అందువల్ల దేశ ప్రజలు మోదీ మాయమాటలకు, ప్రలోభాలకు, యోగి పుంగవ వేషాలకు మోసపోకుండా అప్రమత్తం కావాలి, భారత రాజ్యాంగ ''సర్వసత్తాక, సోషలిస్టు, సెక్యులర్ ప్రజాతంత్ర రిపబ్లిక్'' విలువలు, స్ఫూర్తి పరిరక్షణకు నడుం కట్టాలి.

ప్రజాపక్షం
14-12-2025, ఆదివారం

యుపిఎ తొలి ప్రభుత్వ కాలంలో 2005 ఆగస్టు 5న పార్లమెంటు ''జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'' ఆమోదించింది. ఆ చరిత్రాత్మక చట్టానికి 2009లో ఆ పేరుకు ముందు ''మహాత్మాగాంధి'' చేర్చబడింది. మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ''పూజ్యబాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన'' (పథకం)గా మార్పు చేయనుంది. 'హామీ' ఎగిరిపోతుంది. ''చట్టం'' స్థానంలో ''పథకం'' చేర్చితే ఆ పథకానికి చట్టం ప్రతిపత్తి ఉండదు. దీనిపై వివరణ రావాల్సి ఉంది. ఈ మార్పులకు వ్యతిరేకతను బుజ్జగించే చర్యగా కావచ్చు, ఈ పథకం అమలును 100రోజుల నుంచి 125 రోజులకు పెంచుతారట! గత ఐదేళ్లలో దీని అమలు సగటు 50.35రోజులని మంత్రి కమలేశ్ పాశ్వాన్ శుక్రవారం రాజ్యసభకు లిఖితపూర్వక జవాబుగా తెలియజేశారు. ఇతర మెరుగైన ఉపాధి అవకాశం లేనప్పుడే ఈ చట్టం వర్తిస్తుందని చెప్పారు. ఈ చట్టంకింద ఉపాధికి ధనం కేటాయింపును కూడా పెంపు చేస్తారు. అయితే అమలులో ఉన్న చట్టం కింద ఏటేటా పనిదినాల సంఖ్య తగ్గుదల, బడ్జెట్ కేటాయింపు కుదింపు, కనీస వేతనం కన్నా తక్కువ దినకూలీ నిర్ణయం, చెల్లింపుల్లో విపరీత జాప్యం, డిజిటల్ రిజిస్ట్రేషన్ పేరుతో పదుల లక్షలమందిని కవరేజి నుంచి తొలగించటం నడుస్తున్న చరిత్ర. ఈ అతి పెద్ద సామాజిక భద్రతా పథకాన్ని కుదించి నిరుపేద అవసరార్థుల కడుపుకొడితే ప్రభుత్వం ప్రతిఫలం అనుభవించక తప్పదు! గాంధీజీ పేరుతో పాటు ఉపాధి హామీ చట్టం తెచ్చిన ఖ్యాతి యుపిఎ ప్రభుత్వం రికార్డునుంచి చెరిపివేయబడుతుంది.

భారతదేశ అభివృద్ధి చరిత్ర తమ అధికారంతోనే ప్రారంభమైనట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న మోదీ ప్రభుత్వం ఇటువంటి చిల్లర ప్రయత్నాలు చేయటంలో ఆశ్చర్యం లేదు.

# ప్రభుత్వ రంగంలోనే అణు విద్యుత్ ఉండాలి



చలసాని వెంకట రామారావు
9490952093

1962 అణు ఇంధన చట్టం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలు మాత్రమే అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ మేరకు అణు రియాక్టర్ల తయారీ, అణు ఇంధనం, అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, ఉత్పత్తి వంటి అంశాలు అన్నీ ఇప్పటివరకు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా నిర్వహించటం జరుగుతున్నది. కానీ ఇప్పుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబరు 27న హైదరాబాద్‌లో ఒక కార్యక్రమానికి వర్చువల్ గా హాజరై తన ప్రసంగంలో దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేటురంగానికి తలుపులు బార్లా తెరుస్తున్నామని ప్రకటించారు. అందుకుగాను పార్లమెంటు శీతాకాల సమావేశాలలోనే ''అణు ఇంధన చట్టం –2025''ను ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని చెప్పారు. అంతకుముందు 2025–26 వార్షిక బడ్జెట్‌లోనే ప్రైవేటు రంగానికి అవకాశాలు కల్పించాలని భావించి దానిని ఇప్పుడు చట్టబద్ధం చేయనున్నారు. దీనితోపాటు 2010 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్'(సిఎల్ఎన్‌డి)కి కూడా సవరణలు చేయనున్నారు. గత సంవత్సరమే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటురంగ సంస్థలు తమ విద్యుత్ అవసరాల నిమిత్తం 'స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు'(ఎస్ఎంఆర్) ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం దేశం 8.8 గిగావాట్లు అంటే 8,800 మెగావాట్ల అణువిద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిని 2047 నాటికి 100 గిగావాట్ల సామర్థ్యానికి పెంచాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ప్రైవేటు రంగం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తున్నది.

దీనిలో భాగంగా రానున్న ఏడేళ్లలో అంటే 2032 నాటికి 22 గిగావాట్లు అంటే 22,400 మెగావాట్లు సామర్థ్యానికి చేరుకోవాలని, 2070 నాటికి పూర్తి విద్యుత్ ఉత్పత్తి కాలుష్య రహితంగా చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఒక ప్రక్కన ప్రధానమంత్రి ఈ ప్రకటన చేసిన తక్షణమే అదానీ గ్రూపు స్పందించింది. 1.57లక్షల కోట్ల పెట్టుబడితో ఈ రంగంలో ప్రవేశానికి ఆసక్తిని ప్రకటించింది. పిపిపి ఫార్ములా అంటే ప్రభుత్వ,ప్రైవేటు, పార్టనర్‌షిప్ ఫార్ములా అమలు చేస్తే అందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అంటే ఇక్కడ ప్రైవేటు రంగం ప్రవేశం అంటే అదానీ ప్రవేశం అని అర్థం అవుతుంది. ఇప్పటికే 90 వేల కోట్ల రుణానికి కార్యాచరణ ప్రణాళికను కూడా అదానీ కంపెనీ ప్రారంభించింది. అంటే ప్రభుత్వం, అదానీల మధ్య ముందస్తు గూడుపుఠానీ ఫలితంగానే ప్రభుత్వ అణు విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానం దాగి ఉందని అర్థం అవుతుంది.

భారతదేశం 2029 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందనుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలనే లక్ష్యం దిశగా పురోగమించాలంటే పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు తగిన రీతిలో మన విద్యుత్ వనరులు పెంపొందించుకోవాలని అందుకు ప్రైవేటురంగంలో అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం ఆవశ్యకమని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుతం అమలులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి విధానం వలన పలు పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీనినుండి బయట పడేందుకు అణు విద్యుత్ ఉత్పత్తే మార్గమని ప్రభుత్వం భావన. కానీ ఎప్పుడో అణువిద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో ముందు పీఠిన ఉన్న ఫ్రాన్స్, రష్యా, అమెరికా వంటి దేశాలు తమ దేశాలలో అణు విద్యుత్ నుండి బయట పడాలని ఆలోచిస్తుంటే భారత్ మాత్రం అణువిద్యుత్ పైన ఆధార పడాలనే తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న ఫ్రాన్స్ దేశం ఇప్పుడు సగం రియాక్టర్లను మూసివేసింది. వీటి నిర్వహణ వ్యయం పెరిగిపోవటం, శీతలీకరణకు అవసరమైన నీటికొరత, భద్రతా సమస్యలు ఈ మూసివేతకు కారణంగా ఉన్నాయి. దీనితో ఫ్రాన్స్ అణుశక్తిపై ఆధారపడటాన్ని పునరాలోచిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ ఉత్పత్తిదారు అయిన ఫ్రాన్స్ దేశంలోని 56 విద్యుత్ రియాక్టర్లను ప్రభుత్వానికి చెందిన ''ఎలక్ట్రిసిటీ డి ఫ్రాన్స్(ఇ.డి.ఎఫ్)'' మాత్రమే నిర్వహిస్తున్నది. ఐనా ఫ్రాన్స్ దేశంలో అణు విద్యుత్ కర్మాగారాల నిర్మాణం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది.

అమెరికా సైతం విద్యుత్ ప్లాంట్ల నుండి వచ్చే రేడియోధార్మిక వ్యర్థాలను సురక్షితంగా, శాశ్వతంగా నిల్వ చేయటానికి పెద్ద సవాలునే ఎదుర్కొంటున్నది. ప్రస్తుతం ఉన్న ప్లాంట్లను మూసివేయటానికి సైతం ఆర్థిక భారంతో తల్లడిల్లిపోతున్నది. ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన అణు ఇంధనం (యురేనియం) సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. అతి పెద్ద అణు విద్యుత్ ఉత్పత్తిదారు అయినప్పటికి అమెరికా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నది. గత 30 సంవత్సరాలుగా అమెరికాలో కొత్త అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం దాదాపుగా ఆగిపోయింది. ఇక రష్యాలో జరిగిన కొన్ని చారిత్రక ప్రమాదాలు, రాజకీయ ఉద్రిక్తతలు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అణు విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు, అంతర్జాతీయ ఆంక్షలు, నిర్వహణ సమస్యల కారణంగా ఈ రంగం గందరగోళానికి గురవుతున్నది. రష్యా విద్యుత్ ఉత్పత్తిలో 20శాతం వాటా కలిగి ఉన్న అణు రియాక్టర్ల నిర్వహణ ఆ దేశానికి నేడు పెను సవాళ్లు విసురుతున్నది. ఈ కష్టాలు ఇతర అణు విద్యుత్ ఉత్పత్తి దేశాలు సైతం ఎదుర్కొంటున్నాయి.

భారతదేశంలో బొగ్గుద్వారా, జల, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి తరువాత వనరుగా అణు విద్యుత్ ఉంది. 2025 ఏప్రిల్ నాటికి దేశం లో ఎనిమిది అణు విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. 25 రియాక్టర్లు పనిచేస్తున్నాయి. భారతదేశ విద్యుత్ ఉత్పత్తిలో మూడు శాతాన్ని ఇది ఆక్రమించింది. ప్రస్తుతం మరో 11 అణు రియాక్టర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 1969లో మహారాష్ట్రలోని తారాపూర్‌లో, 1972లో రాజస్థాన్‌లోని రావత్ భట్టాలో, 1984లో తమిళనాడులోని కల్పకంలో, 1989లో ఉత్తరప్రదేశ్‌లోని నరోరాలో, 1992లో గుజరాత్‌లోని కాక్రపారాలో, 2000లో కర్ణాటకలోని కైగాలో అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జరిగింది. కానీ 2011 మార్చిలో జపాన్‌లో జరిగిన ఫుకుషిమా అణు విపత్తు తర్వాత మన దేశంలో ఫ్రెంచి సహకారంతో మహారాష్ట్రలో నిర్మించిన 9,900 మెగావాట్ల జైతాపూర్ ప్రాజెక్టు, రష్యా సహకారంతో తమిళనాడులో 2,200 మెగావాట్ల కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి.


పశ్చిమ బెంగాల్‌లోని హరిపూర్ సమీపంలోని 6000 మెగావాట్ల 6 రష్యన్ రియాక్టర్ల విద్యుత్ కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీనిని ఆంధ్రప్రదేశ్‌లోని కావలికి తరలించారు. గుజరాత్‌లోని మితివిర్ధి వద్ద ప్లాంటు నిర్మాణానికి ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయటంతో దానిని శ్రీకాకుళంలోని కొవ్వాడ సముద్రతీరానికి తరలించారు. రష్యాలోని చెర్నోబిల్ అణు ప్రమాదం ప్రపంచానికి ఒక హెచ్చరికలా పనిచేసింది. మన దేశంలో భోపాల్‌లోని ప్రైవేటు విదేశీ కంపెనీ యూనియన్ కార్బైడ్ పెనుప్రమాదం ఎంతటి విధ్వం సం సృష్టించిందో మనం ప్రత్యక్షంగా అనుభవించాం. బాధితులకు దశాబ్దాలుగా సరైన నష్టపరిహారం కూడా సాధించుకోలేకపోయాం. ఇప్పుడు ఏకంగా అణు విద్యుత్ ప్లాంట్లు ప్రైవేటు రంగానికి అప్పగిస్తే ఏం జరగబోతుందో ఆలోచించాలి.

ఒకవేళ అణు విద్యుత్ ప్లాంటులో అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే లక్షలమందికి అత్యవసర పునరావాసం కల్పించాలి. వేల కిలోమీటర్ల ప్రాంతం కలుషితం అవుతుంది. భూమి, ఆకాశం, నీరు, వాతావరణం నాశనమై పోతాయి.

జీవజాతులపై తీవ్ర ప్రమా దం పడుతుంది. దీర్ఘకాలంపాటు అణు ప్రమాదం మన ప్రజలను వెంటాడి వేటాడుతుంది. లక్షలకోట్ల రూపాయల ఖర్చు ఉంటుంది. 2014 నాటికి ప్రపంచంలో సుమారు 100 ప్రమాదాలు జరిగినట్లు అంచనా. ఒక చెర్నోబిల్ ప్రమాదంలోనే 10 లక్షల క్యాన్సర్ మరణాలు సంభవించినట్లు అంచనా వేయబడింది. ఇటువంటి విపత్తులను భారతదేశం వంటి ఆర్థిక వ్యవస్థలు తట్టుకుని మనుగడ సాగించగల వా అనేది శేషప్రశ్న. మన ప్రధానమంత్రి మోదీ చెప్పినట్లు ప్రైవేటురంగానికి అణు విద్యుత్ తయారీ రంగాన్ని అప్పగిస్తే భద్రత కొరవడుతుంది. నియంత్రణ వ్యవస్థ వత్తిడికి, అధికార దర్పానికి గురవుతుంది.

పాలకులు పెద్ద ఎత్తున ప్రైవేటురంగాన్ని ప్రోత్సహిస్తూ నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకపోవటం మనం చూస్తున్నాం. ప్రైవేటురంగం కేవలం లాభాపేక్ష కలిగిన పెట్టుబడిదారుల లాభాలను పెంచటానికి దోహదం చేస్తుంది తప్ప ప్రజాప్రయోజనం తక్కువగా ఉంటుంది. విదేశీ టెక్నాలజీ పేరుతో ఆయా దేశాలలో పాతబడిన నిల్వ ఉంచిన యంత్ర పరికరాలను దిగుమతి చేసుకుని మనం సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.

అందువల్ల భద్రత, ప్రమాద బాధ్యతల రీత్యా ప్రైవేటురంగం గూర్చి లోతుగా ఆలోచించాలి. కఠిన నియంత్రణ, పర్యవేక్షణ ప్రైవేటురంగంలో సాధ్యం కాదు. ప్రభుత్వ నిర్ణయాలను, చివరకు సుప్రీం కోర్టు తీర్పులను సైతం ప్రైవేటురంగం ఎలా ఉల్లంఘిస్తున్నదో మనకు తెలియనిది కాదు. ఈ స్థితిలో కేంద్రప్రభుత్వం ఈ అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వరంగంలోనే అణువిద్యుత్ ఉత్పత్తిని సాగిస్తే దేశానికి మేలు జరుగుతుంది.




# విజన్ మంచిదే... వాటికీ చోటుండాలి!

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కలల నగరం 'ఫ్యూచర్ సిటీ' రెక్కలు విప్పుకునే రీతిలో రెండు రోజుల పాటు జరిగిన 'గ్లోబల్ సమ్మిట్'లో తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించారు. మీర్‌ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9 తేదీలలో వైభవోపేతంగా నిర్వహించిన ఈ శిఖరాగ్ర సదస్సు ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, అవగాహనలు కుదిరాయి. ఆ ప్రాంగణంలో నిర్వహించిన హైదరాబాద్ మహానగరం సహా నాలుగవ నగరంగా పేర్కొంటున్న భవిత నగరి అభివృద్ధి నమూనాను వినూత్నంగా, వైవిధ్యభరితంగా తెలియజేసే సైఫై ఎగ్జిబిషన్ అందరినీ అక్కటుకుంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అనుకుంటున్నారనేది తెలియజేసేందుకు సమ్మిట్ చివరి రోజున 'విజన్ – 2047' దార్శనిక పత్రాన్ని ప్రజల ముందుంచారు ముఖ్యమంత్రి. వచ్చే 22 ఏళ్ళలో ఏ విధంగా అభివృద్ధి చేయాలనుఉంటున్నారో వివరిస్తూ రూపొందించిన మొట్టమొదటి డాక్యుమెంట్ ఇదేనంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వం తమ ఆలోచనలను పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ, ఈ విధంగా ఒక దార్శనిక పత్రం రూపంలో ఒక ప్రభుత్వం తీసుకురావడం ఇదే మొదటి సారి. ఇప్పటి వరకు ఐటి, హైదరాబాద్ నగరాభివృద్ధికి సంబంధించి హైటెక్, మధ్యతరగతి సర్కిల్స్‌లో నలుగుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గత ఐటి శాఖ మంత్రి కె.టి.రామారావుల పేర్లు వినిపిస్తుంటాయి. తాజా విజన్ డాక్యుమెంట్ ద్వారా ఆ వర్గాల చూపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వైపు తిప్పుకోగలిగారు.

2047 నాటికి .3 ట్రిలియన్ డాలర్లు, అంతకుముందు 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను రూపొందించాలని లక్ష్యం అందులో కనబడింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ (జిఎస్‌డిపి–స్థూల రాష్ట్ర ఉత్పత్తి) విలువ 210 బిలియన్ డాలర్లు (రూ.16.12 లక్షల కోట్లు). అంటే దీనిని 14 సార్లు చేయాలనే భారీ లక్ష్యాన్ని ముందుంచుకున్నది ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మూడింతలు పెరుగుదలను చవి చూసింది. తాజాగా వెలువడిన ఆర్‌బిఐ ర్యాంకింగ్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలలో తెలంగాణ జిఎస్‌డిపి పరంగా నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. ఇది ఒక ఆశాజనక పరిణామం. చూసేందుకు భారీగా కనపడుతున్నప్పటికీ అసాధ్యమేమీ కాదని ఆర్‌బిఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. మూడు ట్రిలియన్‌ల డాలర్లు లక్ష్య సాధనకు ప్రధానంగా 80 శాతం ప్రైవేటు పెట్టుబడు లు(అందులో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 40 శాతం)పైనే రాష్ట్ర ప్రభుత్వ ఆధారపడింది.అంటే ప్రైవేటు రంగంపైనే జిఎస్‌డిపి పెరుగుదల ఆధారపడి ఉందనేది సుస్పష్టం.

### సంపద సృష్టి సరే.. సంపద సృష్టికర్తలకు భద్రతేదీ?

సంపదను సృష్టిస్తాం.. సృష్టించిన సంపదను పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రచారం చేసింది. అందుకు అనుగుణంగానే విజన్ డాక్యుమెంట్‌ను కూడా రూపొందించారు. అయితే, సంపద సృష్టికర్తలుగా పారిశ్రామికవేత్తలు, ఐటి, ఎఐ కంపెనీల యాజమాన్యాలు మాత్రమే అని భావిస్తే పొరపాటే అవుతుంది. సంపద సృష్టించడంలో ప్రధాన భాగస్వాములు అందులో పని చేసే ఉద్యోగులు, కార్మికులు. వారి ఉద్యోగ భద్రత, పని ప్రదేశంలో భద్రత, సంక్షేమం, పట్ల రాష్ట్ర ప్రభుత్వం మరింత విస్తారంగా వివరించాల్సి ఉంది. ఎందుకంటే విజన్ డాక్యుమెంట్ విడుదలైన రోజే తెలంగాణ హైకోర్టు సిగాచి ఫ్యాక్టరీలో పేలుడు ఘటనపై విచారణ సందర్భంగా కార్మికుల భద్రతపై తీసుకుంటున్న చర్యల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఘటన జరిగి ఐదు నెలలు దాటినా ఘటనలో మరణించిన కార్మికులందరికీ పరిహారం చెల్లింపు వివరాలు అందించకపోవడం, పేలుడుపై ఫ్యాక్టరీల విభాగం తప్ప మిగతా 10–12 ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడం వంటి కీలక ప్రశ్నలను లేవనెత్తింది. చట్టా లు, మార్గదర్శకాలు అనేకం ఉన్నప్పటికీ వాటిని పాటించకపోవడంతో పాటు, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలనే నిబంధనలు అమలు కాలేదని అభిప్రాయం వ్యక్తం చేసింది హైకోర్టు. బలమైన యాజమాన్యాలు ఉన్నప్పుడు కార్మికులు ఎలా నోరెత్తగలరనే ప్రశ్న వేసింది.

ఇవి గమనంలోకి తీసుకోవాల్సిన అంశాలే. ఇక మరొక అంశం అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షించే పేరుతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న అనేక కార్మిక హక్కులను పలుచబారుస్తూ నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చింది. దీని ద్వారా 8 గంటల పనివిధానం స్థానంలో 10–12 గంటల పని దినం తీసుకువచ్చే సౌలభ్యం కల్పించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఆ మేరకు జిఒలు తీసుకువచ్చాయి. మన రాష్ట్రంలో సైతం. అలాంటి సడలింపునిస్తూ జిఒ 282ను తీసుకురావడంపై కార్మిక సంఘాలు ఇప్పటికే తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల స్వయంగా పార్లమెంటు వెలుపల నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా, వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు నిరసన తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పని గంటల పెంపు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు వైట్ కాలర్‌గా ఉద్యోగులుగా చెప్పుకునే ఐటి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఏమంత బాగోలేదు. ఇన్ఫోసిస్, టిసిఎస్ లాంటి బడా కంపెనీలే ఆ ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. ఇన్ఫోసిస్ నారాయణమూర్తితో పాటు మరి కొందరు వ్యాపార దిగ్గజాలు, ఐటి ఉద్యోగులు రోజుకు 12గంటలు వారానికి ఆరు రోజులు పనిచేయాలని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోంలో ఉన్నప్పటికీ ఐటి ఉద్యోగు లు రోజుకు 10, 12గంటలు పనిచేయడం సర్వ సాధారణం గా మారిపోవటం అందరం గమనిస్తూనే ఉన్నాం.

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

### సామాజిక అంశాలు

పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో అనేక సామాజిక అంశాలు సైతం తెరపైకి వస్తున్నాయి. పెరిగే ఆర్థిక అంతరాలకు తోడు, నిత్యావసరాల ధరలు, ఇళ్ల అద్దెలు, ఉద్యోగ భద్రత, అధిక విద్య, వైద్య ఖర్చులు అధికమవుతుండడం తదితరాలు అలాంటివే. అలాగే రియల్ ఎస్టేట్ ధరలు విపరీతంగా పెరిగి సొంత ఇళ్ళు కొనుక్కోలేని పరిస్థితి. ఇవి మామూలు సమస్యలు అనిపించినప్పటికీ పెరిగే ఆర్థిక వ్యవస్థతో పాటు మరింత తీవ్రమవుతాయని ప్రపంచ దేశా ల అనుభవాలు నిరూపిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా చెప్పుకునే ధనిక నగరం న్యూయార్క్‌లో ఇటీవల మేయర్ ఎన్నికల్లో ఇవే ప్రధాన అంశాలుగా మారాయి. విద్య, వైద్యానికి సంబంధించి ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేస్తామని విజన్ డాక్యుమెంట్లో పేర్కొన్నారు . అలాగే త్వరలో అందుబాటు ధరలో ఇళ్ళ విధానాన్ని కూడా ప్రకటిస్తామని ప్రభుత్వం తెలియజేసింది. అనేక అభివృద్ధి చెందిన దేశాలలో యువత పెరుగుతున్న ఖర్చులకు జడిసి పిల్లలను కనకపోవడం, లేదా పెళ్ళి చేసుకోకపోవడం కనిపిస్తుంది. ఇది జనా భా తరుగుదలకు కారణమవుతోంది. ఒకవైపు భావి తరం తగ్గిపోవడం, వృద్ధ జనాభా పెరిగిపోతుండడం అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమస్యగా మారింది. సాంకేతి పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు పెరుగుదలతో ఉద్యోగాల కోత, వేతనాల తగ్గింపు సర్వసాధారణమవుయని ఆందోళనలు నెలకొన్నా యి. ఉద్యోగాలకు పోటీ పెరిగితే కనీస వేతనాలు కూడా అమలు కాకపోయే ప్రమాదం లేకపోలేదు. వాటిని విజన్–2047లో పరిగణనలోకి తీసుకోవాలి.

### స్కాండినేవియన్ తరహా పెన్షన్ భేష్..

వృద్ధులకు స్కాండినేవియన్ తరహా పెన్షన్ విధాన ం తెలంగాణలో అమలు చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని విజన్ డాక్యుమెంట్లో పేర్కొనడం ఆహ్వానించదగింది. యూరప్‌లోని డెన్మార్క్, నార్వే, స్వీడన్ దేశాలను స్కాండినేవియా దేశాలుగా పిలుస్తారు. అక్కడ సంక్షేమ పథకాలు అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. అందరికీ మెరుగైన సార్వత్రిక వైద్య, విద్య సౌకర్యాలు కల్పిస్తారు. అలాగే అత్యుత్తమ పెన్షన్ విధానం ఉంటుంది. ఫలితంగా అక్కడి పౌరులు సంపూర్ణ భద్రతను ఆస్వాదిస్తారు. దీంతో అత్యంత ఆనంద దేశాల జాబితాలో స్కాండినేవియా దేశాలు ముందుంటాయి. అలాగే ప్రపంచం లో సంపద పెరుగుదలతోపాటు ఆదాయ అంతరాలు తక్కువున్న దేశాలు ఆ మూడే.

దీని వెనుక కారణం అక్కడ విద్యా, వైద్య రంగాలలో ప్రభుత్వరంగం పటిష్ఠంగా ఉండడంతో పాటు, ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వేతనాలు, వసతులు లభిస్తాయి. ఆ దేశాలలో యాజమాన్యాలు, కార్మిక సంఘాలు అత్యంత సుహృద్భావ వాతావరణంలో చర్చించుకొంటారు. యాజమాన్యాలు సైతం ఉదారంగా వేతనాలు ఇస్తుంటారు. దీంతో అక్కడ సంతృప్తి స్థాయి ఎక్కువగా ఉండడంతో పాటు ప్రజలు కష్టపడి పనిచేస్తుంటారు. అంతకుమించి పన్నులను ఇతర దేశాలకంటే అక్కడే ఎక్కువ కడుతుంటారు. స్కాండినేవియన్ పెన్షన్ అమలులతో పాటు అక్కడ యాజమాన్య, ఉద్యోగ, ప్రభుత్వ సంబంధాలలో మంచి విధానాలు తీసుకుంటే మంచిది. మొత్తానికి విజన్ డాక్యుమెంట్ సమగ్రతతో పాటు, దూరదృష్టి కలిగి ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో దానిపై విశ్వాసాన్ని రేకెత్తించగలిగింది. దాని ఆచరణకు బాటలు వేయాల్సిన బృహత్తర బాధ్యతపై ప్రభుత్వంపై ఉంది.

## నేడు మెగా వైద్యశిబిరం

**ప్రజాపక్షం/ సరూర్‌నగర్:** ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీలో ఈ నెల 14 తేదిన నిర్వహించే ఉచిత వైద్యశిభిరాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ సంఘ సేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి ఉపేందర్‌రెడ్డి మెగా వైద్య శిభిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దిల్‌షుఖ్‌నగర్ అగర్వాల్ శాఖ సమన్వయంతో ఎల్‌సిహెచ్ సాధురాం హాస్పిటల్, శ్రీ భగవాన్ మహావీర్ విక్లాంగ్ సహాయ సమితి సహకారంతో నిర్వహించే మెగా వైద్య శిభిరాన్ని ప్రజలు అందరూసద్వినియోగం చేసుకోని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్ గోయల్,సంజయ్‌కుమార్‌గుప్తా, హరికిషన్ అగర్వాల్, కృష్ణారెడ్డి, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి

### జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆర్యవైశ్యులు వ్యాపార రంగాల్లోనే కాకుండా రాజకీయాల్లో సైతం రాణించేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఎలుకుర్తి గీతా వీరేశం, కొత్తూరు మండలం గూడూరు గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ దయానంద్ గుప్తాను షాద్‌నగర్ పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ గుప్తా మాట్లాడుతూ వ్యాపార రంగాలతోపాటు రాజకీయాల్లో ఆర్యవైశ్యులు రాణిస్తుండటం ఎంతో అభినంధనీయమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకొని రాజకీయాల్లో రాణించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బంగారు బాటలు వేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఆర్య వైశ్యులపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకునేందుకు సర్వశక్తులా కృషి చేయాలని పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై ఆ మూడు పార్టీలది వంచన

### టి.చిరంజీవులు, బాల్‌రాజుగౌడ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు మాటల్లో మద్దతు పలికి, చేతల్లో నయవంచనకు పాల్పడ్డాయని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్.దుర్గయ్య గౌడ్ అధ్యక్షత జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల విషయాన్ని పక్కదారి పట్టించడానికే గ్లోబల్ రైజింగ్ సమ్మిట్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఆయన రాహుల్‌గాంధీకి డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల మాదిరిగా కేంద్రం బిసి రిజర్వేషన్ల ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పంచాయతీ మొదటి విడతలో ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిలు అత్యధికంగా గెలిచి, సత్తా చాటారని, ఇదే ధోరణిని రెండు, మూడు విడతల్లో కూడా కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల కోసం యువత ఆత్మహత్యలు చేసుకొంటున్న సిఎం రేవంత్రెడ్డికి సాధించే వరకు ఉద్యమం ఆపబోమన్నారు. సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణ గౌడ్, యెల్లికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, అవ్వారు వేణుకుమార్, చామకూరి రాజు, కెవి.గౌడ్, బైరు శేఖర్ దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రాజకీయాల్లోకి ఐయుఎంఎల్

### పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షకీల్ వెల్లడి




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణలో న్యాయం, సాధికారితతో కూడిన కొత్త శకానికి నాంది పలుకుతూ నేటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లోకి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) అధికారికంగా అడుగుపెడుతున్నట్టు లీగ్ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది మహమ్మద్ షకీల్ తెలిపారు. దేశ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న రానున్న రోజుల్లో తెలంగాణలో సత్తా చాటుతామనిపేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లీగ్ ముఖ్యనేతలతో కలిసి ఆయన మాట్లాడారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఐయుఎంఎల్ సేవారంగంలో, రాజకీయంలో ముందున్నదన్నారు. రాష్ట్రంలోని స్థానిక, జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో ఐయుఎంఎల్ పోటీ చేస్తామన్నారు. మైనార్టీలు, దళితులు, బిసిల అభివృద్ధికి లీగ్ పోరాడుతుందన్నారు. సమావేశంలో ఐయుఎంఎల్ నేతలు షాహీద బేగం, అస్ఫియా, అహ్మద్ అల్ కసేరి,షేక్‌చాంద్ పాషా,సయ్యద్ ఫయాజ్ హష్మి, ఫజల్, షేక్ బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల శంకర్‌రెడ్డి వర్ధంతి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్టు:** సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి తండ్రి ముత్యాల శంకర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించిన నాయకులు అయన సేవలను మరోసారి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ పార్టీ నాయకులు పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్ రెడ్డి, అజ్మీర హరి సింగ్ నాయక్, కేతరాజు నర్సింహా వేశాల నరసింహ, నారాయణరెడ్డి, డవుల రాములు, మంగళపల్లి రవి, సైదులు ముదిరాజ్, కాసిం, గణేష్ నాయక్, అరుణ, నవనీత, దేవమ్మ, క్రాంతి, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ బాధ్యులను సస్పెండ్ చేయాలి : రామకృష్ణ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్‌లోని చంద్రనాయక్ తాండ ప్రభుత్వ పాఠశాలలో పోషక పదార్థలతో కూడిన ఆహారం ఇచ్చి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడవలసినది పోయి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 44 మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటడం ఏంతవరకు సమంజసమని, విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ బాధ్యులపై ఎలా ంటి చర్యలు తీసుకోకపోవడం తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటుని సిపిఐ తెలంగాణ రాష్ట్రసమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి టి. రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చికిత్స పోందుతున్న విద్యార్థులను సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేళ్ళి వారిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షయపాత్ర వాళ్ళు మంచి ఆహారాన్ని సప్లై చేస్తున్నారా, లేక అక్కడనే తయారు చేస్తున్నారా.. సమగ్ర విచారణ జరిపి బాధ్యులు ఎంతటి వారైనా వెంటనే తగిన చర్యలు తీసుకొని ఫుడ్ పాయిజన్ బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ చంద్రనాయక్ తాండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ ఉపాధ్యక్షులు తుపాకుల రాములు, నారయణ, శేరిలింగంపల్లి సిపిఐ కార్యవర్గ సభ్యులు డిహెచ్‌పిఎస్ మండల కార్యదర్శి కొండలయ్య పాల్గొన్నారు.

## నేడు మెగా వైద్యశిబిరం

**ప్రజాపక్షం/ సరూర్‌నగర్:** ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీలో ఈ నెల 14 తేదిన నిర్వహించే ఉచిత వైద్యశిభిరాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ సంఘ సేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి ఉపేందర్‌రెడ్డి మెగా వైద్య శిభిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దిల్‌షుఖ్‌నగర్ అగర్వాల్ శాఖ సమన్వయంతో ఎల్‌సిహెచ్ సాధురాం హాస్పిటల్, శ్రీ భగవాన్ మహావీర్ విక్లాంగ్ సహాయ సమితి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.









హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో శనివారం లియోనెల్ మెస్సీతో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్..గోల్‌కొట్టిన సిఎం రేవంత్‌రెడ్డి.. మ్యాచ్‌ను రాహుల్‌గాంధీ తిలకించారు.

## ఊరికి సేవ చేసే భాగ్యం ఇవ్వండి

### ఎర్రవల్లి గౌరీ శంకరాచారి

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్టు:** ఊరికి సేవ చేసే భాగ్యం మాకు కలిపించండి అని బట్టసింగారం బిఆర్‌ఎస్ సర్పంచ్ అభ్యర్థి గౌరీ శంకరాచారి అన్నారు. ఆయనకు మద్దతుగా రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షులు, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిరావహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలే బిఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తాయి అని అన్నారు. కళ్ళబోల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన రెండు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. యువతకు ఉద్యోగ అవకాశలు కల్పిస్తాం అని, మాయమాటలు చెప్తూ పబ్బం గడుపుతున్నారని ఇద్దెవచేసారు.బట్టసింగారం సర్పంచ్ అభ్యర్థి ఎర్రవల్లి గౌరీ శెంకరాచారి ఉంగరం గుర్తుపై ఓటు వేసి ఆర్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల జగదీష్, మాజీ ఎంపీపీ బబ్బూరు మంజూల దేవేందర్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 28న 'ఎల్.బి.నగర్ రన్నర్స్' మారథాన్-2025

### నాగోల్ సిఐ మక్బుల్ జానీకి ఆహ్వానం




**ప్రజాపక్షం / ఎల్.బి.నగర్ :** ఈ నెల 28న నిర్వహించనున్న కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్2025 కార్యక్రమానికి 'ఎల్.బి.నగర్ రన్నర్స్' ఆర్గనైజర్ వరుణ్ నాగోల్ సిఐ మక్బుల్ జానీని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. కామినేని హాస్పిటల్స్ ఈ మారథాన్‌కు టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. మారథాన్ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని వరుణ్ సిఐ కి వివరించారు. హాఫ్ మారథాన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడం, ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడం ముఖ్య లక్ష్యమని తెలియజేశారు. మారథాన్ నిర్వహణకు పోలీస్ శాఖ తరపున తగిన బందోబస్త్ సహకారం అందేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన సిఐ మక్బుల్ జానీ 'ఎల్.బి.నగర్ రన్నర్స్' నిర్వహకులైన డైరెక్టర్ సుందర్ నాగేష్, ఆర్గనైజర్ వరుణ్ కృషిని అభినందించారు. ఈ సందర్భంగా నాగేష్, అరుణ్ విలేకరులతో మాట్లాడుతూ కామినేన్ ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్2025 కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రన్నర్లు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## దేవునిబండ తండాపై ఎమ్మెల్యే వరాల జల్లు

### సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్‌ను అభినందించిన వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భారత కమ్యూనిస్టు పార్టీ నుండి గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న సిపిఐ నేత శ్రీనునాయక్ సర్పంచ్‌గా విజయం సాధించారు. శనివారం షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌ను సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దాంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాలువాలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సైతం సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్‌ను అభినంధించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఫరూక్‌నగర్ మండలం దేవునిబండ తండా సర్పంచ్‌గా సిపిఐ నేత శ్రీనునాయక్ పోటీ చేసి సమీప ప్రత్యర్థిపై 135ఓట్లతో విజయం సాధించడం ఎంతో అభినంధనీయమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుండి సర్పంచ్‌గా విజయం సాధించడం గొప్ప విషయమని, దేవునిబండా తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని, సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. దేవునిబండ తండాలో పంచాయతీలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతోపాటు మూడు సిసి రోడ్లు, ఒక మహిళా డ్వాక్రా భవనాన్ని తక్షణమే మంజూరు చేసి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ డివిజన్‌లోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల నుండి నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ ఉప సర్పంచులతోపాటు వార్డు సభ్యులను సన్మానించారు.

## కాంగ్రెస్ కార్యకర్తల కృషి అభినందనీయం

### కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తల కృషి ఎంతో అభినంధనీయమని, ప్రతి ఒక్కరు సమిష్టిగా పని చేయడంతోనే సర్పంచ్‌గా విజయం సాధించామని కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డిలు తెలిపారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పాపిరెడ్డిగూడ గ్రామ నూతన సర్పంచ్ శశిరేఖ యాదయ్యను శాలువాలతో సత్కరించారు. మాజీ జడ్పిటిసి సహకారంతోనే గ్రామ సర్పంచ్‌గా శశిరేఖ యాదయ్యలు విజయం సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. సమిష్టి కృషితోనే ఏదైనా సాధించవచ్చు అనేది నిరూపించారని అన్నారు. మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ తన సొంత గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో నిలిపిన సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడం జరిగిందని వివరించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం హామీలు ఇచ్చారని తెలిపారు. వార్డు సభ్యులతోపాటు గ్రామస్తులను అభినంధించారు.

## బిఆర్‌ఎస్ కార్యకర్తల్లో పెరిగిన ఆత్మస్థైర్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** వీర్లపల్లి సర్పంచ్ గెలుపుతోనే బిఆర్‌ఎస్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెరిగిందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో మామిడిపల్లి గ్రామ సర్పంచ్ మొత్కురి హన్మంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మామిళ్ళపల్లి రాజు, కమ్మదనం సర్పంచ్ లత కిరణ్‌గౌడ్, వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండులను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామంలో బిఆర్‌ఎస్ సర్పంచ్ చిందం పాండు విజయం సాధించడంతో నియోజకవర్గంలోనే బిఆర్‌ఎస్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెరిగిపోయిందని వివరించారు. ప్రజలఅభిమానాన్ని ఎప్పు డు మరచిపోరాదని, వార్డుల వారిగా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. వీర్లపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, కమ్మదనం మాజీ సర్పంచ్ నర్సింలు, మామిడిపల్లి మాజీ ఉప సర్పంచ్ ఉడుత సత్యానారాయణతోపాటు బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

## ఎస్‌పి బాలు విగ్రహాన్ని పెడితే కూల్చేస్తాం

### తెలంగాణ ఉద్యమకారుల జెఏసి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దివంగత ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని రవీంద్రభారతిలో ప్రతిష్ఠించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి గౌరవాధ్యక్షులు ప్రఫుల్ రాంరెడ్డి, అధ్యక్షులు సుల్తాన యాదగిరి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాలసుబ్రహ్మణ్యాన్ని విగ్రహాన్ని కూల్చేస్తామని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పక్కన పెట్టి, ఆంధ్రోళ్ల విగ్రహాలపై సోయి పెట్టడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. రూ.100 కోట్లు పెట్టి మెస్సీ ఫుట్‌బాల్ నిర్వహించొచ్చు కావని, సొంత తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పట్టవా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థలం ఇవ్వాలని, పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. జెఏసి ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నేతలు అనిల్‌కుమార్, జానకి రెడ్డి, యాదగిరి, మోహన్‌బైరాగి, సూర్యకళ, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


## గ్రామాలను అభివృద్ధి చేస్తాం..



**ప్రజాపక్షం/కొందుర్గు:**గ్రామాలను అభివృద్ధి చేయడంతోపాటు ప్రజా ప్రతినిధులకు అండగా ఉంటామని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ చెన్న కేశవులుతోపాటు వార్డు సభ్యులను, కొందుర్గు మండల పరిధిలోని పులుసు మామిడి గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ అమర్నాథ్‌రెడ్డితోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. పల్లె సీమలు అభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. దేశానికి పట్టు కొమ్మలు గ్రామాలు ఎలా అవుతాయో అదే తరహాలో రాష్ట్రానికి పల్లెసీమలు అంతే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏ సమస్య నెలకొన్న పరిష్కరించేందుకు తాము ముందుంటామని వివరించారు. మాజీ సర్పంచ్ జాంగీర్ బాబా, రమేష్ గౌడ్‌తోపాటు వార్డు సభ్యులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## పల్లె సీమలను ప్రగతి సీమలుగా మారుస్తాం

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చాలన్నదే లక్ష్యంగా తాము పని చేస్తామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి వివరించారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని రేగడి చిల్కమర్రి, ఉత్తరాస్‌రెడ్డి, కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ, పోమాల్‌పల్లి గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులను, ఉప సర్పంచులను, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకొకుండా ఉన్న గ్రామాల్లో ప్రగతి పరుగులు పెట్టించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ధైర్యంగా ఉండండి..అభివృద్ధి చేసేందుకు తాను సిద్దంగా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్సీ నిధుల నుండి గ్రామ పంచాయతీల వారిగా ఇవ్వడంతోపాటు అభివృద్ధి చేసే బాధ్యత నాదే అన్న విషయాన్ని ప్రజలందరికి వివరించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేగడి చిల్కమర్రి సర్పంచ్ ఎనబోతుల శ్వేతాశివరెడ్డి, ఉప సర్పంచ్ నందులాల్, ఉత్తరాస్‌పల్లి సర్పంచ్ పురె గీత నందు, ఉప సర్పంచ్ ఎండి అలీం, ఇన్ముల్‌నర్వ సర్పంచ్ లలిత గోపాల్‌నాయక్, పోమాల్‌పల్లి సర్పంచ్ బుర్రి స్వప్నరెడ్డి, ఉప సర్పంచ్ బుర్రి భూపాల్‌రెడ్డిలతోపాటు వార్డు సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు

### ఎంపిడిఓ అపర్ణ



**ప్రజాపక్షం/షాబాద్:** ఎన్నిల కమిషన్ ఆధేశాలను పక్డబంధీగా అమలు చేయాలని ఎంపిడివొ అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఎంఎస్ గార్డెన్‌లో రెండవ సాధరణ ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ గ్రామాలకు ఓటర్ బ్యాలెట్ బాక్స్‌లు ఎన్నికల సంబందిత అధికారులకు అందజేశారు. అనంతరం చేవేళ్ల ఆర్డీవొ చంద్రకళ, తహశీల్దార్ అన్వర్ ఎన్నికల సిబ్బందికి డ్యూటీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాబాద్ మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయతీలకు గాను 3జోన్లు,11 క్లస్టర్‌లు, 11 రూట్స్ ఎర్పాటు చేసి ఆయా గ్రామాలకు గాను 347 మందిని ప్రత్యేక అధికారులు, 357 మంది పోలింగ్ నిర్వహించేందుకు సిబ్బందిని ఎర్పాటు చేసిన్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులకు ఆయా గ్రామాలకు సంబందించిన ఓటర్ బ్యాలెట్ బాక్స్‌లను తీసుకోని గ్రామాలకు తరలి వెళ్లేందుకు తగిన ఎర్పాల్లు చేసి అధికారులను పంపించారు. ఉదయం నుండి మద్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్, అనంతరం సాయంత్రం వరకు ఓటింగ్ లెక్కింపూ చేసి గెలుపు ధృవికరణ పత్రాలు అందజేస్తామని వివరించారు. ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం చేయకుండ విధులు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎక్కడైన ఎమైన సమస్యలు ఉంటే క్లస్టర్ అధికారులకు చెప్పాలన్నారు.

## వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్ సాయినగర్ కళ్యాణ మండపంలో అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం జరిగిన 18వ అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణంతో అభిషేకాలు, పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, స్థానిక కార్పొరేటర్ సునీత రాము యాదవ్, బద్దం పరశురాంరెడ్డి, బిఆర్ఎస్ నేతలు రాము యాదవ్, నర్సింగ్‌రావు, కిట్టు, నాగేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్‌క్లబ్ ఆధ్వర్యాన కార్మికులకు క్యాప్‌ల పంపిణీ



**ప్రజాపక్షం/తాండూరుః**తాండూరు మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ తాండూరు లైన్స్ క్లబ్ ఆధ్వర్యాన 90మంది కార్మికులకు క్యాప్‌లను పంపిణీ చేశారు. కార్మికులకు ఆరోగ్య సమస్యలు రాకుండా శనివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యాన క్యాప్‌లను అందజేశారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యాన పేద విద్యార్థులకు సహాయంతో పాటు, ఉచిత కంటి ఆపరేషన్‌లు చేపడుతున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షులు శరణు బసవప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, లైన్స్‌క్లబ్ ప్రతినిధులు గౌరి శంకర్, ఓంప్రకాష్, సోమాని, బసవప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, జవాన్లు, కార్మికులు ఉన్నారు.



## ఖరీదైన చికిత్సలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలు ఖరీదైన వైద్యం పొందేందుకు ఓ వరం లాంటిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ వాణినగర్ ప్రాంతానికి చెందిన గరిమెళ్ల రామకృష్ణ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుండటంతో సిఎం రిలీఫ్ ఫండ్ కింద దరఖాస్తు చేసుకోగా మంజూరైన లక్ష రూపాయల పత్రాలను శనివారం ఆయన అందించారు. అవసరమైన వారు సిఎం రిలీఫ్ ఫండ్ కోసం వైద్యుల ధృవీకరణ పత్రాలతో తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మేకల రాము యాదవ్, పూలపల్లి సుందర్ యాదవ్, హేమంత్‌పటేల్, సాయి గౌడ్, జనార్ధన గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి విలువలను చేరవేయటంలో వేదాంత ప్రవచనాలు దోహదం

**తెలుగు సాహిత్య విలువలు ప్రజలకు చేరవేయటంలో వేదాంత ప్రవచనాలు ప్రముఖ పాత్ర**

గౌతంనగర్ దివిజన్‌లోనిశ్రీలక్ష్మి సాయి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన ఘంటసాలవారి పాట చాగంటి వారి మాట కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల భక్తి గీతాల మహత్మ్యాన్ని స్మరించుతూ భక్తి సాహిత్య స్రవంతులు సమాజాన్ని సానుకూల దిశగా నడిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, జెఎసి వెంకన్న, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## అన్ని ప్రాంతాల రుచుల సమ్మేళనమే సంప్రీతి

**ప్రజాపక్షం/చర్లపల్లిః** ఆంధ్ర,తెలంగాణ,రాయలసీమ రుచుల సమ్మేళనమే సంప్రీతి తెలుగు కిచెన్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎఎస్ రావునగర్‌లోని రాధిక థియేటర్ సమీపంలో సంప్రీతి హోటల్‌ను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డితో ఆయన ప్రారంభించారు. తెలుగు సంప్రదాయ వంటకాల ఘనతను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో వ్యాపారవేత్త మౌనిక సింగం సంప్రీతి తెలుగు కిచెన్‌ను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావనీరెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల ముడి పదార్థాలు సరఫరా : ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మాదక ద్రవ్యాల తయారీకి వినియోగించే పాపీ స్ట్రా అనే ముడి పదార్థాలు సరఫరా చేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులను నాచారం పోలీసులు అరెస్టు చేసా రు. వారి నుండి 14.7 కిలోల పాపీ స్ట్రా, ఒక బైకు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి 8 గంట ల సమయంలో నాచారం హెచ్‌సి సుదర్శన్, కానిస్టేబుల్ శ్రీనివాసచారిలు చిలుకానగర్ రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో చెంగిచెర్ల ప్రాంతంలో నివసించే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రమేష్‌కుమార్, సురేష్ కుమార్‌లు బైకుపై వెళుతూ తప్పించుకొని పరారవుతుండగా వారిని అదుపులోకి తీసుకొన్నారు. తమ రాష్ట్రంలోని మంగల్‌రాం నుండి తక్కువ ధరకు తీసుకొని వచ్చిన పాపీ స్ట్రా నగరంలో విక్రయించి తదుపరి విచారణలో నిందితులు ఒప్పుకొన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.



## ప్రముఖ పారిశ్రామివేత్త మన్నెకు నివాళులు

**ప్రజాపక్షం/చర్లపల్లిః** ప్రముఖ పారిశ్రామివేత్త,టిడిపి నాయకులు మన్నె సుబ్రహ్మణ్యం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బోగారం ఎంపర్ ఇండస్ట్రీస్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు టిజికె మూర్తి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రుద్రగోని రాంచందర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి, కొండ జంగారెడ్డి, సాంబమూర్తిగౌడ్, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు

## రెండవ విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ః** రెండవ విడుత గ్రామ పంచాయతీ ఎన్నికలు 7 మండలాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ఓటింగ్ ఉదయం 7గంటల నుండి 1గంటలకు వరకు నిర్వహించడం జరుగుతుంది. ఓటును స్వచ్ఛందగా వినిమోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం వ్యవస్థలో ఓటర్లు తమ ఓటును దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకుంటేనే నిజమైన ప్రజాస్వామ్యం నిలుస్తుందని ,గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఓటు దుర్వినియోగం కాకుండా సరైన వ్యక్తిని ఎన్నుకోవాలని తెలిపారు. ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును వినియోగించుకోవాలని తెలిపారు.

# భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ఐపిఈలో విద్యార్థులు పట్టాలు ప్రదానం చేసిన గవర్నర్ జిష్ణుదేవవర్మ




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భవిష్యత్తులో యువ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకు ని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ అన్నారు. శనివారం శామీర్‌పేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపిఈ) కళాశాలలో 2025 విద్యా సంవత్సరానికి గాను స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు పట్టాలను ప్రదానం చేశారు. మొత్తం 530 మంది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు వినియోగించుకుని అట్టడుగున ఉన్న ప్రజలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. రత్నప్రభ లీడర్‌షిప్ అవార్డులను ప్రస్తావిస్తూ మహిళల సాధికారత ప్రాముఖ్యతను వివరించారు. ఎదుటి వారి సంతోషంలో మనం సంతోషాన్ని చూసుకోవాలని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఈ (బిఓజి) ప్రసిడెంట్ మాధవరావు, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి, ఐపిఈ బోర్డు సభ్యులు ప్రసాదరావు, ఆలీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# షాహి ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్స్... మహిళా కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఉపాధ్యక్షురాలు ఛాయాదేవి డిమాండ్




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** నాచారంలోని షాహి ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్స్ యజమాన్యం కార్మిక చట్టాలను తుంగలోతొక్కి మహిళా కార్మికుల హక్కులను కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య ధ్వజమెత్తింది. ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్ కంపెనీలో పనిచేస్తున్న మహిళా కార్మికులు గత ఆరు రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. స్వచ్ఛందంగా వేతనాలు పెంచాలని, మహిళలపై అవమానకరమైన హింసను అరికట్టాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, మహిళల సమస్యలను పరిగణనలోనికి తీసుకుని వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, వసతులు సెలవులు ఏర్పాటు చేయాలని కోరుతూ మహిళా కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో షాహి ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్స్ మహిళా కార్మికులకు మద్దతుగా సిపిఐ మేడ్చల్ జిల్లా నాచారం మండల కార్యదర్శి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిరసన, ధర్నా చేపట్టారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఛాయాదేవి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మి సమ్మె శనివారం శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. మహిళా సమాఖ్య నాయకురాళ్లు నేదునూరి జ్యోతి, ఛాయాదేవి ఉపన్యసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, లేబర్ కమిషనర్ జోక్యం చేసుకొని మహిళా కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుమారు 3,000 మంది కార్మికులు 10 ఏళ్లుగా కనీస వేతనాలు లేకుండా కట్టు బానిసలుగా శ్రమ దోపిడికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎనిమిది గంటల పని దినాన్ని, కనీస వేతనాల్ని తక్షణమే అమలు చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు అనేక మంది వచ్చి సంఘీభావం ప్రకటిస్తూ కార్మికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడం సంఘీభావ ఉద్యమాలకు నిదర్శనం అన్నారు. కంపెనీ యాజమాన్యాలు కార్మిక శ్రమ శక్తిని వాడుకొని, విసిరివేసే విధానాల్ని విడనాడాలని నేదునూరి జ్యోతి, ఛాయాదేవి హెచ్చరించారు. దినదినం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి జీవన వ్యయం పెరగడం మూలంగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్న మహిళా కార్మికుల్ని రాష్ట్ర ప్రభుత్వం, గార్మెంట్ యాజమాన్యం తక్షణమే ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు సంఘటితమై సమ్మె కొనసాగిస్తున్న గార్మెంట్స్ మహిళా కార్మికులకు మద్దతుగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వందలాది మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి ప్లాట్ కబ్జాకు పాల్పడుతున్నారు

మీడియాను ఆశ్రయించిన బాధితుడు అనిల్‌కుమార్..

న్యాయం చేయాలని సిపికి ఫిర్యాదు




**ప్రజాపక్షం/శామీర్‌పేటః** తూంకుంట మున్సిపల్‌లో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారని నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి మా ప్లాట్‌ను కబ్జా చేయడానికి కుట్రలు పన్నుతున్నారని బాధితుడు మెందు అనిల్‌కుమార్ ఆరోపించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధితుడు తమ గోడును వెల్లబోసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన మెందు అనిల్‌కుమార్ తూంకుంట మున్సిపాలిటి రెడ్డి కాలనీలో సర్వే నెంబర్ 286, 332లో గూడురు నాగిరెడ్డికి చెందిన స్థలంలో సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి 2018లో ఎజిపిఎ చేసుకుని లే అవుట్ చేశారు. ఈ లేఅవుట్‌లో 133 గజాలు ప్లాట్ ను కొనుగోలు చేసిన అనిల్‌కుమార్ 2019లో ఆ స్థలంలో ఓ గదిని నిర్మించుకోగా పరిశీలించిన అధికారులు ఇంటి నెంబర్ 569/ 133/1ఇచ్చారని అప్పటినుంచి ఆ ఇంటి కరెంట్, ఇంటి పన్నులు చెల్లిస్తున్నానని అన్నారు. నేను ఉద్యోగరీత్యా స్థానికంగా తూం కుంటలో ఉండకపోవడంతో కొందరు వ్యక్తులు ఫోర్జరీ డాక్యుమెంట్ (నోటరి) సృష్టించి గత రెండు, మూడు నెలలుగా తన ప్లాట్‌ను అక్రమంగా కబ్జా చేశారని ఆరోపించారు. మాజీ కార్యదర్శి పలుమార్లు ఫోన్‌లో 2022 నుంచి ఆ ఇల్లు మా పేరుపై ఉందని నువ్వు ఎట్లా వస్తావ్ అని బెదిరిస్తున్నాడని అనిల్‌కుమార్ ఆరోపించారు. దీంతో స్థానికంగా ఉన్న ఎద్దు నాగేష్‌ను సంప్రదించి ఆయనతో కలిసి మీడియాను ఆశ్రయించానని నాకు న్యాయం చేయాలని కోరారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే మాపైన కేసు నమోదు చేశారని, ఇక్కడ న్యాయం జరుగకపోవడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని వెల్లడించారు.


**నాపై ఆరోపణలు సరైనవి కావు : మాజి సర్పంచ్ ఎద్దు నాగేష్**

తూంకుంట మున్సిపల్‌లో భూ కబ్జాలకు, అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన అభియోగాలు సరికావని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తనను అణగదొక్కడానికి కొందరు వ్యక్తులు ఆడుతున్న డ్రామా అని చెప్పారు. నేను ఉన్నతమైన పదవుల్లో ప్రజలకు సేవ చేశానని ఏనాడు అక్రమాలకు పాల్పడలేదని ఆయన మీడియాకు వివరించారు.

## అడ్డగోలుగా డివిజన్లు విభజన... గందరగోళంలో స్థానికులు, నాయకులు..

**ప్రజాపక్షం/చర్లపల్లి :** జిహెచ్‌ఎంసి పుర్విభజన పూర్తిగా అశాస్త్రీయంగా ఉందంటూ ప్రజలు, నాయకులు నుండి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌ను విభజిస్తు మరొక డివిజన్ చక్రీపురంను ఏర్పాటు చేశారు. డివిజన్‌లో కలిపిన బిఎన్‌రెడ్డి నగర్ కాలనీ, మహాలక్ష్మి నగర్ కాలనీ చర్లపల్లికి ఆనుకుని ఉన్న కాలనీలు చర్లపల్లి రెవెన్యూలోకి వస్తాయని, ఈ కాలనీలు చర్లపల్లి డివిజన్‌లోనే ఉండాలని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. చక్రీపురం డివిజన్‌ను శతాబ్దాల కాలంనాటి చరిత్ర కల్గిన కుషాయిగూడను డివిజన్‌గా మార్చాలని నిరసన కార్యక్రమాలు స్థానికులు చేపడుతున్నారు. చక్రీపురం పేరునే యథావిధం గా కొనసాగించాలని హర్షం వ్యక్తం చేస్తూ స్థానికులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకుంటున్నారు. అదే విధంగా చర్లపల్లిలో భాగంగా ఉన్న భరత్‌నగర్ కాలనీని ఎవరు అంతగా గుర్తుపట్టని శక్తి సాయి నగర్ కాలనీలో కలుపడంతో స్థానికవాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ జిహెచ్‌ఎంసి అధికారులకు వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. చర్లపల్లి డివిజన్‌లో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని కాలనీలు కలపడం వల్ల నాయకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్‌ఎంసి డివిజన్ 5 గా ఏర్పడ్డ నాగారం డివిజన్‌లో నాగారం శివారు గ్రామాలను కలుపుకుని 70 వేల ఓటర్లు ఉన్న నాగారంను ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగారం డివిజన్‌లో విలీనమైన కీసరదాయర, రాంపల్లి దాయర, కరీంగూడ, బోగారంలు గ్రామీణ వాతావరణంలో ఉన్నాయని, అభివృద్ధి చెందకపోగా ఇబ్బందుల కు గురవుతారని రాంపల్లిని కేంద్రంగా చేస్తూ మరో డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**చర్లపల్లికి దగ్గరగా ఉన్న కాలనీలను వేరు చేయొద్దుః రుద్రగోని రాంచందర్‌గౌడ్ :** చర్లపల్లి కి దగ్గరగా ఉన్న కాలనీలు బిఎన్‌రెడ్డి నగర్, మహాలక్ష్మి నగర్, భరత్ నగర్‌లను అదే డివిజన్‌లో కొనసాగించాలని అన్నా రు. భరత్ నగర్‌ను శక్తి సాయి నగర్, బిఎన్ రెడ్డి నగర్, మహాలక్ష్మి నగర్ కాలనీలను చక్రీపురం డివిజ న్ లో కలిపి చరపల్లిని విడదీయడం సరియైందని కాదన్నారు.



**నాగారంను ఒకే డివిజన్‌గా కొనసాగించాలిః కొండ జంగారెడ్డి**



నాగారం మున్సిపాలిటీలో ఉన్న 70 వేల ఓటర్లు ఉన్న నాగారం, రాంపల్లిని రెండు డివిజన్‌లుగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నాగారం డివిజన్‌ను ఒకటే డివిజన్‌గా చేయడం సరియైందని కాదని రాంపల్లి కేంద్రంగా మరో డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ జెండా తప్ప ఏ పార్టీ ఉండదు

**ప్రజాపక్షం/తాండూరుః**రౌడీయిజం, సెటిల్మేంటులు చేసింది మీ ప్రభుత్వ హాయంలో మీరు కాదా అన్ని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ ప్రశ్నించారు. శనివారం ఆయన తాండూరులో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకులు పైలెట్ రోహిత్‌రెడ్డి తన నోటికి వచ్చినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై మాట్లాడటం తగదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తీవ్ర హెచ్చరించారు. తాండూరులో ఏ ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, మరో జెండా ఎగరదని హితవు పలికారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మీరు కాదా భూ సెటిల్మెంట్లు చేసిందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానికేతరుడని అనడానికి నీకు ఎక్కడి అర్హత ఉందని ప్రశ్నించారు. గత 30యేళ్ల క్రితమే ఆయన తాండూరు పట్టణంలో సొంత ఇల్లు ఉందని, మీరు కాదా ఎంఎల్ఏగా గెలుపొందిన తరువాత ఇల్లుకట్టుకున్నారని ప్రజలకు తెలియదా అని ఎద్దేవా చేశా రు.




## 'రీసో ఫాస్ట్'కు చెల్లించిన ఫీజు తిరిగి ఇవ్వాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** విద్యాసంస్థ నిబంధనలకు విరుద్దంగా రెసొనెన్స్ విద్యా సంస్థ ఈ నెల 14 నిర్వహించనున్న రీసో ఫాస్ట్ (టాలెంట్ టెస్ట్)ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ రద్దు చేసింది. కేవలం టెస్ట్ రద్దు చేయటమే కాకుండా ఆ సంస్థపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఈ టెస్టుకోసం విద్యార్థులు చెల్లించిన ఫీజులను వెంటనే తిరిగి చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు నాచారంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెసొనెన్స్ విద్యా సంస్థ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం సెక్షన్ ప్రకారం విద్యార్థులకు ఎలాంటి టాలెంట్, స్కాలర్‌షిప్,మెరిట్ టెస్టులను విద్యా వ్యాపార దృక్పథంతో నిర్వహించరాదన్న నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రచారం, పోస్టర్లు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేయటం కనపడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించటం వెనుక మామూళ్లే కారణమన్నారు. 5 నుండి10వ తరగతి చదివే విద్యార్థులకు టాలెంట్ పరీక్ష అంటూ సదరు విద్యా సంస్థ ఒక్కొక్కరి నుండి రూ. 300 రుసుం రూపంలో వసూళ్లు చేయటం నిబంధనలకు వ్యతిరేకం కాదా అని ప్రశ్నించారు. విద్యా సంస్థకు చిత్త శుద్ది ఉంటే టాలెంట్ పరీక్ష ఉచితంగా నిర్వహించాలన్నారు.వ్యాపారాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ టాలెంట్ పరీక్షను నీతి బోధనలు చేసే సిబిఐ మాజీ డైరెక్టర్ ఐపిఎస్ అధికారి జెడి లక్ష్మి నారాయణ తన భుజస్కందాలపై మోసుకొంటూ పెద్ద ఎత్తున ప్రమోట్ చేయటం సిగ్గు చేటన్నారు. ఈ కారక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ బాలకృష్ణ జిల్లా ఉపాధ్యక్షుడు గగిరిబాబు, అనీల్‌కుమార మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా కార్మికుల వేతనాలు పెంచాల్సిందే : ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** షాహి సంస్థలో పనిచేసే మహిళా కార్మికులకు న్యాయబద్ధంగా వేతనాలు పెంచాల్సిందేనంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేసారు. వేతనాలకు సంబంధించిన సమస్యల పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఆరో రోజుకు చేరుకున్న మహిళా కార్మికుల సమ్మెలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ యాజమాన్యం మహిళా కార్మికులపై కొనసాగిస్తున్న వేధింపులను ఆపేయాలని, కార్మిక నిబంధనల మేరకు వేతనాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిన జిఒ 44 కార్మికుల పాలిట గుదిబండలా తయారైందని ఆయన అన్నారు. కార్మికుల వేతనాలు పెంచే విషయం తమ పరిధిలో లేదని, సంస్థ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సిందేనని సంస్థ జిఎం మురళి ఎమ్మెల్యేకు తెలిపారు.



## సాంస్కృతిక వైభవంతో శ్రీ రాధా గోవింద రథయాత్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హరేకృష్ణ మూమెంట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన భవ్యమైన 4వ వార్షిక శ్రీ రాధా గోవింద రథయాత్ర శనివారం కోకాపేటలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో, సంస్కృతి, సాంప్రదాయాలతో రథయాత్రను మహోత్సవంలా జరుపుకున్నారు. రథంపై సుందరంగా అలంకరించబడిన శ్రీ శ్రీ రాధా గోవిందుల సుందరమైన విగ్రహాలు దివ్య రూపంలో విరాజిల్లగా, భక్తులు అపారమైన ఉత్సాహంతో రథాన్ని ముందుకు లాగారు. రథయాత్ర మార్గంలో భక్తులు సంకీర్తనలు, భజనలతో మార్మోగించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ, ఆధ్యాత్మిక సేవలతో కోకాపేట ప్రాంతం అంతా శోభాయామానంగా మారిపోయింది. శ్రీ కృష్ణ గోసేవ మండల గోశాలలో ప్రారంభమైన రథయాత్ర, గండిపేట మెయిన్ రోడ్ 'వై' జంక్షన్ నుంచి కోకాపేట 'ఎక్స్' రోడ్, అల్లు స్టూడియోస్, 7 హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ, రాజపుష్ప ఆత్రియా, గోల్డెన్ మైల్ రోడ్ మీదుగా హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టు స్థలానికి చేరుకుంది. మార్గమధ్యంలోని నివాసులు రథంపై పూలు చల్లుతూ, ప్రార్థనలు చేస్తూ దర్శనం చేసుకున్నారు. ఈ రథయాత్రలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక, సత్యగౌర చంద్రదాస ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.

## సదాలక్ష్మి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మొట్టమొదటి ప్రముఖ తెలంగాణ ఉద్యమకారిణి, మాజీ మంత్రి టి.ఎన్.సదాలక్ష్మి విగ్రహాన్ని ఇందిరాపార్కు వద్ద ప్రతిష్ఠించాలని, ఆమె జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత, కార్మిక, కర్షక సాహితీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం సదాలక్ష్మి తనయుడు టి.ఎన్.వంశ తిలక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దళిత ఉద్యమ నేత జెబి.రాజు మాట్లాడుతూ సదాలక్ష్మి విగ్రహాన్ని ఇందిపార్కు వద్ద పెడతామని గత ప్రభుత్వాలు ప్రకటించాయని, ఇప్పటికీ జాప్యం చేయడం బాధాకరమన్నారు. వంశ తిలక్ మాట్లాడుతూ సదాలక్ష్మి విగ్రహ ఏర్పాటుకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలివ్వాలని కోరారు.

# క్రీడ



## మెస్సీ విగ్రహావిష్కరణ

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం మెస్సీ కోల్‌కతాకు చేరుకున్నాడు. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సువారెజ్ ఇండియాకు వచ్చారు. మెస్సీని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తాజాగా కోల్‌కతాలో 70 అడుగుల మెస్సీ విగ్రహావిష్కరణ జరిగింది. ఉదయం లేక్ టౌన్‌లో ఈ 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి మెస్సీ వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అతడు అక్కడికి వెళ్లలేకపోయాడు.

### విగ్రహ ఏర్పాటుపై హర్షం

తన 70 అడుగుల భారీ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు పశ్చిమ బెంగాల్ మంత్రి, శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు సుజిత్ బోస్ తెలిపారు. ఈ 70 అడుగుల విగ్రహం ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిఫా వరల్డ్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచ కప్ విజయానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. 'మేం మెస్సీ మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఈ విగ్రహ నిర్మాణానికి మెస్సి యాజమాన్యం ముందు అనుమతి ఇచ్చింది. ఈ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతృప్తిగా ఉన్నారు. ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. 70 అడుగుల ఎత్తుతో ఇంత భారీ మెస్సీ విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ నిర్మాణాన్ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశాం. కోల్‌కతాకు మెస్సీ వస్తుండటంతో అభిమానుల్లో అపూర్వమైన ఉత్సాహం నెలకొంది' మంత్రి సుజిత్ బోస్ అన్నారు.





## భారత ఆల్‌రౌండర్‌కు బిగ్ షాక్..

### ఐపిఎల్‌లో నిషేధం తప్పదా!

ఐపిఎల్ వేలం సమీపిస్తున్న వేళ భారత క్రికెటర్ దీపక్ హుడాకు బిగ్ షాక్. వేలంలో ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించాలనుకున్న హుడాకు బిసిసిఐ పెద్ద ఝలక్ ఇచ్చింది. అతడి పేరును అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కలిగిన క్రికెటర్ల జాబితాలోంచి తొలగించలేదు. డిసెంబర్ 16న వేలం ఉన్నందున.. హుడా బౌలింగ్ అనుమానాస్పందంగా ఉందని ఫ్రాంచైజీలకు బిసిసిఐ సమాచారమిచ్చింది. ఒకవేళ వేలంలో అతడిని ఎవరు కొన్నా బౌలింగ్ మాత్రం చేయించవద్దని స్పష్టం చేసింది. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ అయిన దీపక్ హుడా పద్దెనిమిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాడు. అయితే.. అతడి బౌలింగ్ యాక్షన్‌పై బిసిసిఐ సందేహాలు వెలిబుచ్చిన నేపథ్యంలో ఏడు మ్యాచుల్లో ఆడినప్పటికీ బంతి అందుకోలేదు. కానీ, ఇటీవల దేశవాళీలో మాత్రం ఆరు ఓవర్లు వేశాడీ ఆల్‌రౌండర్. రంజీ ట్రోఫీలో ఒక ఓవర్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఐదు ఓవర్లు వేశాడు హుడా. విదర్భతో డిసెంబర్ 8న జార్ఖండ్‌తో మ్యాచ్‌లో మూడు ఓవర్లు బౌలింగ్ చేశాడతడు. హుడా యాక్షన్ అనుమానాస్పదంగా ఉన్నందున అతడు ఇకపై బౌలింగ్ చేయవద్దని బిసిసిఐ ఆదేశించనుంది. జమ్ముకశ్మీర్‌కు చెందిన అబిద్ ముష్తాక్ కూడా అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కలిగిన క్రికెటర్ల జాబితాలో ఉన్నాడు. ఇప్పటివరకూ హుడా 10 వన్డేలు, 21 టీ20ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపిఎల్ 19వ సీజన్ వేలంలో అతడు రూ.75 లక్షలకు పేరు నమోదు చేసుకున్నాడు.

## కోహ్లీ రికార్డుపై కన్నేసిన అభిషేక్ శర్మ



టీమ్‌ఇండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ రికార్డుపై కన్నేశాడు. టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ పేరిట ఉన్న రికార్డును అభిషేక్ బ్రేక్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2016లో సూపర్‌ఫామ్‌లో ఉన్న విరాట్ 31 మ్యాచ్‌ల్లో 89.66 సగటుతో 1,614 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, 14 అర్ధ సెంచరీలున్నాయి. అభిషేక్ మరో 81 పరుగులు చేస్తే కోహ్లీ రికార్డును బద్దలు కొడతాడు. ఈ ఏడాది అభిషేక్ శర్మ ఇప్పటివరకు 39 టీ20 మ్యాచ్‌లు ఆడి 1,533 రన్స్ చేశాడు. ఇందులో మూడు శతకాలు, 9 అర్ధ శతకాలున్నాయి. స్వదేశంలో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ మొదటి రెండు మ్యాచ్‌ల్లో అభిషేక్ దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో కలిపి 34 రన్స్ మాత్రమే చేశాడు. ఆదివారం (డిసెంబర్ 14) భారత్, సౌతాఫ్రికా మధ్య ధర్మశాలలో మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ భారీ ఇన్నింగ్స్ ఆడితే కోహ్లీ రికార్డు బ్రేక్ కావడం ఖాయం. ఇక, సిరీస్ విషయానికొస్తే.. తొలి మ్యాచ్‌లో భారత్ నెగ్గగా.. రెండో టీ20లో సౌతాఫ్రికా గెలిచింది. ధర్మశాల మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని ఇరుజట్లు పట్టుదలతో ఉన్నాయి.

# ఫోకస్




## నిన్న అమెరికా... నేడు మెక్సికో..




**భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధింపు**

భారత్‌పై అధిక టారిఫ్‌లు విధించడంలో అమెరికాను అనుసరిస్తున్న మెక్సికో. భారత్‌సహా పలు ఆసియా దేశాలపై 50 శాతం వరకూ దిగుమతి సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది బహుశా అమెరికా ఒత్తిడి కారణంగా, మెక్సికన్ ప్రథమ మహిళా ప్రెసిడెంట్ క్లాడియా షీన్‌బామ్ తీసుకున్న చర్యకావచ్చని నిపుణులు భావిస్తున్నారు. కాగా, ఈ నిర్ణయం, భారత ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. మెక్సికో ప్రకటన అనుసరించి కార్లు, వాహనాల విడిభాగాలు, దుస్తుల, బొమ్మలు, స్టీలు, ప్లాస్టిక్, ఫర్నిచర్, పాదరక్షలు, అల్యూమినియం, గ్లాస్, పేపర్, సబ్బులు, మోటార్ సైకిళ్లు, కాస్మెటిక్స్ తదితర వస్తువులపై దిగుమతుల సుంకం పెరిగింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023–24లో 8.4 బిలియన్ డాలర్లుకాగా, కొత్త టారిఫ్‌తో ఈ విలువ తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీని వల్ల కార్ల దిగుమతి సుంకం 20 శాతం నుండి 50 శాతానికి పెరుగుతుంది. భారత్ నుంచి మెక్సికోకు కార్ల ఎగుమతులు సుమారు ఒక బిలియన్ డాలర్లు. భవిష్యత్తులో కార్ల భారత్ నుంచి కార్ల ఎగుమతులు తగ్గవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం భారతీయ కార్ల ఎగుమతుల్లో 50 శాతం వాటా ఉన్న వోక్స్ వ్యాగన్ (విడబ్ల్యూ)పై మెక్సికో టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఆ తర్వాతి స్థానాల్లో హ్యుందాయ్, నిస్సాన్, సుజికి (మారుతి) తదితర ఆటోమొబైల్ ఉత్పత్తి కంపెనీలు ఉన్నాయి. కాగా, టారిఫ్ పెంపుదల వెనుక అమెరికా ఒత్తిడి కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలున్నాయి. చైనాతో వ్యాపారాన్ని తగ్గించుమని మెక్సికోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ ఒత్తిడి తెచ్చారు. యుఎస్ఎంసిఏ ఒప్పందం రీవ్రీవ్యూ ముందు అమెరికా అంక్షల నుంచి రాయితీలు పొందేందుకు మెక్సికో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అయితే, దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడానికే విదేశీ వాహనాలపై దిగుమతులపై సుంకాన్ని పెంచినట్లు మెక్సికో చెప్తున్నది. కాగా, ఈ నిర్ణయం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మెక్సికో వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,267.66 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,712.37 పాయింట్లు. నష్టం 444.71 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,186.45 పాయింట్లు. నష్టం 139.50 పాయింట్లు)

## బులియన్ మార్కెట్లు

బంగారానికి డిమాండ్ తగ్గడం లేదు. గతంలో మాదిరి పరుగులు తీయకపోయినప్పటికీ, స్థిరమైన ధరల పెరుగుదల కొనసాగుతున్నది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్‌కు రూపాయి మారకం విలువ క్షీణత వంటి అంశాలు పెట్టుబడిదారులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఫలితంగా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తూ, వారు బంగారంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు కూడా బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. శనివారం నాటికి గ్రాము బంగారం 24 క్యారెట్లురూ. 13,009 నుంచి రూ.13,418కు, అదే విధంగా 22 క్యారెట్లు 11,926 నుంచి రూ. 12,300కు, 18 క్యారెట్లు రూ. 9.809ల నుంచి రూ.10,064లకు చేరింది. వచ్చే వారం కూడా బులియన్ మార్కెట్లలో భారీ మార్పులు ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మళ్లీ నేపాల్‌లో భారత కరెన్సీ చెల్లుబాటు!




భారత ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో, రూ.100 కంటే ఎక్కువ విలువ గల భారత కరెన్సీ నోట్లను నేపాల్‌లో మళ్లీ చలామణి చేయడానికి నేపాల్ సిద్ధమవుతోంది. దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ మార్పు జరుగుతోంది. అంతర్జాతీయ మీడియా సమాచారాన్ని అనుసరించి, నేపాల్ జాతీయ బ్యాంక్ త్వరలోనే నేపాల్ గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి, బ్యాంకులు–ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయనుంది. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) నవంబర్ 28న విదేశీ కరెన్సీ నిబంధనలను సవరించి, డిసెంబర్ 2న గెజిట్‌లో ప్రచురించింది. భారత్–నేపాల్ మధ్య ప్రయాణించే వ్యక్తులు రూ.100 లోపు డినామినేషన్‌గల నోట్లను పరిమితి లేకుండా తీసుకువెళ్లవచ్చు. రూ.100 పైబడిన నోట్లను కలిపి గరిష్టంగా రూ.25,000 వరకు తీసుకువెళ్లవచ్చు లేదా తీసుకురావచ్చు. కాగా, నేపాల్ నిబంధనల ప్రకారం, అక్కడి పౌరులు రూ.5,000 వరకు భారత్‌కు తీసుకువెళ్లవచ్చు. ఈ నిర్ణయం వల్ల భారత్‌లో పనిచేసే నేపాలీ వలస కార్మికులకు నగదు సమస్యలు తగ్గుతాయి. విద్యార్థులు, యాత్రీకులు, వైద్య అవసరాల కోసం వెళ్లేవారు, పర్యాటకులకు సౌలభ్యంగా ఉంటుంది. గతంలో రూ.500, రూ.1000 నోట్లు తీసుకువెళ్లినందుకు జైలు శిక్షలు, జరిమానాలు ఎదుర్కొన్న సమస్యలకు ఈ నిర్ణయం ముగింపు పలకనుంది. భారత పర్యాటకులు ఎక్కువగా ఖర్చు చేయగలగడంతో కాసినోలు, హోటళ్లు, సరిహద్దు పట్టణాల వ్యాపారాలకు ఊతం. కరెన్సీ నిబంధనల పట్ల అవగాహన లేక అరెస్టవుతున్న వారి సంఖ్య గణనీయంగా పడిపోతుంది. అయితే రూ.25,000 పరిమితి ఇంకా ఖర్చును కొంత మేర నియంత్రించవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. 2015లో నేపాలీలకు రూ.500, రూ.1000 నోట్లు రూ.25,000 వరకు అనుమతి ఉండేది. అయితే, 2016లో భారత్ పెద్ద నోట్లను రద్దు (డీమోనిటైజేషన్) చేసింది. కాగా, 2019లో నేపాల్ రూ.100 పైబడిన భారత నోట్లను నిషేధించింది. ఇటీవల క్యూఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు ప్రారంభమైనా, దూర ప్రాంతాల్లో నెట్ సమస్యల వల్ల అవి పూర్తిగా ఉపయోగపడటం లేదు. ఫలితంగా భారత్‌లోని నేపాలీలతోపాటు, నేపాల్‌కు వెళ్లే భారత పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు భారత కరెన్సీ అక్కడ చెలామణి కానుంది కాబట్టి, సమస్యలు కొంత వరకైనా తగ్గుతాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

### సిపిఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/చింతకాని:** గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చింతకాని మండలంలో నూతనంగా ఎన్నికైన సిపిఐ సర్పంచ్‌లు శనివారం సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును ఖమ్మం మమత మెడికల్ కళాశాలలో కలిసి ఆశీస్సులు పొందారు. చిన్నమండవ, నాగిలిగొండ, నేరడ, రాఘవాపురం, బస్వాపురం సర్పంచ్‌లు పర్చా రామచంద్రరావు, ఏపూరి పద్మ, దూసరి నేతాజీ, కాంపల్లి కోటమ్మ, ఆవుల నర్సింహారావు లు పువ్వాడ ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేస్తే ప్రజలే తిరిగి మనల్ని గెలిపిస్తారని అభివృద్ధే ఎజెండాగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, రాసాల మోహన్‌రావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, నాయకులు పదిమల వెంకటనర్సయ్య, కొల్లి రవి,బొడ్డు కొండలరావు, అమర్లపుడి వెంకన్న, దొబ్బల కోటేశ్వరరావు,తుపాకుల సైదులు,షేక్ దస్తగిరి,జి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ సెలవుల్లో పాఠశాలను నిర్వహిస్తున్న ఆర్‌ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రీతం మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే, ప్రభు త్వ సెలవు దినాల్లో పాఠశాలను నిర్వహిస్తూ, విద్యార్థులకు అసలు ఏం సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులు ఉల్లాసంగా ,ఉత్సాహంగా ,ఆనందంగా గడపడానికి ప్రభుత్వ సెలవు దినం ఉన్నప్పటికీని, కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలలను నడుపుతున్నారని,నియమ నిబంధనలు పాటించకుండా, జీవోలను తుంగలో తొక్కుతూ సెలవు దినం రోజున కూడా పాఠశాలలను నడుపుతూ, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను పట్టించుకోకుండాజిపిఏలే లక్ష్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల స్వలాభంకోసంవిద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఇలాంటి పాఠశాలలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గుండేటి తరుణ్, జశ్వంత్,అభిలాష్ , సజన్, కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండ కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు

### సుజాతనగర్ మండలంలో ఎమ్మెల్యే కూనంనేని విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే అని, గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా మండలంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను అత్యధిగ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. స్థానిక సంస్థల మూడో విడత ఎన్నికలను పురస్కరించుకుని శనివారం సుజాతనగర్ మండలంలోని జామ్లా తండా, బేతంపూడి తండా, కోయగూడెం, కొత్త అంజనాపురం, పాత అంజనాపురం, సింగభూపాలెం, రాఘవాపురం, మాలబంజర, సేతంపేట బంజర, సీతంపేట, గరీబ్‌పేట గ్రామ పంచాయితీల్లో విస్తృతంగా పర్యటించారు.కూనంనేని మాట్లాడుతూ పేదలు, రైతులు, రైతు కూలీలతో పాటు అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు కమ్యూనిస్టు పార్టీయే అండని చెప్పారు. ఆపద, దౌర్జన్యం, దోపిడీ, పెత్తందారీ విధానం ఉన్న చోట కమ్యూనిస్టులు వాటిపై పోరాటాలు సాగిస్తూ ప్రజలకు మేలు చేస్తారని చెప్పారు. అలాంటి కమ్యూనిస్టులను గెలిపించుకోవడం ద్వారా గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని తెలిపారు. అనునిత్యం ప్రజలను వెన్నంటి ఉండి వారి కష్టాలు, సమస్యలపై స్పందించేది కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులే అని ఈనెల 17న జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కొమారి రామయ్య ఐదవ వర్ధంతి సందర్భంగా నాయకులగూడెం వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, మండల నాయకులు మూడు గణేష్, వీర్ల మల్లేష్, దుర్గా ప్రసాద్, బొడ్డు శేశవరావు, గద్దం రాజేందర్, బానోత అనీల్, భాగం కృష్ణ, లావుడియా గోపి, భూక్యా శ్రీను, బండి రమేష్, దొడ్డ వెంకన్న, మిత్రపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం.. ప్రజాసేవకే సిపిఐ అంకితం



### రాయగూడెంలో విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి పంచాయితీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత గెలుపు లక్ష్యంగా రాయగూడెం గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు ఎర్రజెండా పార్టీల ఆదరించిన వారు రాయగూడెం గ్రామస్తులని, ఈ ఎలక్షన్‌లో కూడా వారి అమూల్యమైన ఓటు మెస్సు మమత బ్యాట్ గుర్తుపై వేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత రాయగూడెం గ్రామస్తులతో మమేకమై, ఆప్యాయంగా పలకరిస్తూ, తమ బ్యాట్ గుర్తును చూపించి, ఈ ఎలక్షన్‌లో తనను గెలిపిస్తే మళ్లీ మళ్లీ రాయిగూడెం వస్తానని, సంక్షేమ పథకాలు రాయగూడెం గ్రామస్తులు అందరికీ అందేలా చేస్తానని వారు ఈసందర్భంగా రాయగూడెం గ్రామస్తులకు మాట ఇచ్చారు. ఈకార్యక్రమంలో ముక్తార్, ముక్తార్ పాషా, కుంట సహదేవ్, మద్దెల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, దీకొండ మల్లేష్, పరమ ఇమానేయులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి వజ్జ ఉమా

పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ స్థానిక సంస్థల ప్రచారంలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి వజ్జఉమా దూసుకుపోతుంది. పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి వజ్జ ఉమా గెలుపు లక్ష్యంగా పెద్ద వెంకటాపురం, బూసరాయి గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య పెద్ద వెంకటాపురం గ్రామ ప్రజలకు చేసిన కృషి ఎజెండాగా, పెద్ద వెంకటాపురం బాసవారి గుంపుకు రేసు ఎల్లయ్య అంటే అపారమైన నమ్మకం, ఆ నమ్మకమే పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ గెలుపుకు దోహదపడే విషయంగా పలువురు తెలుపుతున్నారు. వజ్జ చిరంజీవి కూడా సేవా దృక్పథం కలవాడని, ప్రచార కార్యక్రమంలో సిపిఐ పార్టీ కార్యకర్తలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### నాగమణిని గెలిపించండి



**ప్రజాపక్షం/పెనుబల్లి:**ప్రభుత్వం నుండి అందవలసిన పథకాల కోసం ప్రశ్నించి, సాధించి నిజాయితీ పాలన అందించాలంటే లింగగుడెం పంచాయతీ సిపిఐ బలపరచిన అభ్యర్థి వట్టం నాగమణిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహరావు, సిపిఐ జిల్లా నాయకురాలు సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని లింగగుడెం పంచాయతీ లో ప్రచారం పాల్గొని మాట్లాడుతూ సిపిఐ బలపరిచిన అభ్యర్థి వట్టం నాగమణి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. లింగగుడెం పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రచారంలో సర్పంచ్ గా గెలిపించి గ్రామ పంచాయతీ సేవ చేసే భాగ్యం కల్పించాలని ప్రజలను కోరారు. సిసి రోడ్లు, డ్రైనేజిలు, మంచినీటి సదుపాయం వంటి అభివృద్ధి పనులు చేస్తామని సమస్యలు పరిష్కరిస్తామని, గ్రామంలోని పారిశుద్ధ్యం నిర్మూలించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో నిజాయితీకి, నిబద్ధతకు, అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వట్టం నాగమణి కోరారు. ప్రచారం లో సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, కారం రాములు, మధు తదితరులు పాల్గొన్నారు

**ప్రజాపక్షం/ఇల్లందు: తిలక్ నగర్** పంచాయితీ అభ్యర్థి ధనసరి స్రవంతి గెలుపుకై కాంగ్రెస్, సిపిఐ శ్రేణులు తిలక్‌నగర్ గ్రామ పంచాయితీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య మాట్లాడుతూ సిపిఐ, కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి ధనసరి స్రవంతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తిలక్‌నగర్ గ్రామ పంచాయితీలో కొంత భాగం ఓసి నిర్వాసిత ప్రజలకు రావాల్సిన ప్యాకేజీని అధికార పార్టీకి, సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటియూసికి మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. మాయ మాటలు చెప్పే పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఎట్టి హరికృష్ణ,ధనసరి రాజు, శ్రీకాంత్, రమణాల లక్ష్మ య్య, హరీష్, లక్ష్మీ నాథ్ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## పాఠశాలకు బ్యాండ్ సెట్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలం, లెంకలపల్లి గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థిని కొమ్ము లాస్య తండ్రి కొమ్ము శ్రీశైలం శనివారం అడ్డగూడూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో రూ.35 వేల విలువ గల బ్యాండ్ సెట్ పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, పాఠశాల ఉపాధ్యాయులు, పిఈటిలు జ్యోతి, అశ్విని, అమ్మ ఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ యర్రోళ్ల సురేష్, బొబ్బలి యాదగిరి, సూరారం భాస్కర్, కుడుతాల అశోక్, జిల్లా రాజేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## 'పద్మశాలి చేనేత ఆణిముత్యాలు' పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాకు చెందిన ప్రముఖ కవి రచయిత పున్నమి అంజయ్య రచించిన పద్మశాలి చేనేత ఆణిముత్యాలు పుస్తకావిష్కరణ శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పుస్తకావిష్కర్త ప్రముఖ కథా రచయిత తత్వవేత్త తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి,ప్రముఖ చరిత్రకారుడు పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, ప్రముఖ రచయిత్రి జాజుల గౌరీ, అడ్వకేట్ వనం దుష్యంతల, కర్నాటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎస్ రాములు మాట్లాడుతూ వెనుక బడిన పద్మశాలి చేనేత కులంలోని ఆణిముత్యాల గురించి సాహిత్యంలో మరుగున పడిన మాణిక్యాలను వెలికితీసి వాళ్ళ చరిత్రను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన చేనేత కళాకారుల గురించి చక్కగా వివరించిన పున్నమి అభినందనీయులని కొనియాడారు.

## సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వి దాసేశ్వర రావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కొత్త ఆవిష్కరణల దృష్ట్యా ప్రస్తుత పోటీ ప్రపంచంలో అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే, విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం 'ఇగ్నైట్ యువర్ కోడింగ్ జర్నీ 'పేరుతో కోడింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని, ప్రాక్టికల్ నైపుణ్యం అవసరమని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం 10 ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సెకండియర్ విద్యార్థి బి.శ్రవణ్ కుమార్ అద్భుత ప్రతిభ విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్‌సీఎస్ఈ సెకండియర్ చదువుతోన్న విద్యార్థి బి.శ్రవణ్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచారు. కేవలం తరగతి గది విద్యకే పరిమితం కాకుండా, రియల్‌టైమ్ సమస్యలకు పరిష్కారం చూపుతూ శ్రవణ్ రెండు కీలకమైన వెబ్‌సైట్‌లను రూపొందించాడు. విద్యార్థులు, సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండేలా 'కాలేజీ క్యాంటీన్' వెబ్‌సైట్‌ను డిజైన్ చేశారు. అలాగే యూనివర్సిటీలో జరిగే వివిధ కార్యక్రమాల సమాచారాన్ని, రిజిస్ట్రేషన్లను సులభతరం చేసేలా 'ఈవెంట్ మేనేజ్‌మెంట్' వెబ్ సైట్‌ను డిజైన్ చేశాడు. ఫ్యాకల్టీ(టీఏ) కె.ప్రణవ్ రెడ్డి సహకారంతో డెవలప్ చేసిన ఈ వెబ్‌సైట్‌లను యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు శనివారం ఆవిష్కరించారు. చిన్న వయసులోనే సామాజిక అవసరాలకు ఉపయోగపడేలా వెబ్‌సైట్‌లను రూపొందించిన శ్రవణ్ కుమార్‌ను యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

దామరచర్ల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** జిల్లాలో రెండవ విడత ఎన్నికలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. దామరచర్ల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లు జిల్లా ఎస్పి పరిశీలించి మాట్లాడుతూ ఈ నెల 14న మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల, మాడుగులపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, వేములపల్లి మొత్తం 10 మండలాల్లోని 282 గ్రామ పంచాయితీలలో 2418 పోలింగ్ కేంద్రాలలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేందుకు ప్రతి మండలానికి సూమరు 200 చొప్పున 2000 మంది పోలీస్ సిబ్బందితో ప్రతి మండలానికి ఒక డిఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షణలో రూట్ లుగా విభజించి ఎలాంటి సమస్యలు తలెత్తిన తక్షణమే అక్కడికి చేరుకుని పరిష్కరించుటకు సిఐ,ఎస్ఐ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పి వివరించారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఊరేగింపులకు, ర్యాలీలకు అనుమతి లేదని బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తేలని ఉపసర్పంచ్ ఎన్నిక

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహింపురం గ్రామంలో జరిగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో ఉపసర్పంచ్ ఎన్నిక మూడురోజులుగా వాయిదాపడుతూ వస్తుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌తో పాటుగా, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ ఉండటంతో కూడా కొంత పోటీతత్వం పెరగడం, వార్డు సభ్యుల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వలన ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తుంది. గ్రామంలో మొత్తం 8 వార్డులకు గాను, సర్పంచ్ అభ్యర్థి ప్యానెల్‌లో కాంగ్రెస్ నుంచి ఇద్దరు సభ్యులు ఉండగా, బిఆర్ఎస్ నుంచి ముగ్గురు వార్డు సభ్యులు, బీజేపీ నుంచి ఇద్దరు సభ్యులు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక వార్డు సభ్యులు ఉన్నారు. కాగా ఉపసర్పంచ్ ఎవరిని ఎన్నుకోవాలి అనే సందిగ్ధంలో గత మూడురోజులనుంచి ఉపసర్పంచ్ ఎన్నిక వాయిధపడుతుంది. ఓ వైపు గెలుపొందిన అభ్యర్థుల ప్రమాణ స్వీకారం సమయం దగ్గరపడుతుండడం, మరో వైపు ఏ విధంగా ఎన్నిక జరిగి, ఎవరు ఉపసర్పంచ్‌గా ఎన్నికవుతారు అనేది చర్చాంశనీయంగా మారింది.

# బజారులో బ్యాలెట్ పేపర్లు

అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు

అన్నీ అవాస్తవాలే.. రిగ్గింగ్ జరగలేదు : ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/చిట్యాల/నల్లగొండ:** ఎన్నికల అనంతరం బ్యాలెట్ పెట్టెలలో భద్రంగా ఉండాల్సిన బ్యాలెట్ పత్రాలు బజారులో ఉండటం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి కలకలం రేపింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం జరిగిన మొదటి విడత పోలింగ్‌లో భాగంగా చిన్నకాపర్తి గ్రామంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం లెక్కింపు పూర్తి చేసిన అధికారులు విజేతలను కూడా ప్రకటించారు. ఎన్నికలు, విజేతల ప్రకటన లాంటి ఎన్నికల తంతు పూర్తి అయిన తరువాత అధికారులు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి అక్కడి నుండి నిష్క్రమించారు.శుక్రవారం రాత్రి బిఆర్ఎస్ బలపర్చిన రాధారపు భిక్షం గుర్తు కత్తెరపై ఓటు వేసిన కొన్ని బ్యాలెట్ పేపర్లు పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఉన్న మురుగు కాలువలో కనిపించడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, నకిరేకల్, నల్లగొండ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డిలు ఎన్నికల తీరుపై మండిపడ్డారు. కాగా చిట్యాల మండలం చినకాపర్తిలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోలైన ఓట్లు డ్రైనేజీలో బయటపడిన సంఘటనలో ఎలాంటి బోగస్ ఓటింగ్ లేదా రిగ్గింగ్ జరగలేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి 6,7 గంట ల మధ్య చినకాపర్తిలో పోలైన బ్యాలెట్ పేపర్లు డ్రైనేజీలో బయటపడ్డాయని సమాచారం అందిన వెంటనే నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డిని వెంటనే అక్కడికి పంపించడం జరిగిందని, ఎంపీడీవో, ఆర్ఓ ఇతర సిబ్బంది అందరి సమక్షంలో ఆర్‌డిఓ విచారణ నిర్వహించారని, విచారణ అనంతరం పోలైన ఓట్ల కు, కౌంటింగ్‌కు సరిపోయాయని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, గెలిచిన అభ్యర్థిని ప్రకటించిన అనంతరం, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వారి సంతకం తీసుకున్న తర్వాత బ్యాలెట్ పేపర్లు సరి పోల్చుకున్న తర్వాత గెలిచిన, ఓడిన అభ్యర్థుల సంతకాలు కూడా తీసుకున్న అనంతరం ఆర్ఓ సంబంధిత గది నుండి బయటికి వెళ్లిపోయారని, అనంతరం ఇలాంటి సంఘటన జరిగిందని కలెక్టర్ తెలిపారు. కింది స్థాయి అధికారులు వాటిని వదిలి వేయడం వల్ల ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని తెలిపారు. చిన కాపర్తి గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో పోల్ అయిన ఓట్లకు, బ్యాలెట్ బాక్సులో ఉన్న ఓట్లు, డ్రైనేజీలో దొరికిన ఓట్లకు ట్యాలీ అయ్యిందని ,ఎక్కడ బోగస్ ఓటింగ్ గాని, రిగ్గింగ్ గాని జరగలేదని ఆమె స్పష్టం చేశారు.



**సజావుగా ఎన్నికల ఫలితాల ప్రకటన..**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి ఈనెల 11న జరిగిన ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ, లెక్కింపు ప్రక్రియ, ఎన్నికల ఫలితాల ప్రకటన సజావుగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. అనంతరం ఎన్నికల సామాగ్రి భద్రపరచు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లుగా కమిషన్ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి, నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడిన ఓట్ల లెక్కింపు అధికారులపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఇందుకు బాధ్యులైన ఆర్ఓపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే కాకుండా, విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని, అలాగే పోలింగ్ బృందాన్ని కూడా సస్పెండ్ చేసినట్లు ఆమె వెల్లడించారు.

# ఎలాంటి అక్రమాలు జరగలేదు

ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తాము ఆదేశించామని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. శనివారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన చిన్నకాపర్తిలో బజారులో బ్యాలెట్లు దొరికిన విషయంపై ఆయన స్పందించారు. తమ పార్టీ బలపర్చిన అభ్యర్థి 455 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రజాస్వామ్యబద్ధంగా, అన్ని పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఏజెంట్లు, అధికారులు, పోలీస్ వ్యవస్థ సమక్షంలో జరిగిందని, ఇక్కడ అక్రమాలు జరగడానికి తావే లేదన్నారు. గెలిచే అభ్యర్థి అక్రమాలకు పాల్పడవల్సిన అవసరమే లేదన్నారు. లెక్కించిన ఓట్లు, పోలింగ్ ఓట్లు సరిపోయాయన్నారు. కాగా బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాగా బ్యాలెట్ పత్రాలు ఎలా బయటకు వచ్చాయన్న విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంభందింత అధికారులను కోరడం జరిగిందని వీరేశం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు తదితరులున్నారు.

# సమర్థమంతంగా రెండవ విడత నిర్వహణ



కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రెండవ విడత పోలింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు సమర్థవంతంగా, సమన్వయంతో నిర్వహించాలి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు జరగనున్న భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో దివ్యబాల పాఠశాల, వలిగొండ మండలం కేంద్రంలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల డ్యూటీలు వేసిన అధికారులందరూ వచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాజరు కాని వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మీ గ్రామ పంచాయతీకి సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, స్వస్తి గుర్తు స్టాంపు, ఫారం 9 వచ్చాయా అని చెక్ చేసుకోవాలన్నారు. ముందుగా ఓటర్ లిస్ట్ ఇక్కడే క్షుణ్ణంగా పరిశీలించి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట గుర్తులతో పోలీ ఉండే ఫారం 9 అతికించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు అధికారులందరూ భాధ్యతతో నిర్వహించి సజావుగా జరిగేలా చూడాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించి స్వయంగా కలెక్టర్ సిబ్బందికి వడ్డించారు. పోలింగ్ సామాగ్రి ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా పోలీస్ బందోబస్తుతో వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రెండవ దశ ఎన్నికలకు ఏర్పాట్లు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/ చివ్వెంల/ మోతె/ నడిగూడెం/ కోదాడ/ అనంతగిరి/ చిలుకూరు :** రెండవ దశ గ్రామ పంచాయితీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రజలు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం చివ్వెంల, మోతె, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయా కేంద్రాలలో మాట్లాడుతూ ఆదివారం జరుగు రెంవడవ విడత పోలింగ్ సందర్భంగా ఎనిమిది మండలాల్లో కలుపుకొని మొత్తం 181 గ్రామ పంచాయితీలు కాగా, ఇందులో ఏకగ్రీవం తరువాత 158 గ్రామ పంచాయితీలకు, 1460 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను 1462 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పోలింగ్ సిబ్బంది అందరికి శిక్షణ ఇచ్చి విధులు కేటాయించడం జరిగిందని పోలింగ్ సిబ్బంది అందరూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వారికి కేటాయించిన గ్రామ పంచాయితీలకు చేరుకొని ప్రణాళిక ప్రకారం పోలింగ్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తదుపరి అదే రోజు 2 గంటల నుండి అదే గ్రామ పంచాయితీలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలను సంబంధిత స్టేజ్ 2 ఆర్ఓల ఆధ్వర్యంలో డిక్లరేషన్ చేసి ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. అదేరోజు ఇన్‌డైరెక్ట్ పద్ధతిలో ఉప సర్పంచ్ ఎన్నిక నిబంధనల ప్రకారం పూర్తి చేస్తారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్‌డిఓ సూర్యనారాయణ, ఎంపిడిఓ ఇషాక్ హుస్సేన్, తహశీల్దార్ వాజీద్అలీ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోంది



మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎన్నికల వేళ జిల్లాలో దారుణాలు జరుగుతున్నాయి, చాలా అన్యాయంగా అధికార దుర్వినియోగం చేస్తున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలిన ఉద్యోగులు కాంగ్రెస్ నాయకుల గుంపులో చేరి అక్రమాలు చేస్తున్నారని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. శనివారం నల్లగొండలోని బిఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో జడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్యలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతు ఈనెల 11న జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికలలో నామినేషన్ వేసే బిఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేశారని కాంగ్రెస్ హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తుందని ఎన్నికల కమిషన్ మీద నమ్మకం పోతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఎక్కడా రాజకీయ ఘర్షణలు జరగలేదని జిల్లాలో ఇద్దరు మంత్రుల పిఏలు రోజు పోలీసులకు ఆదేశాలు ఇస్తున్నారని బిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తలపై అక్రమ పోలీస్ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నేతలు గెలిచిన చోట రీకౌంటింగ్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని చిన్నకాపర్తిలో బిఆర్ఎస్‌కు వేసిన ఓట్లు పోలింగ్ చిట్టీలు డ్రైనేజిలలో ఉన్నాయని తెలిపారు. చిన్న కాపర్తి బ్యాలెట్ పేపర్‌ల విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈసీని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రెగట్టే మల్లిఖార్జున రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి మాజీ జడ్‌పిటీసీ తండు సైదులు గౌడ్, కొండూరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బొజ్జ వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస రెడ్డి, మారగోని గణేష్, గున్ రెడ్డి యుగంధర్ రెడ్డి, జమాల్ ఖాద్రి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వర్గ విభేదాలకు, గొడవలకు పోవద్దు

**ప్రజాపక్షం/మోతె :** ప్రజలు వర్గ విభేదాలకు, గొడవలకు పోవద్దని జిల్లా ఎస్‌పి కె.నరసింహ అన్నారు. శనివారం మండలంలోని సిరికొండ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిబంధనలు, ఆంక్షలు అమలు చేయాలని కోరారు. లెక్కింపు ప్రక్రియ సమయంలో తప్పుడు సమాచారం వెళ్లకుండా అభ్యర్థులను లెక్కింపు ప్రారంభంలోనే కూర్చోబెట్టుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్‌పి వెంట మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు అజయ్,



సైదులు, అర్మడ్ ఎస్ఐలు అశోక్, సాయిరాం సిబ్బంది ఉన్నారు.

## ఇంటింటికీ ప్రచారం



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామ సిపిఐ బలపరిచిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పెండ్యాల వినోద్ కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శనివారం గ్రామంలో సిపిఐ జనగామ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి ఆది సాయన్న ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజి సమస్య, మంచినీటి సమస్య, వీధి దీపాల సమస్య, కుళాయిల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి ముందుండి కృషి చేయడానికి సిద్దంగా ఉన్న వ్యక్తి పెండ్యాల వినోద్ అని ఆయన తెలిపారు. ఓటర్లు ఆలోచించి విద్యావంతుడైన వినోద్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీశైలం, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు చిన్నపరెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రజాపాలనలోనే అభివృద్ధి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని అరెగూడెం, దిల్వార్పూర్, ఇక్కుర్తి, మాటూరు, తేర్యాల, అమ్మనబోలు, చామపూర్, చందేపల్లి తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్లుగా బిఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ ప్రజాపాలన వచ్చిన వెంటనే నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రుణమాఫీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యేల్లంల సంజీవ రెడ్డి, మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథ రాజు, సిపిఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బోయినీ ఝాన్సీ, అమ్మనబోల్ అధ్యక్షుడు శీల బాలకృష్ణ యాదవ్, క్యాసగల్ల చందు, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేడు 2వ విడత మిర్యాలగూడ డివిజన్లోని రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు.ఆదివారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాలలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా శనివారం ఆమె మాడుగులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ ,స్వీకర( డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్) కేంద్రాన్ని తనిఖీ చేసి ఎన్నికల సామాగ్రి పంపిణీకి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల,మాడుగుల పల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, వేములపల్లి మండలాల్లోని 2418 పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను 2898 మంది పిఓలు ,3334 మంది ఓపిఓ లను మించడం జరిగిందని తెలిపారు.పోలైన బ్యాలెట్ ల భద్రత, బాధ్యత పూర్తిగా స్టేజ్ 2 రిటర్నింగ్ ఆఫీసర్‌పై ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కౌంటింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను,రీ కౌంటింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఎన్నికలు జరగనున్న 10 మండలాల్లోని 250 పోలింగ్ కేంద్రాల లోకేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. సుమారు 5000 మంది సిబ్బంది సేవలను 2వ విడత పోలింగ్‌లో వినియోగించుకుంటున్నామని, వెబ్ కాస్టింగ్‌తో పాటు, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి
కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘు అధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** మొదటి విడత కంటే రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని, తెలంగాణ రాష్ట్ర ఎంపిల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లురవి అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు , వార్డు సభ్యులందరినీ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరు కూడా వారి గెలుపుకై నిరంతరం పనిచేసి వారి మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు చేయాలని , సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం జరిగింది.

# రెండో విడత ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి,
కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ :** శనివారం దేవరకద్ర మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, చిన్న చింత కుంట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కౌకుంట్ల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 14వ తేదీన జరుగనున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న పోలింగ్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. భోజన ఏర్పాట్లను పరిశీలించారు. పిఒలు, ఒపి. ఒలు అందరు హాజరయ్యారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరు కానీ సిబ్బంది వివరాల అందజేయాలని, తదుపరి హాజరు ఎన్నికల విధులకు హాజరు కాకుంటే వారిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సస్పెన్షన్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పిఓలు, ఓపిఓలతో మొత్తం మెటీరియల్ తీసుకున్నారా, పరిశీలించారా, అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో చిన్న చింత కుంట, కౌకుంట్ల , దేవరకద్ర, హన్వాడ, మిడ్జిల్ కోయిల్ కొండ మండలాల్లో రెండవ విడత గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల స్థానాలకు ఎన్నికలు ఈనెల 14న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్. జరుగుతుందని తెలిపారు. పోలింగ్ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. నిర్వహించనున్నట్లు తెలిపారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో మెటీరియల్ తీసుకున్న పిఓ, ఓపిఓలు మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించాలని, ఏదేని కొరత ఉన్నట్లు గమనిస్తే తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 14వ తేదీన పోలింగ్ నిర్వహణకు ఓటింగ్ కంపార్ట్ మెంట్ వంటి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. లెక్కింపు పూర్తి అయిన తదుపరి సాధారణ పరిశీలకుల అనుమతితో గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహణ తదుపరి ఓట్లు లెక్కింపులో ఎలాంటి పొరపాటుకు అవకాశం లేకుండా ఎన్నికల సంగం మార్గదర్శకాలు మేరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ సామాగ్రి తరలింపును జోనల్ అధికారులు, రూటు అధికారులు పర్యవేక్షణతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు, సిబ్బంది వివరాలు దేవరకద్ర, సి.సి. కుంట, కౌంకుంట్ల, కోయిల్ కొండ, మిడ్జిల్, హన్వాడ 6 మండలాల్లలో 151 జి.పి.లు, 1334 వార్డ్ లకు ఎన్నికలకు గాను 9 సర్పంచ్ లు, 267 వార్డ్‌లకు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యా రు. ఏకగ్రీవం పోను 142 సర్పంచ్ లు, 1065 వార్డ్ లను ఎన్నికలు జరుగనున్నాయి. రిటర్నింగ్ అధికారులు 164 మంది రిజర్వ్‌తో కలిపి నియమించినట్లు, 3503 మంది పిఒలు, ఒపిఒలు రిజర్వ్‌తో కలిసి కేటాయింపు 45 జోన్ లకు 45 మంది జోనల్ అధికారులను, 48 రూట్ లకు 67 మంది రూట్ అధికారులను రిజర్వ్ తో కలిపి నియమించారు. పోలింగ్ సిబ్బంది, సామాగ్రి తరలింపుకు 148 బస్సులు రిజర్వ్ తో కలిసి ఏర్పాటు ప్రతి మండం కు పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారి తెలిపారు.

## 181 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా నారాయణపేట మండలం పేరపల్లి గ్రామంలోని అశోక్ గౌడ్ కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందడంతో నారాయణపేట టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 181 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకుని నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.65,600/గా నిర్ధారించబడిందని తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినందుకు సంబంధిత వ్యక్తి అశోక్ గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బు పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## జనరల్ స్థానాల్లో బిసిలను గెలిపించండి

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్:** నేడు జరగనున్న రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు అత్యధిక స్థానాలలో గెలిపించాలని జనరల్ స్థానాలలో మొదటి విడత ఎన్నికల్లో ఏ విధంగా అయితే అత్యధిక స్థానాలు గెలిచారో అదే విధంగా ఈ విడతలో కూడా అత్యధికంగా సర్పంచులుగా గెలిచి బిసిల సత్తా ఏంటో నిరూపించాలని బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోదల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో కోరారు. అన్ని పార్టీలకు బిసిల పట్ల చిత్తశుద్ధి లేదు కాబట్టి 42 శాం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి మోసం చేసిన ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని, భవిష్యత్తులో జరగబోవు ఎంపిటిసి, జెడ్పిటిసి, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల లో బిసిలకు అత్యధిక సీట్లు ఇచ్చే విధంగా ఈ ఎన్నికల్లో మన బలం నిరూపించుకోవాలని తెలిపారు. బిసి వాదం ఉన్న వ్యక్తిని, అగ్రవర్ణాల ప్రోత్సా హం లేకుండా ఉన్న వారిని గెలిపించుకుంటే భవిష్యత్తు బిసి ఉద్యమంలో రాజకీయంగా ముందుకు పోయేందుకు ఇప్పుడు గెలిచే సర్పంచులకు మం చి అవకాశమన్నారు. తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే ఈ స్థానిక సంస్థ ఎ న్నికల్లో బిసిలందరూ చైతన్యంతో ఆత్మగౌరవ ఉద్యమంగా భావించి మన ఓట్లు మనకే వేసుకుని ఎక్కువ మందిని గెలిపించుకోవాలని శ్రీనివాస్ సాగర్ కోరారు.

## కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరిక



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలం చిన్నగోపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సమక్షంలో శనివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వారికి కండువా కప్పి బిఆరఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు తిరుపతి రెడ్డి, పెద్ద కురుమూర్తి గౌడ్, కావాలి ఆంజనేయులు కురుమ చిన్న హనుమంతు, పోతుల ఆంజనేయులు, నడిపికురు వనగౌడ్, బోయగోపాల్, బోయ ఆనంద్, రాంపురం నరసింహ గోప్లాపూర్ సర్పంచు అభ్యర్థి వీరారెడ్డి, కత్తెర గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జుట్ల హనుమంతు గ్రామ టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచి కృష్ణయ్య శెట్టి, విష్ణువర్ధన్ రెడ్డి, శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న మంత్రి



**ప్రజాపక్షం/మక్తల్ :** తన వద్ద పాలేరుగా పనిచేసి నమ్మకంగా సేవలందించిన జుట్ల ఆంజనేయులుకు మంతి వాకిటి శ్రీహరి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉపాధి కల్పించారు. టీ కొట్టు ప్రారంభించుకునేలా కిరాయి నమూనా పత్రాన్ని శనివారం జుట్ల ఆంజనేయులకు అందజేశారు. తనను నమ్ముకుని కష్టపడిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడం తన నైతిక ధర్మమని భావించిన మంత్రి వాకి టి శ్రీహరీ, మక్తల్ ఆర్టీసీ బస్టాండ్‌లో టీ కొట్టు ఏర్పాటు చేసుకునేందుకు డి పో మేనేజర్‌తో మాట్లాడి నెలవారీ కిరాయిగా స్థలం కేటాయించేందుకు సి ఫారసు చేశారు. దీనికి సంబంధించిన అనుమతి ఉత్తర్వులు తీసుకొచ్చి నమ్మకంగా పనిచేసిన ఒక్కొక్కరికి ఉపాధి కల్పిస్తూ, నమ్మకున్న వారందరికీ ఉపా ధి బాట చూపిస్తున్న మంత్రి చర్యలపై పలువురు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులనే సర్పంచులుగా గెలిపించాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలన్నా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదాల బీరయ్య అన్నారు. మండల కేంద్రం వీపనగండ్లలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీసాల పార్వతమ్మ ఎన్నికల ప్రచారంలో గోదాల బీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ప్రజలను కలుసుకుని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన వివిధ సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న మీసాల పార్వతమ్మను సర్పంచుగా గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## నల్లమల టూరిజం హబ్‌కు రూ.100కోట్ల ప్రణాళిక
ఎమ్మెల్యే వంశీకృష్ణ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** అరణ్యసంపద, ఆ ధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సౌందర్యానికిపెట్టింది పేరైన నల్లమల ప్రాంతాన్ని దేశస్థాయిలో గుర్తింపు పొందేందుకు టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడ మే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి అమ్రాబాద్ పర్యటనలో ఈ ప్రాంతాన్నిచూసి సంతృప్తిచెంది నల్లమల పర్యాటక కేంద్రంగా గుర్తిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపినట్లు చెప్పారు. రూ. 100 కోట్లతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి ఇచ్చినట్లు తెలిపారు. నల్లమల ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వరం, మద్దిమడుగు, మల్లెల తీర్థం, వ్యూపాయింట్ తదితర ఆధ్యాత్మిక ప్రకృతి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈప్రతిష్ఠాత్మక టూరిజం ప్రాజెక్టుకు త్వరలోనే నిధులు విడుదల కానున్నట్లు సిఎం చెప్పాడని ఎమ్మెల్యే తెలిపారు.

## 1150 మంది పోలీసులతో భారీ బందోబస్తు



**ప్రజాపక్షం/ వనపర్తి :** జిల్లాలో రెండో విడత గ్రా మ పంచాయితీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వనపర్తి జిల్లా ఎస్‌పి సునిత రెడ్డి, ఐపిఎస్ తెలిపారు. మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి ఘటనలు తావులేకుండా నిష్పక్షపాతంగా జరగడంలో పోలీసు అధికారులు, సిబ్బంది కీలకపాత్ర పోషించారని ప్రశంసిస్తూ అదే విధంగా రెండో విడత ఎన్నికల్లో కూడా విధులు నిర్వహించి విజయవంతంగా పూర్తి చేయాలని ఆమె కోరారు. రెండవ విడత స్థానిక సర్పంచు ఎన్నికలు గురువారం రోజు వనపర్తి జిల్లాలో వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, మదన పూర్, అమరచింత మండలాలలో మొత్తం 94 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని, 1150 మంది పోలీసు అధికారులు సి బ్బందిచే ఎన్నికలను ప్రశాంత వాతావర ణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్‌పి సునిత రెడ్డి, ఐపిఎస్ తెలి పారు. రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీస్ సిబ్బంది సమయ స్ఫూర్తితో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల భద్రత, పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్, ఫలితాలు వెల్లడి వరకు విధి నిర్వహణ అనేది సమష్టి బాధ్యతని, ఎన్నికలను విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. యువత ఆదర్శంగా ఉండాలని ఎస్పీ కోరారు. విజయోత్సవ ర్యాలీలకు బాణాసంచాకు, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ అన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందాం
ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**ప్రజపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సర్పంచ్ గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకుని ప్రభుత్వానికి అండగా నిలిచి ఎక్కువ నిధులు తీసుకొద్దామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాడు జడ్చర్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బలపరిచిన వారిని గెలిపించుకుంటే గ్రామాలన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్ల నియోజకవర్గం ప్రత్యేక దృష్టి ఉందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే అనేక నిధులు వచ్చి గ్రామాలలో రెడ్లు మునిగినీరు పాఠశాలల అభివృద్ధి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించుకునేందుకు వీలుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటే అభివృద్ధి కార్యక్రమాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , సర్పంచ్ , వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని తిప్పారెడ్డిపల్లి నూతన సర్పంచ్‌గా ఎన్నికైన నూకం శ్రీనివాసులును ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శనివారం ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు నరసింహారావు, దొడ్డివిష్ణు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతమే లక్ష్యం
ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ :** పేద ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులే పేదల పాలిట నమ్మకమైన ఆశ్రయంగా మారాలన్న దిశగా తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహబూబ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించిన, మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన నవజాత శిశువుల తల్లులకు ప్రత్యేకంగా రూపొందించిన యెన్నం హెల్త్ కిట్‌లను పంపిణీ చేశారు. ప్రసవానంతరం తల్లులు, శిశువులకు అవసరమయ్యే కీలక వస్తువులు ఈ హెల్త్ కిట్‌లలో పొందుపరిచినట్లు తెలిపారు. తల్లి శిశు ఆరోగ్య పరిరక్షణే సమాజ భవిష్యత్తుకు పునాది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స విధానాలు, సిబ్బంది పనితీరును ఆయన సమీక్షించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది సేవలను అభినందిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర చికిత్సలు, మందుల లభ్యత, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై ఆర్ఎంఒ డాక్టర్ శ్వేత, డాక్టర్ అర్చనతో చర్చించారు. ఆసుపత్రిలో వైద్య పరికరాల కొరత లేకుండా అవసరమైన అన్ని పరికరాల జాబితాను సిద్ధం చేసి, వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ సహకారంతో పాటు తనవంతు ప్రయత్నాలతో కూడా ఆసుపత్రి అభివృద్ధికి నిధులు సమకూర్చేందు కు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జగం రాఘవేందర్ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ, రోగులతో పాటు ఆసుపత్రికి వచ్చే సహాయకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వారికి స్నాన సౌకర్యం కల్పించేందుకు వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసి, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలకు సమానమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ మోసిన్ షేక్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత ఎన్నికలపై మహబూబ్ నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర సిద్ధత



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికలు నేడు (14 డిసెంబర్ 2025) జరగనున్న నేపథ్యంలో, శనివారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి డి.జానకి దేవరకద్ర మండల కేంద్రంలో ఎన్నికల బందోబస్తు నిమిత్తం విధులకు హాజరైన పోలీసు అధికారులకు, సిబ్బందికి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఎన్నికల విధుల్లో చేయవలసినవి చేయకూడనివి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా చురుకుగా విధులు నిర్వహించాలి అని ఆదేశించారు. అలాగే ఎన్నికల సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తిన పక్షంలో తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టి, ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా శాంతియుతంగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి సూచించారు. ఈ రెం డో విడత ఎన్నికల నిమిత్తం మొత్తం 1249 మంది పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. విస్తృత స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చే సి, గ్రామపంచాయితీ రెండో విడత ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎస్‌పి డి. జానకి తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం
ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి



**ప్రజాపక్షం/ అడ్డాకుల :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని శాసనసభ్యులు ఎమ్మెల్యే మేగా రెడ్డి అన్నారు. మూడో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా బలీదుపల్లి కన్మనూరు గ్రామంలో శనివారం రోజు ఎమ్మెల్యే మేగా రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే మేగా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు కరుణాకర్ రెడ్డిని కన్మనూరు గ్రామ అభ్యర్థి మానస రవికుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడానికి అ న్ని విధాలుగా మేము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు. గ్రామ అభివృద్ధి పట్ల కరుణాకర్ రెడ్డి, ప్రతి సమస్య మా దృష్టికి తెచ్చి దాని పరిష్కరించే వరకు పట్టు వదలని విక్రమార్కుని లాగా, పనిచేసే వ్యక్తి కాబట్టి అలాంటి మంచి వ్యక్తికి మీ అందరి ఆశీస్సులు ఉండి ఉంగరం గుర్తుకు ఓటు వేసి బారి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మేగా రెడ్డి గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్న శ్రీనివాస్ రెడ్డి, సత్య రెడ్డి మాజీ సర్పంచ్ అగ్గి రాములు , ప్రశాంత్‌కు మార్ రెడ్డి, సురేష్, వెంకట్రాంరెడ్డి, మన్యపు రెడ్డి, దేవరాజు ఎన్ని రసూల్ వార్డు సభ్యులు మంద కృష్ణయ్య, వై.ఆంజనేయులు, ఎం.శ్రీనివాసులు, ప్రజలు యువకులు మహిళలు పాల్గొన్నారు.

## బ్యాలట్ బాక్సుల తరలింపు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ బాక్సులను సంబంధిత పోలింగ్ కేంద్రాలకు సాయుధ పోలీసు బలగాల పటిష్టమైన భద్రత నడుమ సురక్షితంగా తరలించడం జరిగింది. ఈ తరలింపు ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించా రు. పోలింగ్ బాక్సులు అన్ని పోలింక్ కేంద్రాలకు సకాలంలో చేరుకున్నాయ ని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా , ఇన్సి డెంట్ ఫ్రీగా నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

# పటిష్ట ప్రణాళికతో రెండోదశ పోలింగ్

ఉదయం 7గంటలనుంచి ఒంటిగంట వరకు పోలింగ్ : కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో 2వవిడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన ప్రణాళికతో పాటు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా రెండోవిడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి సంసిద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండోవిడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా రెండో విడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగపరంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెండోవిడత ఎన్నికల కోసం 1,694 పిఓలు, 2411 ఓపిఓలతో పాటు వివిధరకాల బాధ్యతలతో 6వేలమందికి పైగా ఎన్నికల అధికారులు రెండోవిడత ఎన్నికల్లో వివిధ హోదాల్లో విధుల్లో పాల్గొంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో రెండోవిడత గ్రామపంచాయతీ ఎన్నికలలో 151 గ్రామ పంచాయతీలు ఉండగా, 4గ్రామ పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 147 గ్రామ పంచాయతీలకు గాను 473మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారన్నారు. మూడు విడతల ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బం ది కేటాయింపు ప్రక్రియను పూర్తిచేశామని, ప్రిసైడింగ్ అధికారులకు, స్టేజ్2 రిటర్నింగ్ అధికారులకు మూడు విడతలలో శిక్షణ ఇచ్చామన్నారు. సీటింగ్ ఏర్పాట్లు, సీ క్రెట్ ఓటింగ్ కంపార్టుమెంట్ వంటివి నిబంధనలకు అ నుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. 1412వార్డులకుగాను 143వార్డులు ఏకగ్రీవమయ్యాయని, 1269 వార్డులకుగాను 3228 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారని , ఆయా అభ్యర్థులకుగాను ఎన్నికలు జరగనున్నట్లు తెలియజేశారు. బిజినేపల్లి, కోడేరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తప ల్లి,పెంట్లవెల్లి, తిమ్మాజిపేట ఏడు మండలాల్లో 1269 పోలింగ్‌కేంద్రాలు, 1269 పిఓలు, 4001 ఓపిఓలు, 151మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు.

### రెండోవిడత పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

ఎన్నికల విధులకు హాజరుకాకుండా ఎవరైనా సిబ్బంది అనధికారికంగా గైర్హాజరైనట్లయితే వెంటనే వారి పేర్లను సస్పెన్షన్‌కు సిఫారసు చేయాలని డిఇఒను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా రెండోవిడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా రెండోవిడత ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్‌సంతోష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్‌వెంట మండల ప్రత్యేకాధికారి డిఇఓ రమేష్‌కుమార్, స్థానిక మండల అధికారులు ఉన్నారు.

# రీల్

## 'వైఫ్' చిత్ర టైటిల్ లాంచ్



అధిరా టాకీస్ బ్యానర్ పై సినిటారియ మీడియా వర్క్స్ సపోర్టుతో శ్రీనివాస్ (బుజ్జి) దర్శకత్వంలో నరేన్ తేజ్, సుహాన జంటగా నటిస్తూ మురళీకృష్ణ వర్మ సినిమాటోగ్రాఫర్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వైఫ్. సత్య కాశ్యప్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నందమూరి హరి ఎడిటింగ్ చేశారు. ప్రముఖ దర్శకుల ఆధ్వర్యంలో వైఫ్ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ.. ఈ చిత్రానికి సపోర్ట్‌గా నిలిచిన సినిటారియ మీడియా వర్క్స్ వెంకట సినిమాకు మరింత బలాన్ని అందిస్తారు. మ్యూజిక్ పరంగా కూడా మంచి సపోర్టు లభిస్తుంది. అటు భర్తకు ఇటు కుటుంబానికి బలంగా, పునాదిలా నిలబడే వైఫ్ టైటిల్ ఈ సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఈ సినిమాకు పని చేసిన అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అన్నారు. ప్రముఖ డైరెక్టర్ సముద్ర 'ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అందరి జీవితాలలో వైఫ్ ఉంటారు. ఆ వైఫ్‌ను టైటిల్‌గా పెట్టారు. ఈ సినిమా కోసం ఎంతోమంది ప్రతి భావంతులు పనిచేస్తున్నారు. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

## లుక్ అదిరింది..



మెగాస్టార్ చిరంజీవి మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్‌లో నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ప్రమోషన్స్ ఇప్పటికే హై గేర్‌లో వున్నాయి. రెండు పాటలు చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. వెంకటేష్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ సినిమా నుంచి ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన వీడియో ద్వారా ఈ అప్డేట్‌ను విడుదల చేశారు. ఆ వీడియోలో సినిమా మొత్తం టీమ్ వెంకటేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కనిపించారు. చివర్లో ఆయన ఫస్ట్ లుక్ రివిల్ కావడం హైలైట్‌గా నిలుస్తుంది. ఫస్ట్ లుక్‌లో వెంకటేష్ తనదైన చరిస్మాతో ముందుకు నడుస్తూ కనిపించారు. మోడరన్ దుస్తుల్లో ఆయన స్టైల్ ఆకట్టుకుంటుంది.



ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమైన కృతి శెట్టి మొదటి సినిమాతోనే మంచి హిట్ అందుకోవడంతో పాటూ ఆ సినిమాతో నటిగా పేరు కూడా సంపాదించుకుంది. ఉప్పెన అందించిన క్రేజ్ వల్ల వరుస అవకాశాలను అందుకున్న కృతి వాటితో ఏ మాత్రం కెరీర్‌లో పైకి ఎదగలేకపోయింది. దీంతో క్రమంగా అమ్మడికి తెలుగులో అవకాశాలు తగ్గాయి. ఈ నేపథ్యంలోనే కోలీవుడ్‌లో తన లక్‌ను టెస్ట్ చేసుకుందామని కృతి ట్రై చేసింది. అందులో భాగంగానే పలు సినిమాలను ఒప్పుకుని ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేస్తూ వచ్చి ఆఖరికి ఈ డిసెంబర్‌లోనే రెండు సినిమాలను రిలీజ్‌కు తీసుకొచ్చింది. అయితే ఎప్పుడెప్పుడు తన కోలీవుడ్ డెబ్యూ జరుగుతుందా అని ఎంతో ఎదురుచూసిన కృతికి ఎప్పటికప్పుడు అది వెనక్కి వెళ్తూనే ఉంది. కార్తీ హీరోగా కృతి చేసిన 'అన్నగారు వస్తారు' సినిమా అనుకోకుండా సడెన్‌గా వాయిదా పడగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెరకెక్కుతున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా ఈ నెల 18 నుంచి వాయిదా పడింది. ఈ రెండు సినిమాలూ వాయిదా అయితే పడ్డాయి కానీ మళ్లీ ఎప్పుడు అవి రిలీజవుతాయనేది మాత్రం ఇంకా తెలియలేదు. మరి కృతి కోరుకుంటున్న కోలీవుడ్ డెబ్యూ ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

## విధాత ట్రైలర్ ఆవిష్కరణ

ఏంబిసి ప్రొడక్షన్ పతాకంపై భాస్కర్, కోటేశ్వర రావు, ప్రధాన పాత్రదారులుగా మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించిన చిత్రం విధాత. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్ర



మాలు పూర్తి చేసుకుని తొలి కాపీ తో సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను నటుడు కాదంబరి కిరణ్, నిర్మాత సాయి వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత భాస్కరాచారి మాట్లాడుతూ 'ఇది ఒక వైవిధ్య భరిత మైన చిత్రం. ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందించడం జరిగింది. ఈ చిత్రంలో పాత్రలన్నీ చాలా సహజ సిద్ధంగా ఉంటాయి. సంగీత పరంగా కూడా మా చిత్రానికి మంచి మార్కులు ప్రేక్షకులు వేస్తారని ఆశిస్తున్నాను. ఈ చిత్రాన్ని అతి త్వరలో మీ ముందుకు తీసుకురానున్నాము అని అన్నారు. చిత్ర దర్శకుడు రాజేంద్ర మాట్లాడుతూ'మా నిర్మాత నా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఈ చిత్రం లోని ప్రతి పాత్ర ఓ కొత్త కోణాన్ని వెలుగు చూస్తుంది. ఈ చిత్రం ప్రస్తుత పనులన్నీ పూర్తయ్యాయి. సెన్సార్‌కి సిద్ధమైంది. ఈ చిత్రం మాకు మా ప్రొడ్యూసర్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నానని అన్నారు.

## 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' టైటిల్ విడుదల

తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు). ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ క్రియేషన్స్, శ్రీలక్ష్మి శ్రీనివాస ఫిలిమ్స్ బ్యానర్స్ పై తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. వెంకట్ దుగ్గిరెడ్డి సహ నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఏకాదంతాయ సిరి మాట్లాడుతూ.. చిన్న సినిమాలోకి హీరోయిన్స్‌ను తీసుకున్నా



రంటే ఏదో గ్లామర్ షో చేయిస్తారు అనుకుంటారు. కానీ సాయికృష్ణ దర్శకుడిగా ఒక సిన్సియారిటీ చూపించారు. సినిమాను ఎంత ఫాస్ట్‌గా రూపొందించారంటే మేమంతా ఆశ్చర్యపోయాం. ఇంత స్పీడ్‌గా సినిమా చేయొచ్చా అనుకున్నాం. 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) మూవీ మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుందని నమ్ముతున్నాం అన్నారు. హీరో, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ సాయిబాబా ఆశీస్సులు ఇస్తున్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఫ్రిడ్జ్ మీద ఉంది. ఆ ఫొటో చూసిన ఇన్స్పిరేషన్ తో 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) సినిమా స్క్రిప్ట్ మొదలైంది. ఈ సినిమా ప్రారంభించేప్పటికి మా దగ్గర డబ్బులు లేవు. కానీ సినిమా చేయాలి, చేస్తామనే నమ్మకం పట్టుదల ఉన్నాయి. ఆ టైమ్‌లో మా వెంకట్ దుగ్గిరెడ్డి అన్న, తల్లాడ శ్రీనివాస్ ముందుకొచ్చారు. వీరిద్దరితో పాటు నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేసే దశరథ్ గారు సమర్పకులుగా ఉండేందుకు అంగీకరించారు.

## 'వి-చిత్ర' సెన్సార్ పూర్తి

సిస్ ఫిలిమ్స్ బ్యానర్‌పై జ్యోతి అపూర్వ ప్రధాన పాత్రలో రవి రావణ్ రుద్ర, శ్రేయ తివారి హీరో హీరోయిన్‌గా 'బేబి' శ్రీ హర్షిణి, మీనావాసు ప్రత్యేక పాత్రలో సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వంలో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం 'విచిత్ర' త్వరలో పేక్షకుల ముందుకు రానుండి తల్లి కూతుళ్ళ



సెంటిమెంట్ హృదయాలను హత్తుకునే కథ కథనం తో చక్కటి ఫ్యామిలీ ఎంటర్టైనర్ తెరకేక్కిన విచిత్ర' ఇటీవలే సెన్సార్ పనులు పూర్తి చేసుకొని విడుదలకి సిద్ధమవుతుంది.ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ ఒక ఆత్మీయమైన ఒక తల్లి కూతుళ్ళ సెంటిమెంట్ తో రూపొందిన చిత్రం 'విచిత్ర ' ప్రతి కుటుంబం తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఆలోచించేలా చేసే హృదయాన్ని తాకే చిత్రం 'విచిత్ర' ఈ చిత్రాన్ని 2026లో విడుదలకి సిద్ధం చేస్తున్నాం అన్నారు. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ నిజాని అంజన్ ఇచ్చిన పాటలు ప్రతి ఒక్కరికి ఆకట్టుకుంటాయి ముఖ్యంగా తల్లి సెంటిమెంట్ చిత్ర పాడిన సాంగ్ మరియు ఐటమ్ సాంగ్ ప్రత్యేక ఆకర్షనగా నిలుస్తాయి అని దర్శకనిర్మాత సైఫుద్దీన్ మాలిక్ తెలిపారు.

## 'దండోరా' టైటిల్ సాంగ్ రిలీజ్



'నిను మోసినా నను మోసినా
అమ్మ పేగు ఒకటేనన్నా
నిను కోసినా నను కోసినా
రాలే రగతం ఎరుపేనన్నా
చిన్నా పెద్దా తేడా ఎట్లొచ్చేరా
నన్ను తొక్కే హక్కు ఎవడిచ్చేరా
ముట్టుకుంటే మైల ఎట్టయ్యేరా
కొట్టి కొట్టి గుండె డప్పయ్యేరా
దండోరా.. దండోరా. అనే సాగే 'దండోరా...' మూవీ టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమాలోని, ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. ఆంథోని దాసన్, మార్క్ కె.రాబిన్ పాటను పాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను తెలియజేసేలా సాగే ఈ పాట చాలా ఎమోషనల్‌గా, హార్ట్ టచింగ్గా ఉంది. తరాలు మారుతున్నాయి. చంద్రుడిపైకి మనిషి అడుగు పెట్టిన ఎన్నో ఏళ్ల వుతుంది. అయినా కూడా ఈ అసమానతలు మాత్రం తగ్గటం లేదనేది ఈ పాట




లోని భావం. వైవిధ్యమైన చిత్రం కలర్ ఫోటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పాత్రధారులు. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఒట్టేసి చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన కల్లూరి బాలరాజు అభ్యర్థి గ్రామంలో ఓట్ల కోసం రూ.10 లక్షలకు పైగా ఖర్చుచేయగా, 448 ఓట్లతో బాలరాజు ఓడిపోయాడు. ఇంత డబ్బు పంచిన మెజారిటీ రాకపోవడంతో బాలరాజు దంపతులు ఒకరు చేతిలో దేవుడు ఫోటో పట్టుకొని, అతని భార్య పురుగుల మందు డబ్బాతో ఇంటింటికి తిరిగి ఎన్నికల ముందు ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని, నిజాయితీగా నాకు ఓటు వేసిన వారు అవసరం లేదని, వేయనివారు కచ్చితంగా తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలంటూ గ్రామస్థులతో బాలరాజు శుక్రవారం వాగ్వాదం చేశాడు. యాభై లేదా వంద ఓట్ల తేడాతో ఓడిపోతే ఏమైనా అనుకోవచ్చు కానీ ఇంత డబ్బు పంచినా ప్రత్యర్థి అయినా జక్కల పరమేశ్ భారీ ఎత్తున మెజారిటీ ఎలా వచ్చిందంటూ గ్రామస్థులతో బాలరాజు దంపతులు దిగారు. గ్రామస్తులు సైతం బాలరాజు దంపతులకు ఎదురు వాగ్వాదానికి దిగారు. మీ ఇంటికి ఏమైనా డబ్బులు ఇవ్వమని వచ్చామా అంటూ గట్టిగానే నిలదీశారు. గ్రామంలోని ప్రజలు ఇటువంటి సంఘటనలు ప్రతి ఓటర్ కు ఒక కనువిప్పు కావాలని, ఓట్ల ముందు డబ్బులు తీసుకుని ఓటు వేస్తే ఇలాంటి పరిస్థితులే గ్రామ ప్రజలకు ఎదురవుతాయని, ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీగా ఓటు వేసి సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



**మహబూబాబాద్ జిల్లాలో సేమ్ సీన్ :**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి కుటుంబ సభ్యులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మీరు మాకు ఓటు వేయకపోవడంతోనే మేము ఓడిపోయాం. మాకు ఓటు వేస్తే ఓటు వేసినట్లు ప్రమాణం చేయాలి. ఓటు వేయని పక్షంలో మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వండి అంటూ ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేసిన డబ్బులను తిరిగి వసూలు చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా సోమ్లా తండాలో చోటు చేసుకుంది. ఎన్నికలకు ముందు రోజు తండాలోని ఓటర్లకు ఓటుకు రూ.1500 చొప్పున, ఇంటికి ఒక కోడిని కాంగ్రెస్ మద్దతుదారు పంచారు. కాంగ్రెస్ రెబల్ రూ.2000 పంపిణీ చేశారు. ఎన్నికల్లో 17 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఇస్లావత్ సుజాత బాలాజీ గెలుపొందారు. ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి భూక్యా కౌసల్య, భర్త ధల్ సింగ్, కుమారుడు సందీప్‌లు జెండా పట్టుకొని ఇంటింటికీ తిరుగుతూ మీరు ఓటు వేయకపోవడం వల్లనే మేం ఓడిపోయాం. మాకు ఓటు వేసినట్లు కుల దైవం జెండా పట్టుకొని ప్రమాణం చేయండి. ప్రమాణం చేయని పక్షంలో మేం పంపిణీ చేసిన డబ్బులు మాకు ఇవ్వండి అంటూ తిరిగి డబ్బులు వసూలు చేశారు. ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడి నుంచి అందరినీ చెదరగొట్టారు. కానీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి మాత్రం మరోలా సమాధానం ఇస్తున్నారు. తాను గుడి వెళ్లేందుకు సిద్ధమయ్యానని అందుకే ఇంటింటికీ వెళ్లి డబ్బులు అడుగుతున్నానని అన్నారు.

## వాక్చాతుర్యంతో.. యుద్ధాలు గెలవలేం



**పాకిస్థాన్‌కు సిడిఎస్ జనరల్ అనిల్‌చౌహాన్ చురక**
**దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్'**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశం యొక్క భవిష్యత్తు పోరాట శక్తి ఉమ్మడితనం, ఆత్మ నిర్భరత, ఆవిష్కరణ అనే మూడు స్తంభాల ద్వారా నడపబడుతున్నదని, దానినే 'జై' (జెఏఐ)గా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అభివర్ణించారు. ఆయన శనివారం ఇక్కడకు సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్ (సిడిపి)ని సమీక్షించిన జనరల్ చౌహాన్ ఏ దేశం పేరును కూడా ప్రస్తావించకుండా సంస్థాగత దుర్బలత్వం, ప్రతిచర్యాత్మక సర్దుబాట్లను సూచించే పరిణామాలు మనచుట్టూ తరచుగా కనిపిస్తున్నాయని అన్నారు. 'వాక్చాతుర్యంతో యుద్ధాలను గెలవలేం. కానీ మన చుట్టూ ఉద్దేశపూర్వకంగా ఉండటం ద్వారా సంస్థాగత, ప్రతిచర్యాత్మక సర్దుబాటును సూచించే పరిణామాలను మనం తరచూ చూస్తుంటాం. దీనికి విరుద్ధంగా భారతదేశం యొక్క బలమైన సంస్థలు, ప్రజాస్వామ్య స్థిరత్వం, అచంచలమైన వృత్తి నైపుణ్యం మన సాయుధ దళాలపై ఆధారపడి ఉంటుంది' అని అనిల్ చౌహాన్ చెప్పారు. సాయుధ దళాల దశల పరివర్తన సమయంలో భారత వైమానిక దళంలోకి ప్రవేశిస్తున్నట్లు సిడిఎస్ అనిల్ చౌహాన్ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు తెలిపారు. సమగ్ర నిర్మాణాలు, ఉమ్మడి కార్యకలాపాలు రక్షణలో జాతీయపు ఆత్మనిర్భరత (స్వావలంభన) భవిష్యత్తు సైనిక బలాన్ని రూపొందిస్తున్నాయని సిడిఎస్ చెప్పారు. కొత్తగా నియమితులైన అధికారుల ముందున్న ప్రయాణం 'జై హింద్' అనే మొదటి పదం ద్వారా మార్గనిర్దేశనం చేయబడుతుందని ఆయన తెలిపారు. ఐక్యత అంటే ఒక దేశంగా, ఆత్మనిర్భరత కోసం ఒకటిగా పోరాడటాన్ని సూచిస్తుంది. భారతదేశం కోసం కాకుండా ప్రపంచం కోసం తయారు చేయబడిన విశ్వసనీయ వేదికలు, వ్యవస్థలను సూచిస్తుంది. ఆవిష్కరణలు ముందుకు సాగడానికి ధైర్యంగా ఉండటాన్ని సూచిస్తాయని జనరల్ అనిల్‌చౌహాన్ అన్నారు. భారతదేశ భవిష్యత్తు పోరాటశక్తికి ఈ మూడు స్తంభాలు ఒక ఆకృతిని ఇస్తాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ అనిల్ చౌహాన్ 216 కోర్సు యొక్క కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను సమీక్షించారు. ఈ కార్యక్రమం భారత వైమానిక దళం (ఐఎఎఫ్) లోని వివిధ విభాగాలలోని ఫ్లైట్ కేడెట్‌ల ప్రీ కమిషనింగ్ శిక్షణ విజయవంతంగా పూర్తి కావడానికి గుర్తుగా ఉంది. ఈ కార్యక్రమంలో ఆకాశ్ గంగా బృందం, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్( ఏడబ్ల్యూడి టి) ప్రదర్శన కూడా ఉంది. ఇది యుద్ధవిన్యాసాల ప్రారంభానికి గుర్తుగా ఉంది. సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే, సూర్యకిరణ్ ఏరో బ్యాటిక్ టీమ్ (ఎస్‌కెఎటి) వైమానిక ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.



## టిఎన్‌జిఒస్ క్రికెట్ పోటీల్లో ఎక్సైజ్ టీం విజయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిఎన్‌జిఒస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల మధ్య నిర్వహించినటువంటి పలు రకాల పోటీల్లో క్రికెట్ విభాగంలో తెలంగాణ ఎక్సైజ్ శాఖ విజయం సాధించింది. క్రికెట్‌తో పాటు మహిళా కానిస్టేబుల్ కూడా పలు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మధ్యలో 15 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ జరిగింది. తొలతగా బ్యాటింగ్ నిర్వహించిన వాటర్ వర్క్స్ 15 ఓవర్లలో 128 పరుగులు చేశారు. అనంతరం 15 అవర్లలో ఎక్సైజ్ క్రికెట్ జట్టు విజయాన్ని సాధించి టిఎన్‌జిఒస్ కప్పును అందుకోవడానికి అర్హత సాధించారు. ఈ క్రీడలను పరిశీలించడానికి ఎస్‌టిఎఫ్‌బి టీం లీడర్ ఎక్సైజ్ ఇఎస్ ప్రదీప్ రావుతో పాటు ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది గ్రౌండ్‌లో క్రీడాకారులను అభినందించారు.

## కొత్త నిబంధనలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి నిర్ణయం తీసుకునే అధికారం,హక్కు ఒక ప్రభుత్వ యంత్రాంగానికి లేదన్న ప్రధానాంశంతో మసాచ్యుసెట్స్ జిల్లా కోర్టును ఆశ్రయించాయి. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్ సహా మరో 18 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ ఒక కూటమిగా ఏర్పడి ఈ దావాలు వేశారు. అరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, కనెక్టికట్, డెలవార్, హవాయ్, ఇల్లినోయిస్, మేరీలాండ్, మసాచ్యుసెట్స్, మిచిగన్, మిన్నెసోటే, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, ఓరెగాన్, రోడే ఐలాండ్, వెర్మోంట్, వాషింగ్టన్, విస్కాన్సిన్‌లకు చెందిన అటార్నీ జనరల్స్ ఈ దావాలు వేశారు. వీసాలు కోరుతూ దరఖాస్తులు చేసుకునే కొత్త వారికి ఒకేసారి భారీ ఎత్తున లక్ష డాలర్లు ఫీజు చెల్లించాలనే నిబంధన కార్మికుల కొరతకు దారితీస్తుందని, దీనివల్ల రాష్ట్రాల సామర్థ్యం కుంటుబడుతుందని అటార్నీ జనరల్స్ తమ పిటిషన్‌లో వాదించారు. న్యూయార్క్‌లో 16 గ్రామీణ కౌంటీలు ఉన్నాయి, ప్రస్తుతం ప్రతి 10,000 మందికి నాలుగు ప్రాథమిక వైద్య ఫిజీషియన్లు ఉన్నారు. ఇక న్యూయార్క్ ఆసుపత్రులలో ఇప్పటికే నర్సుల కొరత ఉంది. 2030 నాటికి ఈ కొరత 40,000కు పెరుగుతుంది. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అంచనాల ప్రకారం 2036 నాటికి అమెరికాలో 86,000 మంది ఫిజీషియన్ల కొరత ఏర్పడుతుంది. హెచ్1 బి వీసాలను సమస్యాత్మకంగా మారిస్తే ఈ కొరత భర్తీ చేయడం కష్టం.అమెరికా వ్యాప్తంగా 930 కాలేజీలు, యూనివర్సిటీలలో ఉద్యోగులు హెచ్1 బి వీసాలపైనే పనిచేస్తున్నారు. న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీలో 693 మంది ఉద్యోగులు హెచ్1బి వీసాలపై పనిచేస్తున్నారు. అనేకమంత్రి గ్రా మీణ, పట్టణ ప్రాంతాలలో కూడా విద్యార్థులు వారే ఉన్నారు. టెక్నాలజీ, ఇండస్ట్రీ, ఫైనాన్స్ వంటి కీలక రంగాలలో కూడా హెచ్1బి వీసా దారులే ఉన్నారు. ఈ రంగాలలో 13,000 మంది కీలక బాధ్యతల్లో ఉన్నారు. చాలా నైపుణ్యంతో కూడుకున్న విదేశీ వృత్తినిపుణులను హెచ్1 బి వీసాల కింద అనుమిస్తారని, ఎక్కువగా భారతీయులే ఈ వీసాలను ఉపయోగిస్తారని, వారికి ఈ ఫీజు ధర అందుబాటులో లేకుండాపోయిందని కోర్టుకు తెలియజేశారు. ఈ కొత్త విధానంవల్ల వృత్తినిపులు దేశంలోకి వచ్చే అవకాశం ఉండదని, ఇది కొరతకు దారితీస్తుందని తెలిపారు.
నైపుణ్యంగల వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, ఇతర కార్మికులు ఈ వీసాల కింద వచ్చి దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని, కొత్త ఆంక్షలవల్ల విద్యా, వైద్య, సాంకేతిక రంగాలు నష్టపోతాయని అటార్నీ జనరల్స్ కూటమి పేర్కొంది. ట్రంప్ యంత్రాంగం అక్రమంగా ఈ విధానంపై దాడిచేసి విచ్ఛిన్నం చేస్తోందని, మరింత సంక్లిష్టంగా మార్చిందని, న్యూయార్క్‌లో ఆరోగ్యరంగం సమస్యలో పడుతుందని తెలిపారు. పిల్లల విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమవుతుందని కోర్టు దృష్టికి తెచ్చారు. 'ఈ గందరగోళం సర్దుమణిగే వరకూ పోరాటం చేస్తా' అని అటార్నీ జనరల్ జేమ్స్ చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో ట్రంప్ లక్ష డాలర్లు కొత్త వీసా ధర చెల్లింపు విధానం ప్రకటించారు.

## దారుణ స్థితి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను అతిగా వినియోగించుకోవడం వల్ల 60 ఏండ్లకు రావాల్సిన అనారోగ్య సమస్యలు 3 ఏండ్లకే వస్తున్నాయంది. ఐటీ, హెల్త్ బీమాలను ఏళ్లతరబడి చెల్లించిన వాళ్లకు చివరికి అవి లేకుండాపోతున్నాయని చెప్పింది. సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రతల కోసం చట్టాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పింది. జీవన విధానానికి విరుద్ధంగా విధులను నిర్వహించే సాఫ్ట్ వేర్ ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చట్టాలు చేయాలంది.
అగ్రిమెంట్ కండిషన్స్కు విరుద్ధంగా రాజీనామా చేస్తున్నందుకు రూ.5.9 లక్షల పరిహారం చెల్లించాలని ఐటీ కంపెనీ డిమాండ్ చేయడంపై లేబర్ డిపార్ట్మెంట్కు ఫిర్యాదు చేసే చర్యలు లేవంటూ సాఫ్ట్వేర్ ఉద్యోగి రాజేశ్ వేసిన పిటిషన్ జస్టిస్ నగేశ్ భీమపాక పైవిధంగా తీర్పు చెప్పారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం ఒక వ్యక్తిని చట్టబద్ధమైన వృత్తి, వ్యాపారం, వాణిజ్యం చేపట్టకుండా నిరోధించేందుకు వీల్లేదన్నారు. పిటిషనర్ 2019లో ఉద్యోగంలో చేరినపుడు అగ్రిమెంట్ పేప్ప సంతకం చేశారని, 2022 వరకు ఉద్యోగం చేశారని, అందుకు అనుగుణంగా అగ్రిమెంట్‌ను పెంచారని తప్పుపట్టారు. దీనిపై కార్మికశాఖ చట్టాలను అమలు గురించి చర్యలు తీసుకోవాలన్నారు. విజయా బ్యాంక్ వర్సెస్ ప్రశాంత్ బి. నర్నవారె కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావించారు. ఈ కేసులో పిటిషనర్ చెల్లించాలన్న పరిహారాన్ని కంపెనీ ఏ ప్రాతిపదికన నిర్ణయించిందో తేల్చాలని కార్మిక శాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలంటూ కంపనీకి ఆదేశించారు. ఉద్యోగుల హక్కులు హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సామాజిక భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు వీరి అంశాలపై అధ్యయం చేయాలని సూచన చేశారు. వాళ్ల హక్కుల రక్షణకు చట్టాలు రూపొందించాలన్నారు. చట్టబద్ధ ఆరోగ్య రక్షణ, ఏకపక్షంగా ఉద్యోగులను తొలగించడంపై ప్రభుత్వాలు చట్టాలు చేయాలన్నారు. విదేశీ మారక ద్రవ్యానికి తోడ్పడుతున్న మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు సామాజిక భద్రత కల్పన ఎంతో అవసరమన్నారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం అగ్రిమెంట్ అమలుకు వీల్లేదన్నారు. 2019లో పిటిషనర్ విధుల్లో చేరారు. 2022 వరకు పనిచేశారు. ఎప్పటికప్పుడు అగ్రిమెంట్ను పెంచుకుంటూ చట్ట నిబంధనలను తప్పించుకునే ప్రయత్నం కంపెనీ చేసిందని తప్పుపట్టారు. ఐటీ కంపెనీలు కార్మిక చట్టాలను అమలు చేస్తున్నాయో లేదో లేబర్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు సమీక్ష చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో కంపెనీ ఏ ప్రాతిపదికన కంపెనీ పరిహారం నిర్ణయించిందో తేల్చాలని కార్మికశాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలని ఐటీ కంపెనీని ఆదేశించారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

### ముగ్గురి దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఒడిశా :** కియోంజార్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాలోని కియోంజార్ జిల్లాలో చందపాసి–పాండపద రోడ్డుపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అసనాబహలి గ్రామానికి చెందిన దుశాసన బారిక్ (40), బాలబద్రాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ సేనాపతి (25), మనోజ్ కుమార్ దలే(25)ను మృతులుగా గుర్తించారు. రాజునాయక్, రాహుల్‌నాయక్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com